ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 16.05.2025 | సంపుటి :11 సంచిక : 297 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370








తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




శుభాంశు శుక్లా రోదసి యాత్ర

## జూన్ 8న..

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసియాత్ర ప్రయాణ తేదీ ఖరారైంది. యాక్సియం-4 (ఏఎక్స్-4) మిషన్‌లో భాగంగా జూన్ 8న ఆయన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పయనం కానున్నారు. ఈ మేరకు యాక్సియం స్పేస్, నాసా ఓ సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. వాస్తవానికి మే 29వ

మిగతా 2లో..



## మాటలతో హింసించారు

నిద్రపోనివ్వకుండా రహస్యాలు అడిగి వేధించారు

పాక్ చెరలో అకృత్యాల గురించి వివరించిన బీఎస్ఎఫ్ జవాన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం

మిగతా 2లో..

## మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి

# పుష్కర స్నానం

- ఘనంగా ప్రారంభమైన సరస్వతీనది పుష్కరాలు
- కాళేశ్వరం ఆలయాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తాం
- అందుకోసం రూ.200 కోట్లైనా కేటాయించేందుకు సిద్ధం
- సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి



2లో

## గిరిజన రైతుల ఆర్థిక అభివృద్ధికి

# ఇందిర సౌరగిరి జల వికాసం

పథకం జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం • రూ.12,600 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు

అమ్రాబాద్ మండలం మాచారంలో 18న పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి):యూపీఏ ప్రభుత్వం 2006లో తీసుకొచ్చిన ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారంగా తెలంగాణలో హక్కు పత్రాలు పొందిన గిరిజన రైతుల ఆర్థిక జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రజా ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని రూపకల్పన చేసింది.

మిగతా 2లో..

# భారత్‌కు అందని యాపిల్

యాపిల్ తయారీ ప్లాంట్లు తరలివస్తాయని ఆశలు పెట్టుకొన్న భారత్‌కు నిరాశే మిగిలేట్లు ఉంది. బుధవారం ఖతార్‌లో జరిగిన ఓ సమావేశం సందర్భంగా యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో ట్రంప్ భేటీ అయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా టిమ్‌కుక్‌తో మాట్లాడి భారత్‌కు ప్లాంట్లను తరలించొద్దని కోరారట. అందుకు యాపిల్ సీఈవోకు అంగకరించాడని కూడా తెలిపారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడే స్వయంగా వెల్లడించారు. దీంతో యాపిల్ ఎన్నో ఆశలు పెట్టుకున్న భారత్‌కు నిరాశే మిగలనుంది.

## ఇండియాకు సంస్థ పాంట్ల తరలింపును అడ్డుకున్న ట్రంప్



- ఈ విషయాన్ని తానే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు
- తన విజ్ఞప్తిని యాపిల్ అంగీకరించింది
- దుబాయ్‌లో సీఈవో టిమ్‌కుక్‌తో భేటి

న్యూఢిల్లీ(జనంసాక్షి):యాపిల్ తయారీ ప్లాంట్లు తరలివస్తాయని ఆశలు పెట్టుకొన్న భారత్‌కు నిరాశే మిగిలేట్లు ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా టిమ్‌కుక్‌తో మాట్లాడి.. భారత్‌కు ప్లాంట్లను తరలించొద్దని కోరారట. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడే స్వయంగా వెల్లడించారు. "నాకు టిమ్ కుక్‌తో నిన్న చిన్న సమస్య ఎ దురైంది. అతడు భారత్‌లో తయారీ కర్మాగారాల నిర్మా ణాలు చేపట్టారు. అలా చేయడం నాకు ఇష్టం లేదని చెప్పాను. ఫలితంగా అమెరికాలో ఉత్పత్తి పెంచేందుకు యాపిల్ అంగీకరించింది" అని వ్యాఖ్యానించారు. నిన్న ఖతార్‌లో జరిగిన ఓ సమావేశం సందర్భంగా యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో ట్రంప్ భేటీ అయ్యారు. అమెరికా ఉత్పత్తులపై అత్యధిక టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటని

మిగతా 2లో..

# మమ్మల్ని ప్రశ్నించే అధికారం మీకుందా?

## భారత రాజ్యాంగంలో అలాంటి ప్రొవిజన్ ఉందా?



- సుప్రీం కోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూటి ప్రశ్న
- తమిళనాడు గవర్నర్ కేసులో తీర్పుపై అభ్యంతరం
- రాజ్యాంగ ధర్మాసనం సమాధానం ఇస్తుందా అనే ఉత్కంఠ!

న్యూఢిల్లీ(జనంసాక్షి):తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పుసందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను పరిశీలన పేరుతో గవర్నర్లు, రాష్ట్రపతి నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిందేనని ధర్మాసనం ఆదేశించింది. అయితే, తాజాగా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయని సుప్రీంను ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్

మిగతా 2లో..



## యాదగిరి గుట్టలో అందాల భామల సందడి

పోచంపల్లిలో స్వయంగా చీరలను నేసిన ప్రపంచ సుందరీమణులు

యాదగిరిగుట్ట, భువనగిరి(జనంసాక్షి):మిస్‌వరల్డ్ పోటీదారులు గురువారం సాయంత్రం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో చేరుకున్న సుందరీమణులు అఖండ దీపారాధన మండపంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు. అక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆలయ

మిగతా 2లో..

## ఈడీ సోదాలు

హైదరాబాద్, ముంబయిలో రూ.32 కోట్ల నగదు, బంగారం స్వాధీనం

హైదరాబాద్(జనంసాక్షి): ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్‌లో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. దర్యాప్తులో భాగంగా గురువారం ముంబయి, హైదరాబాద్‌తో పాటు 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలు స్వాధీనం


మిగతా 2లో..



## పర్యావరణ నష్టాన్ని పూడ్చాల్సిందే..

### పనులకు అనుమతులు తీసుకున్నారా?

- వారాంతాల్లో మాత్రమే హడావిడిగా పనులు ఎందుకు చేపట్టారు?
- నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా తెలపండి
- లేకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుంది
- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రశ్నించిన సుప్రీం
- జూలై 18కి వాయిదా వేసిన ధర్మాసనం



న్యూఢిల్లీ,మే15(జనంసాక్షి):హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెటారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్

మిగతా 2లో..

కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు

## ముందు వెళ్లి క్షమాపణలు చెప్పండి

- మధ్యప్రదేశ్ మంత్రికి సుప్రీం ఆదేశాలు
- సోఫియా ఖురేషీ కుటుంబీకులపై దుష్ప్రచారం
- చర్యలకు హోంమంత్రి ఆదేశం!

న్యూఢిల్లీ(జనంసాక్షి):సైనికాధికారి కర్నల్ సోఫి యా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసినం దుకు ముందుగా క్షమాపణలు చెప్పాలని మధ్యప్రదేశ్ మంత్రిని సుప్రీం ఆదేశించింది. ముందు వెళ్లి హైకోర్టులో క్షమా పణలు చెప్పండి. ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరిం చండని ఆగ్రహం వ్యక్తంచేసింది. పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై

మిగతా 2లో..

వక్ఫ్ సవరణ బిల్లు చెల్లుబాటు కేసు

## మే20కి వాయిదా వేసిన సుప్రీం కోర్టు

వార్త 9లో



## జమ్మూకశ్మీర్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్

కాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లు మృతి

శ్రీనగర్(జనంసాక్షి): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట కొనసాగుతోంది. పుల్వామా జిల్లాలోని త్రాల్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో భద్రతా బలగాలు తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలోనే నాదిర్ గ్రామంలో గాలింపు చేస్తుండగా.. ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు చేపట్టారు.

మిగతా 2లో..

హుస్నాబాద్,సిరిసిల్లలో

## సైనిక్ స్కూల్

రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించా

విద్యార్థుల ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించండి

సీఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ

హైదరాబాద్(జనంసాక్షి): సైనిక్ స్కూల్ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హుస్నాబాద్,సిరిసిల్ల జిల్లాలో సైనిక్ స్కూల్ కోసం గత నెల 15న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ను కలిశానని వివరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సైనిక్ స్కూల్ ఏర్పాటు- కోసం

మిగతా 2లో..



## అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత భయంతోనే

### మోదీ కులగణనకు ఒప్పుకున్నాడు



- ప్రతిపక్షాల డిమాండ్ మేరకే ప్రధాని అందుకు అంగీకరించారు
- ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసు: రాహుల్ గాంధీ

దర్భంగా(జనంసాక్షి):దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరఫున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దే శించి ఆయన మాట్లాడారు. తాను ఇక్క డికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన

మిగతా 2లో..

## ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేయండి

- అప్పడే సింధూజలాల గురించి ఆలోచిస్తాం
- విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టీకరణ
- ట్రంప్ 'జీరో టారిఫ్' వ్యాఖ్యలపై ఇప్పుడే ఏమీ చెప్పలేమని వెల్లడి



న్యూఢిల్లీ,మే15(జనంసాక్షి): ఆపరేషన్ సిందూర్ తర్వాత, భారత్‌కు అంతర్జాతీయ సమాజం నుంచి మంచి మద్దతు లభిస్తుందని భారత విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత, భారతదేశం సింధు జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయంపై మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేసే వరకూ ఈ ఒప్పందం నిలిపివేయబడుతుందన్నారు. ఈ క్రమంలో కశ్మీర్‌పై చర్చించాల్సిన ఒకే ఒక అంశం ఉందన్నారు. అది పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఖాళీ చేయడం. దీని గురించి చర్చకు మేము సిద్ధంగా ఉన్నామని జైశంకర్ మరోసారి స్పష్టం చేశారు. కశ్మీర్ సమస్యపై ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో మూడో దేశం జోక్యం అవసరం లేదని, ఇది భారత్-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక అంశమని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు.

మిగతా 2లో..

## పాక్ అణ్వాయుధాల రక్షణపై అనుమానంగా ఉంది

అంతర్జాతీయ అణు ఇంధనఏజెన్సీ స్వాధీనం చేసుకోవాలి

పాక్ కుట్రలను తిప్పికొట్టిన భారత దళాలకు సెల్యూట్

కాశ్మీర్ పర్యటనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):బాధ్యతలేని, దుష్ట పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలు ఉండడం ఎంత వరకు క్షేమం అని ప్రపంచ దేశాల్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. కాశ్మీర్‌లో పర్యటించిన సందర్భంగా శ్రీనగర్‌లోని బాదామి బాగ్ కంటోన్మెంట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న

మిగతా 2లో..



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
16.05.2025

## కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు

మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్‌షా చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశా యి. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయనపై కేసు కూడా నమోదైంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సు ప్రీంకోర్టుకు చేరింది. హైకోర్టు ఆదేశాలపై ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మం త్రి పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు కోర్టు అంగీకరించింది. అంతేగాకుండా ఆయన తీరును తప్పుపట్టింది. ఎలాంటి మాటలు మాట్లాడుతు న్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలను వెల్లడించిన కర్నల్ ఖురేషీని ఉద్దేశిస్తూ ఆమెను 'ఉగ్రవాదుల సోదరి' అని విజయ్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇదికాస్త తీవ్ర దుమారం రేగడంతో మంత్రి వ్యాఖ్యలను హైకోర్టు బుధవారం సుమోటోగా తీసుకుంది. శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించినందుకు ఆయనపై ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేయాలని జస్టిస్ అతుల్ శ్రీధరణ్, జస్టిస్ అనురాధా శుక్లాలతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి తమకు నివేదించాలని రాష్ట్ర డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ... దేశంలో ఇంకా సమగ్రత, క్రమశిక్షణ, త్యాగం, నిస్వార్థం, గౌరవం, అజేయమైన ధైర్యం నిండి ఉన్న సంస్థ ఒక్క సైన్యం మాత్రమేనని పేర్కొన్నారు. అటు జాతీయ మహిళా కమిషన్ కూడా మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న మహిళలపై ఇటు-వంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది. మంత్రి చేసిన వ్యాఖ్యలపై భాజపా సీనియర్ నాయకుడు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. విజయ్ షాను 'మూర్ఖుడు' అని ఆయన సంబోధించారు. మరోవైపు విజయ్ షాపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది.

**సోఫియా ఖురేషీ కుటుంబీకులపై దుష్ప్రచారం..**

**- చర్యలకు హెూంమంత్రి ఆదేశం!**

భారత సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీ కుటుంబీకులపై సోషల్‌మీడియాలో దుష్ప్రచారం కలకలం రేపింది. సోఫియా ఖురేషీ అత్తింటిపై దాడి జరిగిందని 'ఎక్స్'లో నకిలీ పోస్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో సదరు 'ఎక్స్' ఖాతాదారుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. "బెళగావిలోని కర్నల్ సోఫియా ఖురేషీ అత్తమామల ఇంటిపై దాడి జరిగిందని ఓ 'ఎక్స్' ఖాతాలో నకిలీ పోస్టు బయటకు వచ్చింది. దీంతో అప్రమత్తమై వివరాలు సేకరించాం. ఆ 'ఎక్స్' ఖాతాదారుడిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశాం. ఈ పోస్ట్‌ను రీట్వీట్ చేసిన మరో ఇద్దరిపై కూడా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశాం. ప్రస్తుతం వారి గుర్తింపు వివరాలను ఇంకా ధ్రువీకరించలేదు" అని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

## ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేయండి

పాకిస్థాన్ సైన్యాన్ని కాకుండా,ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని ముందే హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ, పాకిస్థాన్ ఈ సలహాను పట్టించుకోలేదన్నారు. భారతదేశంపై చేసిన దాడికి మా సైన్యం గట్టి ప్రతీకారం తీర్చుకుందన్నారు. శాటిలైట్ చిత్రాలు ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్‌కు జరిగిన భారీ నష్టాన్ని, భారతదేశానికి అతి తక్కువ నష్టాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని జైశంకర్ గుర్తు చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత తీవ్రవాద రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థను నిషేధించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ డిమాండ్ చేసింది. ఈ సంస్థకు వ్యతిరేకంగా ఆధారాలను సమర్పించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. జైశంకర్ ఈ విషయంపై మాట్లాడుతూ పహల్గామ్ దాడిలో దోషులకు కఠిన శిక్ష విధించాలని ఐక్యరాజ్య సమితి సభ్యులు స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్‌కు అంతర్జాతీయ మద్దతు లభిస్తోందన్నారు. భారత్ దాడి తర్వాత పాకిస్థాన్ కూడా చైనా డ్రోన్‌లను ఉపయోగించినట్లు-జైశంకర్ వ్యాఖ్యానించారు. ప్రపంచం ఈ దాడిని చూసిందని అన్నారు.

**'జీరో టారిఫ్' ఇప్పుడే ఏమీ చెప్పలేము**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాల్పులు విరమణకు ఎవరు పిలుపునిచ్చారో స్పష్టంగా వెల్లడైందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. అలాగే చాలా వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లు ఆఫర్ చేసిందని అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందం గురించి ఆయన మాట్లాడుతూ.. "మేం ఆ దేశ మిలిటరీపై దాడి చేయలేదు. మే 7న వెనక్కి తగ్గడానికి ఇష్టపడనివారు.. మే 10న మాత్రం తగ్గారు. కాల్పుల విరమణ ఎవరు కోరుకున్నారో దీనిని బట్టి తెలుస్తోంది" అని మంత్రి అన్నారు. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. భారత్-పాక్ ఉద్రిక్తతలకు తెరదించని పక్షంలో వాణిజ్యం నిలిపేస్తానంటూ ఇరుదేశాలకూ స్పష్టం చేశానని.. ఈ క్రమంలో అవి అంగీకారానికి వచ్చాయని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అలాగే తమ దేశం నుంచి దిగుమతి చేసేకొనే చాలా రకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లను ఆఫర్ చేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన సంచలన ప్రకటనపైనా జైశంకర్ స్పందించారు. "రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అవి సంక్లిష్ట చర్చలు. ప్రతి అంశంపై నిర్ణయం తీసుకునేవరకు అవి కొనసాగుతూనే ఉంటాయి. వాణిజ్య ఒప్పందం పరస్పరం ప్రయోజనకరంగా ఉండాలి. అది జరిగేవరకు దాని గురించి ప్రకటన చేయడం తొందరపాటే అవుతుంది" అని ట్రంప్ ప్రస్తావన లేకుండా మంత్రి మాట్లాడారు. పాకిస్థాన్‌తో మరీ ముఖ్యంగా కశ్మీర్ విషయంలో మూడోపక్షం జోక్యాన్ని భారత్ అనుమతించదు. కేంద్రంలోని ప్రతి ప్రభుత్వమూ ఇదే వైఖరిని అనుసరిస్తోంది. అలాంటిది.. తాజా ఉద్రిక్తతల వేళ కాల్పులు విరమణ గురించి ట్రంప్ ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. మన దేశ సమస్య అయిన కశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా చేయడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందంపై తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం మొదలైన విషయాలు చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానిని కోరిన సంగతి తెలిసిందే.

## గిరిజన రైతుల ఆర్థిక అభివృద్ధికి 'ఇందిర సౌర గిరి జల వికాసం'

ఈ పథకానికి సంబంధించి గురువారం గిరిజన సంక్షేమ శాఖ సెక్రెటరీ డాక్టర్ ఏ శరత్ జీవో విడుదల చేశారు. 2006 సంవత్సరంలో వచ్చిన ఈ చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఆర్ ఓ ఎఫ్ ఆర్ హక్కు పత్రాలు పొంది ఉన్న 2.10 లక్షల మంది రైతులకు ఐదు సంవత్సరాలలో ఆరు లక్షల ఎకరాలకు సౌర విద్యుత్ ద్వారా సాగునీరు అందించేందుకు రూపకల్పన చేసిన ఈ పథకానికి 12,600 కోట్ల రూపాయలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ పథకాన్ని ఈ నెల 18న అచ్చంపేట నియోజకవర్గంఅమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గారల చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించడానికి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పర్యవేక్షణలో ఈ పథకం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్ల పనులను అధికారులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. 2006 సంవత్సరంలో యూపీఏ ప్రభుత్వం ఆర్ ఓ ఎఫ్ ఆర్ యాక్టు తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఆరు లక్షల 69 వేల ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. గత దశాబ్ద కాలం అధికారంలో ఉన్న గత పాలకులు గిరిజన రైతులుకు సాగునీరు అందించడం, మంచి పంటలు పండించడానికి తగిన సహాయం చేయడానికి ఎలాంటి పథకాన్ని తీసుకురాలేదు. ఇందిరమ్మ రాజ్యంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం అడవిలో పుట్టి అడివిలో పెరిగి అడవినే జీవనాధారం చేసుకుని బతుకుతున్న గిరిజనుల ఆర్థిక జీవన ప్రమాణాలు పెంచడానికి ఆలోచన చేసి ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ద్వారా భూ పట్టాలు ఇచ్చిన గిరిజన రైతులు పంటలు పండించుకోవడానికి ఇందిరా సౌర గిరి జిల్లా వికాసం కొత్త పథకాన్ని తీసుకొచ్చింది.

# భారత్‌కు అందని యాపిల్




ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.ఇప్పటికే చైనాపై భారీగా టారిఫ్‌లు విధించడం.. అమెరికాతో దానికి మధ్య తీవ్రమైన అభిప్రాయ భేదాలు ఉండటంతో యాపిల్ అప్రమత్త మైంది. అగ్రరాజ్యానికి అవసరమైన ఐఫోన్లు మొత్తాన్ని భారత్‌లో తయారు చేయించి ఎగుమతి చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. మన దేశంలో ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలు ఐఫోన్ అసెంబ్లింగ్ చేస్తున్నాయి. ఇటీవల కంపెనీ సీఈవో టిమ్ కుక్ కూడా ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికా మార్కె ట్లో జూన్ త్రైమాసికంలో విక్రయించే ఐఫోన్లలో అత్య ధికంగా భారత్‌లో తయారైనవే ఉంటాయని.. అదే ఐపాడ్స్, మ్యాక్ బుక్, యాపిల్ వాచ్‌లు, ఎయిర్‌పాడ్స్ వంటివి మా త్రం వియత్నాం నుంచి దిగుమతి చేసుకొం టామన్నారు. తమ దేశం నుంచి దిగుమతి చేసేకొనే చాలా రకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లను ఆఫర్ చేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. "అమెరికాకు భారత్ ఓ డీల్‌ను ఆఫర్ చేసింది. ఇది ప్రాథమికంగా జీరో టారిఫ్‌లది" అని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికే భారత్-అమెరికా దేశాలు వాణిజ్య ఒప్పందంపై జోరుగా చర్చలు జరుపుతున్నాయి. వీటి పురోగతి గొప్పగా ఉందని ఏప్రిల్ 30వ తేదీ ట్రంప్ స్వయంగా వెల్లడించారు. త్వరలోనే ఒప్పందానికి వస్తామని నాడు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి పుష్కర స్నానం

- ఘనంగా ప్రారంమైన సరస్వతీనది పుష్కరాలు
- కాళేశ్వరం ఆలయాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తాం
- అందుకోసం రూ.200 కోట్లైనా కేటాయించేందుకు సిద్ధం
- సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి



**కాళేశ్వరం(జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సరస్వతీనది పుష్కరస్నానమాచరించారు.అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు.గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. ఇవాళ వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు.

సరస్వతి నవరత్న మాల హారతి

ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భక్తులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది. ప్రతిరోజు సగటున లక్షన్నర మంది వస్తారని దేవాదాయశాఖ అంచనా వేసింది.

కాళేశ్వరం ఆలయాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

కాళేశ్వరం: కాళేశ్వరం ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సరస్వతి పుష్కరాల్లో భాగంగా హారతి కార్యక్రమంలో సీఎం, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కాళేశ్వరం అభివృద్ధి కోసం రూ.200 కోట్లు అయినా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగాన్ని సీఎం అభినందించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం తొలిసారిగా టెంట్ సిటీ ఏర్పాటు చేశామన్నారు. "త్వరలోనే గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా రానున్నాయి. వచ్చే గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు కాళేశ్వరం క్షేత్రానికి వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం. గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహించే అదృష్టం నాకు కలగనుంది" అని సీఎం అన్నారు.

## యాదగిరి గుట్టలో అందాల భామల సందడి

యాదగిరిగుట్టను సందర్శించిన ప్రపంచ సుందరీమణులు ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు.

**పోచంపల్లిలో అందాల భామలు**

టూరిజం విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పోచంపల్లిని ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. వారికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇక్కత్ చీరల ప్రత్యేకత, తయారీ విధానాన్ని విదేశీ అతిథులు పరిశీలించారు. పలువురు భామలు స్వయంగా చీరలను నేసి సంబరపడ్డారు.

## పర్యావరణ నష్టాన్ని పూడ్చాల్సిందే..

బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు- తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. హెచ్‌సీయూలో 120 ఎకరాల్లో చెట్ల కూల్చివేత విధ్వంసంపై సుప్రీం కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని మే 15 వరకు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీయూలో విధ్వంసానికి సంబంధించిన వివరాలన్నింటిని పరిశీలించడానికి ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ- హెచ్‌సీయూ విధ్వంసాన్ని పరిశీలించింది. అక్కడి విద్యార్థి సంఘాల నాయకుల అభిప్రాయాలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ నాయకుల ఒపీనియన్స్ సైతం సేకరించింది. కాగా, అక్కడ జరిగింది విధ్వంసమే.. చెట్లు-, జంతువులకు తీవ్ర నష్టం వాటిల్లిందని నివేదికను ఏప్రిల్ 15న కమిటీ- సుప్రీం కోర్టుకు సమర్పించింది. అదే రోజు ప్రభుత్వం సైతం నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో మే 15 వరకు మీరు హెచ్‌సీయూ అడవుల్లో కూల్చిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని కోర్టు ప్రశ్నించింది. గతంలో విచారణ సమయంలోనూ తెలంగాణ ప్రభుత్వం సరైన నివేదిక ఇవ్వాలని.. అలా ఇవ్వకపోతే సీఎస్‌ను జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించిన విషయం విధితమే. చెట్లను నాటడానికి ఏ విధమైన పద్ధతులను అనుసరిస్తారో చెప్పాలంటూ సూచించింది. ఈ విషయంలో ప్రభుత్వం, సీఎస్‌ను ఎవరినీ కూడా ఉపేక్షించబోమని హెచ్చరించింది.

**శుభాంశు శుక్లా రోదసి యాత్ర జూన్ 8న**

తేదీకే ఈ మిషన్‌ను షెడ్యూల్ చేయగా.. కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. దీంతో వచ్చే నెలలో ప్రయోగం చేపట్టనున్నారు.భారత కాలమానం ప్రకారం జూన్ 8వ తేదీ సాయంత్రం 6.41 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 9.11 గంటలకు) ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో శుభాంశు రోదసిలోకి దూసుకెళ్లనున్నారు. ఈ యాత్రలో శుక్లాతోపాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) కూడా వెళ్లనున్నారు.

## ఈడీ సోదాలు

చేసుకున్నట్టు ఈడీ తెలిపింది.ముంబయిలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు 2009 నుంచి అనుమతులు ఇచ్చారు. ఈ కేసులో సీతారాం గుప్తా, అరుణ్ గుప్తా కీలక నిందితులుగా ఉన్నారు. నిందితులు అధికారులతో కలిసి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రజలకు విక్రయించినట్టు దర్యాప్తులో తేలింది. ఇందులో భాగంగా వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. సోదాల్లో నిందితుల ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది.

## పాక్ అణ్వాయుధాల రక్షణపై అనుమానంగా ఉంది

పాకిస్థాన్ వద్ద న్యూక్లియర్ ఆయుధాలు ఉండడం ఎంత వరకు సమంజసం అని రాజ్‌నాథ్ అడిగారు. అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ .. పాకిస్థాన్ అణ్వాయుధాలను తన ఆధీనంలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగిన దాడిలో.. కిరానా హిల్స్ సమీపంలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌ను భారతీయ వైమానిక దళాలు దాడి చేశాయి. అయితే ఆ ఎయిర్‌బేస్ వద్ద న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను పాకిస్థాన్ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. దాడి జరగడం వల్ల ఆ న్యూక్లియర్ వార్‌హెడ్స్ నుంచి అణుధార్మికత రిలీజ్ అవుతున్నట్లు- ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో శ్రీనగర్ పర్యటనలో రక్షణ మంత్రి తన ప్రసంగంలో ఆ అంశాన్ని ప్రస్తావించారు. పెహల్గామ్ దాడి తర్వాత జమ్మూకశ్మీర్ ప్రజల్లో పాకిస్థాన్, ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తం అయ్యిందని, జమ్మూకశ్మీర్ ప్రజలకు సెల్యూట్ చేస్తున్నానని, శుత్రవులను నాశనం చేసిన శక్తి ఇక్కడ ఉందని, పాకిస్థానీ చౌకీలు, బంకర్లను ధ్వంసం చేసిన తీరుతో శత్రుదేశం షాక్‌కు గురైందన్నారు. కిష్టమైన పరిస్థితుల్లో ఇక్కడ మీతో ఉండడం గర్వంగా భావిస్తున్నానని, ఆపరేషన్ సింధూర్ సమయంలో మీరు చేసిన పని పట్ల దేశం గర్వంగా ఉందన్నారు. రక్షణ మంత్రి కన్నా ముందు తాను దేశ పౌరుడినని, ఓ మంత్రిగానే కాకుండా, ఓ పౌరుడిగా ధన్యవాదాలు చెబుతున్నట్లు రాజ్‌నాథ్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న రాజ్‌నాథ్‌కు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది స్వాగతం పలికారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ఉగ్ర శిబిరాలు ఎక్కడ ఉన్నా నాశనం చేస్తామని చెప్పారు. -టె-ర్రరిస్టులతో పోరాడి ప్రాణత్యాగాలు చేసిన జవాన్లకు శిరస్సు వంచి నివాళులర్పిస్తున్నట్లు- పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని.. అదొక కమిట్‌మెంట్ అని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రదాడి జరిగితే.. దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామన్నారు. మన దళాలు అద్భుతంగా పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా వారి మధ్య ఉన్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఆయన నివాళులర్పించారు. ఇక ఈ పర్యటనలో భాగంగా పాకిస్థాన్ షెల్లింగ్‌లో దెబ్బతిన్న ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఇక మన దళాల సంసిద్ధతను ఆయన పర్యవేక్షించనున్నారు.

# మమ్మల్ని ప్రశ్నించే అధికారం మీకుందా?



గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబీ పార్దీవాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం. ఆర్టికల్ 200 కింద బిల్లును ప్రవేశపెట్టినప్పుడు గవర్నర్‌కు అందుబాటులో ఉన్న రాజ్యాంగ ఎంపికలు ఏమిటి? ఈ ఎంపికలను అమలు చేయడంలో గవర్నర్ మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉంటారా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణాధికారం వినియోగించడం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ చర్యలను న్యాయపరంగా పరిశీలించడానికి ఆర్టికల్ 361 పై సంపూర్ణ నిషేధాన్ని విధిస్తారా? రాజ్యాంగం ప్రకారం కాలపరిమితి లేకపోయినప్పటికీ ఆర్టికల్ 200 కింద గవర్నర్లు తమ అధికారాలను వినియోగించు కునేటప్పుడు కోర్టులు గడువులు విధించవచ్చా, విధానాలను సూచించవచ్చా? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి విచక్షణాధికారం వినియోగించడానికి కోర్టులు కాలపరిమితిని, విధానపరమైన అవసరాలను నిర్ణయించగలవా?గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునేటప్పుడు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరాలా? ఒక చట్టం అధికారికంగా అమల్లోకి రాకముందు గవర్నర్, రాష్ట్రపతి ఆర్టికల్ 200, 201 ప్రకారం తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమైనవేనా? ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్ వినియోగించే రాజ్యాంగ అధికారాలను న్యాయవ్యవస్థ సవరించగలదా లేదా అధిగమించగలదా?ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర చట్టం అమలులోకి వస్తుందా? సుప్రీంకోర్టులోని ఏదైనా బెంచ్ ముందుగా ఒక కేసుకు గణనీయమైన రాజ్యాంగ వివరణ అవసరమా అని నిర్ణయించి దానిని ఆర్టికల్ 145(3) ప్రకారం ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌కు నివేదించాలా? ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేయడం సబబేనా? ఆర్టికల్ 131 కింద దావా వేయడం ద్వారా కాకుండా వేరే మార్గాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టును రాజ్యాంగం అనుమతిస్తుందా? అంటూ ప్రశ్నలు సంధించారు. కాగా, రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలకు గల అధికారాల పరిమితిపై రాష్ట్రపతి ముర్ము సంధించిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## హుస్నాబాద్,సిరిసిల్ల జిల్లాలో సైనిక్ స్కూల్

వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారన్నారు. తన విజ్ఞప్తికి రాజ్‌నాథ్ సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందనన్నారు. దీనిపై రాజకీయం చేయడం తగదని బండి హెచ్చరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి సహకరించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా కలిసిరావాలని కోరుతున్నామన్నారు.

**విద్యార్థుల ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించండి**

**- సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ**

**హైదరాబాద్(జనంసాక్షి):** తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు- కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.

## జమ్మూకశ్మీర్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్..

ఈ ఎన్‌కౌంటర్‌లో జైషే మహ్మద్ ముఠాకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు వెల్లడించారు. హతులను ఆసిఫ్ అహ్మద్ షేక్, ఆమిర్ నజీర్ వని, యావర్ అహ్మద్ భట్‌గా గుర్తించారు. పహల్గాం ఉగ్రదాడిలో వీరి హస్తం ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా.. జమ్మూకశ్మీర్ లో ఎన్‌కౌంటర్ జరగడం 48 గంటల్లో ఇది రెండోసారి. మంగళవారం షోపియాన్ ప్రాంతంలోని జిన్‌పాథర్ కెల్లర్‌లో చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వీరిని లష్కరే తయ్యిబాకు చెందిన ముఠా సభ్యులుగా గుర్తించారు. కశ్మీర్ లోయలో పలు దాడులకు పాల్పడినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి.ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు అతి సమీపం నుంచి కాల్పులు జరిపిన అనంతరం అటవీ ప్రాంతంలోకి పారిపోయారు. వీరికోసం భద్రతా సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్నారు.

## మాటలతో హింసించారు

(బీఎస్ఎఫ్) జవాన్ పూర్ణమ్ కుమార్ షా విడుదలైన సంగతి తెలిసిందే. పాక్ అదుపులో ఉన్నప్పుడు ఆయనను నిద్ర పోనివ్వలేదని, దూషించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిర్బంధంలో ఉన్నన్ని రోజులు పాక్ అధికారులు పూర్ణమ్‌ను మూడు ప్రాంతాల్లో తిప్పి ఒక లొకేషన్‌లో జైలు సెల్‌లో ఉంచారు. వారివద్ద ఉన్నన్ని రోజులు చాలావరకు కళ్లకు గంతలు కట్టే ఉంచారని సమాచారం. ఆయనను శారీరకంగా హింసకు గురిచేయలేదు కానీ.. మాటలతో మాత్రం వేధింపులకు గురిచేశారని ఆ వర్గాలు వెల్లడించాయి. కనీసం నిద్ర పోనివ్వలేదని, బ్రష్ చేసుకోవ్వలేదని తెలిపాయి. అలాగే సరిహద్దులో మోహరింపు గురించి, అక్కడ ఉండే సీనియర్ అధికారుల గురించి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాయి. కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని ఆ అధికారులు ఒత్తిడి చేశారని తెలుస్తోంది. అయితే బీఎస్ఎఫ్ నిబంధనల ప్రకారం ఆయన వద్ద ఎలాంటి ఫోన్ లేకపోవడంతో వారికి వివరాలు అందలేదు.

## అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత భయంతోనే ..

'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. " ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ గేటు బయటే నా కారును నిలిపివేశారు. అయినా, నేను వెనకడుగు వేయలేదు. నడుచుకుంటూ సభా వేదిక మీదికి చేరుకున్నాను. బిహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందో తెలుసా? మీ అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించింది. ఇదే శక్తి నరేంద్ర మోదీని గద్దె దించుతుంది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కులగణను మోదీ అంగీకరించారు.ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కాకుండా...అంబానీ, అదానీల కోసమే పని చేస్తోందని రాహుల్ విమర్శించారు.

# కరేజ్, కాంపాసన్, కమిట్‌మెంట్‌తో
# మహిళలు ముందుకు సాగాలి

- రాష్ట్ర మంత్రి దాసరి అనసూయ (సీతక్క)
- రామప్ప ఆలయాన్ని సందర్శించిన ప్రపంచ సుందరీమణులు
- అపూర్వ ఘన స్వాగతం పలికిన జిల్లా యంత్రాంగం
- గిరిజన సాంప్రదాయ కొమ్ముకోయ నృత్య ప్రదర్శనలతో కళాకారుల స్వాగతం





**ములుగు/వెంకటాపూర్, మే14(జనం సాక్షి):** కరేజ్, కాంపాసన్, కమిట్‌మెంట్‌తో మహిళలు ముందుకు సాగాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి వర్యులు దాసరి అనసూయ (సీతక్క) అన్నారు. రామప్ప ఆలయాన్ని బుధవారం 35 దేశాలకు చెందిన ప్రతినిధులతో కూడిన ప్రపంచ సుందరీమణుల టీమ్ సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ శబరీష్ జిల్లా అధికారులు, టూరిజం శాఖ అధికారులు ప్రపంచ సుందరీమణుల బృందానికి గిరిజన సాంప్రదాయ కొమ్ముకోయ నృత్య కళాకారుల ప్రదర్శన ద్వారా ఆత్మీయ ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత్ర ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురాతన ఆలయం రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్ర ముగ్ధులయ్యారు. ఆలయ తీరుతన్నులను తనివి తీర తిలకించి ఫిదా అయ్యారు. తెలుగుదనం ఉట్టిపడేలా పట్టుచీర/పట్టు పరికిణిలు కట్టుకొని తిలకం దిద్దుకొని అచ్చం తెలంగాణ అమ్మాయిల లాగా రామప్ప ఆలయం ప్రపంచ సుందరిమణులు సందర్శించారు. ఆలయానికి సంబంధించిన చిత్రాలను సెల్ ఫోన్ లలో ఫోటోలు తీసుకున్నారు.ప్రపంచ సుందరిమణుల పర్యటన సజావుగా జరిగేల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రత్యేకంగా పర్యవేక్షించారు. అనంతరం రామప్ప ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వద్ద తెలంగాణ సాహిత్య అకాడమీ మరియు భాషా సాంస్కృతిక శాఖ వారి రాణి రుద్రమదేవి వేషధారణలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ అలేఖ్య పుంజరి ఆధ్వర్యంలో కాకతీయ రాజుల పరిపాలన చారిత్రాత్మక అంశాలను నృత్య రూపం,రంజిత్ పేరణి నృత్య కళా బృందం వారిచే పేరణి నృత్యం,65 మంది పేరణి కళాకారులతో సత్యం శివం సుందరం శివతాండవం, లైట్, సౌండ్ షో ప్రదర్శించారు.అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ,సాంస్కృతిక చారిత్రక కట్టడాలకు నిలయం ములుగు ప్రాంతమని, ఇక్కడికి ప్రపంచ సుందరిమణుల పోటీల కోసం 35 దేశాల నుంచి విచ్చేయడం సంతోషంగా ఉందని అన్నారు.ప్రకృతితో కలిసిపోయి శతాబ్దాల పాటు జీవించిన గిరిజనుల జీవన విధానం,ఆత్మగౌరవం స్వాతంత్రం కోసం రాజులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సమ్మక్క సారలమ్మ ధీరత్వం నిదర్శనం ములుగు జిల్లా అని అన్నారు.మహిళలు ధైర్యవంతులు శక్తివంతులని సమ్మక్క సారలమ్మ, రాణి రుద్రమదేవి నిరూపించారని తెలిపారు. నేడు మంత్రిగా మాత్రమే కాకుండా ఈ ప్రాంత బిడ్డగా ఈ వేడుకకు హాజరు కావడం సంతోషంగా ఉందని,అందం అనేది కేవలం బాహ్యంగా కనిపించేది కాదని, నిజమైన అందం మనసు లోపల ఉంటుందని,ఇతరుల అభివృద్ధి చేయడంలో దాగి ఉంటుందని అన్నారు. ములుగు ప్రాంతం సృజనాత్మకతకు, దైవత్వానికి కేంద్రంగా ఉంటుందని, యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్ప ఆలయం 13వ శతాబ్దంలో కాకతీయ రాజులు నిర్మించారని,ఈ ప్రాంత ఔన్నత్యం గొప్పతనానికి ప్రత్యేకగా ఈ నిర్మాణం నిలుస్తుందని అన్నారు. పూర్వీకులైన కాకతీయ రాజులు టెంపుల్ టౌన్స్ ,ట్యాంక్ నిర్మాణం చేశారని,అదే విధంగా నేడు మహిళలు కరేజ్, కాంపాసన్, కమిట్ మెంట్ పెంచుకోవాలని,దీని ద్వారా మన వ్యక్తిత్వం తో పాటు సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు.ప్రపంచ సుందరిమణుల పోటీల్లో పాల్గొనే మహిళలందరికీ ములుగు ప్రాంత ప్రజల తరపున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క ప్రపంచ సుందరి మనలను డయాస్ మీదికి ఆహ్వానించి గౌరవ సూచీకంగా ఘనంగా సత్కరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో రచించి ముద్రించబడిన కాకతీయుల కళా వైభవం పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య,, జిల్లా కలెక్టర్ టి.ఎస్ దివాకర జిల్లా ఎస్పీ శబరిష ఇతర ప్రజా ప్రతినిధులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో దూకి ఎయిమ్స్ విద్యార్థి ఆత్మహత్య

**యాదాద్రి భువనగిరి, మే 15 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పెద్దచెరువులో దూకి ఎయిమ్స్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎయిమ్స్‌లో అబిజిత్ జాయ్ అనే విద్యార్థి ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం అభిజిత్ చెరువుతో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని చెరువులోని నుంచి బయటకు తీశారు.మృతుడి అభిజిత్ జాయ్‌గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## నాంపల్లి వద్ద రౌడీషీటర్ దారుణ హత్య

**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** నగరంలోని నాంపల్లిలో దారుణం చోటుచేసుకుంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రౌడీషీటర్ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. చాంద్రాయణగుట్టకు చెందిన అయాన్ ఖురేషీ ఓ కేసు నిమిత్తం నాంపల్లి కోర్టుకు వచ్చాడు. అనంతరం తిరిగి వెళ్తుండగా ఐదుగురు దుండగులు ఆయన్ను వెంబడించారు. క్యాన్సర్ ఆస్పత్రి వద్ద తొలుత బ్యాట్‌తో దాడి చేశారు. అనంతరం కత్తులతో గొంతు కోసి పొట్టలో పొడిచి చంపారు. హత్యకు ఉపయోగించిన బ్యాట్, కత్తులను ఘటనాస్థలంలోనే వదిలి పరారయ్యారు. సమాచారం అందుకున్న నాంపల్లి పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. స్థానికులు బయాందోళనలకు గురయ్యారు.

## నిర్మల్ కలెక్టర్‌ను కలిసిన కేంద్రబృందం



**నిర్మల్ రూరల్, మే15 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు సంబంధించి గురువారం కేంద్రీయ విద్యాలయ దక్షిణ భారత విభాగం డిప్యూటీ కమిషనర్ మంజునాథం,అసిస్టెంట్ కమిషనర్ అనురాధ, జిల్లా కలెక్టర్ అభిలాషా అభినవ్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాసర మండలంలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకు అవసరమైన స్థలాలను బృందం పరిశీలించిన విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. వసతి,మౌలిక సదుపాయాలపై చర్చించారు. కేంద్ర విద్యాలయ నిర్మాణానికి అనుకూలమైన ప్రాంతాన్ని గుర్తించేందుకు భౌగోళిక పరిస్థితులు, కమ్యూనికేషన్ సదుపాయాలు,భవిష్యత్ అవసరాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీవోలు రత్న కళ్యాణి,కోమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వర పుష్కరాల నేపథ్యంలో దుమ్ముతో ఇబ్బంది పడుతున్న స్థానికులు



**కాళేశ్వరం, మే 15 (జనంసాక్షి) :** సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలోని మజీదుపల్లి నుండి సరస్వతి ఘాట్ కు వెళ్ళే రహదారి మొత్తం మట్టితో నిండి వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తుంది. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించిన చర్యలు శూన్యం. మజీద్ పల్లి నుండి సరస్వతీ ఘాటుకు రోడ్డుకు ఇరువైపులా రహదారి నిర్మాణానికి స్థలం ఇచ్చినప్పటికీ మట్టితో రోడ్డు నిర్మాణం చేసి దానిపై నీటిని కొట్టకుండా అధికారులు అలసత్వం వహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపించారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి. మే 15 (జనంసాక్షి) :** నియోజక వర్గంలోని పాలకుర్తి. చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణ పనులకు రూ. 50 కోట్లు మంజూరు చేయాలని గురువారం స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. గురువారం సీఎం క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ సమయం దొరికినప్పుడల్లా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా నిధుల మంజూరు కి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి తో పాటు సంబంధిత శాఖల మంత్రులను కూడా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధుల మంజూరు కి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. పాలకుర్తి. చెన్నూరు రిజర్వాయర్ల పనులను త్వరితగతిన పూర్తి ఎందుకు ఆ శాఖల అధికారులతో పలుమార్లు సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై చర్యలు తీసుకుంటాం

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్




**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై చర్యలు తీసుకుంటామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఏ) ఇచ్చిన నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై జలసాధన సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మధుయాష్కీ గౌడ్ హాజరయ్యారై మాట్లాడారు. నీళ్ళు, నిధులు నియామకాలపైనే తెలంగాణ ఉద్యమం జరిగి రాష్ట్రం ఏర్పాటు అయిందని, కానీ 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో అవినీతియే లక్ష్యంగా పాలన జరిగిందని అన్నారు. తెలంగాణను అన్ని విధాలుగా విధ్వంసం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం లో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. ఇరిగేషన్ మంత్రితో పాటు ముఖ్యమంత్రి వద్దకు నిపుణులను తీసుకెళ్లి చేపట్టాల్సిన చర్యలపై చర్చిద్దామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి విజయ రామారావు, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్, ఇంజనీరింగ్ నిపుణులు హాజరయ్యారు.

## జూన్ 2న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువ కవుల సమ్మేళనం

- పోస్టర్ ఆవిష్కరించిన జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన యువ కవుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జాగృతి ప్రకటించింది. తెలంగాణ సారస్వత పరిషత్ లో జరగనున్న ఈ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్ ను గురువారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... తెలంగాణ జీవనశైలి విశిష్టతను చాటి చెప్పడంతో పాటు యువతలో సాహితీ స్పృహను, చైతన్యాన్ని పెంపొందించడానికి ఈ యువ కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ తాత్వికతను, చరిత్రక నేపథ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సహనశీలతను, సమగ్రతను, సమాజంలో ఉండే సమిష్టితత్వాన్ని ప్రతిబింబించేలా యువ కవులు తమ కలాలకు పదును పెట్టాలని కవిత పిలుపునిచ్చారు. పాల్గొన దలచిన కవులు, కవయిత్రులు 35 ఏళ్ల లోపువారు అయి ఉండాలి. తెలుగు, హిందీ ఇంగ్లీష్, ఉర్దూలలో కవితలు వినిపించవచ్చు. నమోదు చేయించుకోవడానికి కవులు తమ వివరాలతో ఈ నెల 26 లోపు **kavitha.telangana@gmail.com**కు మెయిల్ చేయాలని సూచించారు. గోల్కొండ కవుల సంచిక ద్వారా సురవరం ప్రతాప్ రెడ్డి తెలంగాణ రచయితలు, కవులు, కవయిత్రుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పారని, ఆ స్ఫూర్తితో తాము ముందుకు సాగుతున్నట్లు తెలియజేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాహిత్యానికి కనీస గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. దాశరథి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అలాగే, జానపదానికి గౌరవం దక్కడం కోసం జీవితాంతం కృషి చేసిన బిరుదురాజు శత జయంతి కు రాష్ట్ర ప్రభుత్వం కనీస గౌరవం ఇవ్వలేదని, గొప్ప కవులు, కళాకారులు సమాజానికి చేసిన సేవలను ప్రభుత్వం విస్మరించడం తగదని సూచించారు. ఈ కార్యక్రమంలో కవులు కాంచనపల్లి, వనపట్ల సుబ్బయ్య, ఘనపురం దేవేందర్, జాగృతి నాయకులు నవీన్ ఆచారి, శ్రీధర్ రావు, మనోజ్ గౌడ్, లలిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ గురుకుల డిగ్రీ కోర్సుల ప్రవేశ దరఖాస్తు గడువు పెంపు

- 20వ తేదీ వరకు దరఖాస్తుల ఆహ్వానం
- రెగ్యులర్ కోర్సులతో పాటు వృత్తి విద్యా కోర్సులు
- ఉచితంగా ఉన్నత విద్య భోజన, వసతి సదుపాయాలు
- ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి
- ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు



**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికి సీటు కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 20వ తేదీ వరకు పెంచామని ఎంజేపి కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసి విద్యార్థుల, తల్లిదండ్రుల వినతి మేరకు గడువు తేదీ పొడిగించామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంజేపీటీబీసీ డబ్ల్యూ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలలో (ఇంగ్లీష్ మీడియం) మొదటి సంవత్సర డిగ్రీ కోర్సులకు( బీఎస్సీ (ఫిజికల్ అండ్ లైఫ్ సైన్సెస్), బీకాం, బీఏ, బీబీఏ, బీఎఫ్‌టీ, యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్ తదితర కోర్సుల కోసం ఆన్లైన్ ద్వారా **mjptbcwreis.telangana.gov.in** లేదా **tgrdccet.cgg.gov.in/TGRDCWEB**లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇప్పటికే ఎంజెపి జూనియర్ కళాశాల లో చదివిన ఇంటర్మీడియట్ విద్యార్థులు దరఖాస్తు చేయనవసరం లేదని తెలిపారు. వారు సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం. 040-23328266 లో (కార్యాలయ సమయంలో) సంప్రదించాలని సూచించారు.

## కాళేశ్వరంలో ఎమ్మెల్యే గండ్ర దంపతుల పుణ్యస్నానం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పద్మ దంపతులు పుణ్యస్నానం చేశారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గురువారం వేద మంత్రోచ్ఛారణలతో మారుమోగింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగమంలో ఉదయం 5.44 నిమిషాలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. కాగా, ఈరోజు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు - పద్మ దంపతులు వేకువ జామునే త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేశారు. త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. ఇప్పటి వరకూ సంప్రదాయానికే పరిమితమైన సరస్వతి పుష్కరాలు ఈ సారి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా సరస్వతీ నది ఉద్భవించిన ప్రాంతంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఆయన సతీమణీ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో పాటు పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతీ పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హజరయ్యారు.



## మొదటి రోజు సరస్వతీ పుష్కరాల్లో సందడి కరువు

**కాళేశ్వరం, మే 15 (జనంసాక్షి) :** ప్రముఖ శైవ క్షేత్రం కాళేశ్వరం లో జరుగుతున్న సరస్వతి పుష్కరాలలో మొదటి రోజు భక్తుల సందడి ఆశించినంతగా లేదు. ఎండ తీవ్రత కు మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఉండడంతో పుష్కర ఆరంభ స్నానాలపై భక్తులు ఆసక్తి కనబరచలేదు. వాహనాలను ఘాట్ లకు దూరంగా నిలిపివేయడంతో భక్తులు అవస్తలు పడ్డారు. మొదటి రోజు ప్రముఖుల రాక ఎక్కువగా ఉండడంతో భక్తులు కూడా వెనుకంజ వేసారు. అధికారులు 50 వేల నుండి లక్ష వరకు భక్తులు వస్తారని అంచనా వేయగా దాదాపుగా 20వేల మంది భక్తులు మాత్రమే హాజరయ్యారు.

## ఆర్టీఐ కమిషన్‌లో బీసీలకు చోటేదీ?

- బీసీలకు వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వం
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర



**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీల కులగనున చేసి 42 శాతం విద్యా ఉద్యోగాలలో కాకుండా లోకల్ బాడీలో రిజర్వేషన్లు పెంచుతామని చెప్పి డిక్లరేషన్ ల పేరుతో బాండ్ పేపర్ రాసిచ్చి సోనియాగాంధీ రాహుల్ గాంధీతో ప్రియాంక గాంధీతో అన్ని మీటింగ్లలో చేపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలను నిట్ట నిలువునా ముంచుతుందని మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర అన్నారు. దానికి ఉదాహరణ సమాచార హక్కు చట్ట కమిషన్ లో ఐదుగురిని నియమిస్తే ఒక్కరికి కూడా బీసీకి అవకాశం ఇవ్వకపోవడమే ప్రభుత్వం యొక్క ద్రోహానికి నిదర్శనమని ఆయన అన్నారు 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఆర్టిఐ కమిషన్లు ఒక మెంబర్‌ను నియమించకపోవడం బీసీల ఆత్మ గౌరవం మీద దెబ్బతీయటమేనని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు నెలల్లో లోకల్ బాడీ ఎలక్షన్స్ జరిపి 42% రిజర్వేషన్లు పెంచుతామని చెప్పి కాలయాపన చేస్తూ తప్పులు తడక కుల గణన చేసి బీసీల జనాభా తక్కువ చేసి చూపించడమే కాకుండా కేంద్రానికి పంపి బీసీ నాయకులను సర్పంచులుగా ఎంపీటీసీలుగా ఎంపీపీలుగా జడ్పిటిసిలుగా కాకుండా కుట్ర చేస్తున్నారని ఆయన అన్నారు కార్పొరేషన్ పదవులలో బీసీలకు అవకాశం ఇవ్వటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 27 కార్పొరేషన్లకు పాలకమండలి వేయకుండా బీసీలను నాయకులు కాకుండా కుట్ర చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీసీ ప్రజలందరూ అన్ని గమనించి రాబోయే కాలంలో ఏ ఎలక్షన్ వచ్చినా కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్ప దానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## అనధికారిక లేఅవుట్లు వెలియకుండా చర్యలు

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి




**వరంగల్ ఎంజీఎం, మే 15(జనంసాక్షి):** అనధికారిక లే అవుట్లు వెలియకుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో మేయర్ ఎల్ఆర్ఎస్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుదారుల సౌకర్యార్థం అనధికార ప్లాట్లు, లే అవుట్ల ను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం 25% రిబెట్ తో ఈ నెల 31 వరకు గడువును పొడగించిందని, ఈ సువర్ణ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవానెలా ప్రోత్సహించాలని అధికారులను సూచించారు. ఇప్పటివరకు 30,500 దరఖాస్తులు స్వీకరించడం ద్వారా రూ.130.50 కోట్ల ఆదాయం బల్దియా కు సమకూరుందని, రెగ్యులేషన్ రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు త్వరితంగా ప్రొసీడింగ్స్ అందజేయాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగరంలో అనధికారిక లేఅవుట్లు వెలియకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మేయర్ అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ ,డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏసీపీలు రజిత, ఖలీల్ ,శ్రీనివాస్ రెడ్డి టి పి ఎస్ ఏర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
16 మే 2025
తెలంగాణ

# అమ్మ తుఝే సలాం...

బిడ్డ పుట్టినప్పటి నుండి మొదలుపెట్టి తన జీవితం మొత్తం పిల్లలకి అంకితం చేసే ఆ తల్లికి సలాం... మనకి దెబ్బ తగలగానే మన నోటి నుండి వచ్చే పదం అమ్మ... అడగకుండా అమ్మయినా అన్నం పెట్టదు అంటారు కానీ అడగకుండానే పిల్లల ఆకలిని తెలుసుకొని అన్నం పెట్టేదే అమ్మ.. ఫోన్లో మాట్లాడిన పిల్లల గొంతు విని వారు బాధలో ఉన్నారా ఆనందంగా ఉన్నారా అని గ్రహించేదే అమ్మ... పసి పిల్లవాడు తన అమ్మని చూసి ఎంతగా మురిసిపోతాడో.. అదే అమ్మ ముసలిదైనాక భారంగా కనిపిస్తుంది ఇది న్యాయమా?... తన పిల్లలు మొదటిసారి బడికి వెళ్ళినప్పుడు తిరిగి మళ్లీ వచ్చేదాకా ఆ అమ్మ పడే మనోవేదన అంతా ఎంత కాదు తన పిల్లల ఆరోగ్య క్షేమాల కోసం పడే కష్టాలు ఎన్నో.. మరి అదే పిల్లలు అమ్మ ముసలిదైనాక తన ఆరోగ్యం బాగా లేకపోతే కసురుకుంటారు, కనీసం ఆస్పత్రికి కూడా తీసుకోనిపోవడం వారికి భారంగా అనిపిస్తుంది.. ఇది న్యాయమా.. కానీ ఆ తల్లి మనసు పిల్లల కోసం అనునిత్యం తపిస్తూనే ఉంటుంది, పిల్లలకు బడికి టిఫిన్ పెట్టినట్టు ఇప్పుడు ఉద్యోగాలు చేసే వారికి కూడా తెల్లవారుజామున లేసి తన పిల్లలు ఏది తింటే వారికి ఆరోగ్యం అవన్నీ వండిపెట్టి వారికి డబ్బాల్లో టిఫిన్లు కట్టి డ్యూటీ లోకి పంపిస్తున్న తల్లులు ఉన్నారు.. కానీ అదే తల్లిని ఆ బిడ్డలు ఏ రోజు కూడా అమ్మ తిన్నావా.. ఆరోగ్యం ఎలా ఉంది అని అడగడానికి కూడా వారి దగ్గర సమయం లేదు.. ఒకప్పుడు స్కూల్లలో జరిగిన విషయాలన్నీ అమ్మ ఇలా అయింది అలా అయింది అని అలసిపోకుండా అమ్మతో కబుర్లు చెప్పి అమ్మ చేతి తో అన్నం తిని అమ్మ చెప్పిన కథలతో నిద్రపోయే పిల్లలు ఒక వయసు వచ్చినాక అదే అమ్మతో చిరాకు పడే పరిస్థితి... ఈరోజు పని ఎలా ఉంది బాబు.. అంతా బాగేనా అని అమ్మ అడిగితే



నీకెందుకు నీకు చెప్పినా అర్థం కాదు అని కసురుకోవడం పిల్లలకు అలవాటైపోయింది.. కానీ అది అమ్మ మనసు పోనీలే పిల్లల మూడు బాగాలేదు అలిసిపోయినట్టున్నారు అలా అనుకుంటుందే తప్పితే నా పిల్లలు చెడ్డవారు అని ఏ రోజు అనుకోదు ఎందుకంటే తన పిల్లలంటే తనకు ప్రాణం తన పిల్లలే తన సర్వస్వం.. ఎంత అమాయకంగా ఉన్న ఆ అమ్మ తన పిల్లల జోలికి ఎవరైనా వస్తే వారి అంత చూడడంలో ఎలాంటి కసురు విడిచిపెట్టదు.. మరి మనం మన అమ్మల కోసం ఏం చేస్తున్నాం? తనకు పెద్దపెద్ద బంగ్లాలు కార్లు లేదా బంగారు ఆభరణాలు అవసరం లేదు ఒక అమ్మకి కావాల్సింది కేవలం తన బిడ్డనుండి ఒక ఆప్యాయమైన మాట మాత్రమే.. ఇతరుల ముందు తన బిడ్డ తనకి ఎంత గౌరవం ఇస్తున్నారు అనేదే ఆ తల్లి చూస్తుంది ప్రేమతో నిండిన రెండు మాటలు కూడా తనకి ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి.. అమ్మ చేసిన రుణాలని మనం తీర్చుకోలేము కానీ ఆ అమ్మకి కొంచెం సంతోషమైతే కలిగజేయగలుగుతాం... మదర్స్ డే కి అమ్మ కోసం గిఫ్ట్ కొనడం మిగిలిన రోజులంతా తనని కనీసం పలకరించకపోవడం ఏమాత్రం కరెక్ట్ కాదు, అమ్మకోసం మనం ఏదైనా చేయగలిగితే అది తనకి రోజు కొంచెం సమయం కేటాయించడం.. తన క్షేమ సమాచారం తెలుసుకోవడం, అమ్మ ఆరోగ్య బాధ్యతలను తీసుకోవడం... అమ్మని మించింది ఎవరు లేరు అంటారు కానీ నాన్న ప్రేమ ముందు కూడా ఎవరూ రారు మనకి అమ్మాయి ఎంత అవసరమో నాన్న కూడా అంతే... అమ్మ ప్రేమ చూపిస్తుందేమో నాన్న ప్రేమ చూపే విధానమే వేరు... అయితే అమ్మానాన్నలను ప్రేమిద్దాం వారితో ప్రతిరోజు మాట్లాడుదాం అదే వారికి ఒక ఎనర్జీ బూస్టర్.. ఎందుకంటే పిల్లలతో గడిపిన సమయం వారికి చాలా ఆనందాన్ని ఇస్తుంది నీ ఆనందం మనం వారికి దూరం చేయొద్దు.. ఎందుకంటే వయసు ప్రతి ఒక్కరిది పెరుగుతుంది... ప్రతి ఒక్కరూ ముసలి వాళ్ళ అవుతారు అప్పుడు మనం మన తల్లిదండ్రులతో ఎలా ఉన్నాము చూసి మన పిల్లలు కూడా మనతో అలాగే ఉంటారు అనేది మర్చిపోకూడదు.. అమ్మ నాన్నలను గౌరవిద్దాం.. వారితో మన లైఫ్ షేర్ చేద్దాం ఎందుకంటే ఈ ప్రపంచంలో అమ్మ కన్న మిమ్మల్ని అర్థం చేసుకునేవారు ఉండరు. హ్యాపీ మదర్స్ డే.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

## కుంటు బడిన కుటుంబం

ఉమ్మడి కుటుంభం
విచ్ఛిన్నమై వ్యక్తి స్వేచ్ఛ
స్వతంత్రత రాజ్యమేలి
ఒంటరి కుటుంబాల
ఉధృతి పెరిగి ఒంటరి
తనం వారసత్వమయ్యే
మనోశాంతి మందగించి
ఆందోళన అవరించే
అహంకారం అలంకరణమై
అనుబంధాలు బీటలు వారె
అనురాగాలు ఆవిరయ్యే
మమత మమకారాలు
మనీ భంధాలాయే
తాత నానమ్మల అమ్మమల
మామయ్య అత్తమ్మల
బాబాయి పెద్దమ్మ
చిన్నమ్మల ఆర్థత
ఆప్యాయత అనురాగాలు
పిల్లలకు అందని ద్రాక్షలాయే
క్రూరత్వం పిల్లలకు ఆస్థి ఆయే
బావ బావమరిది వదిన
మరదలు మరిది అక్క
చెల్లి అన్న తమ్ముడు అన్న
పిలుపులు మాయమై
హలో హాయ్ భాయ్ బై బై
అన్న పలుకులే పల్లవైనాయి
స్టేటస్ పేరున మాటలు
మరిచి హెూదా ముసుగులో
భందుత్వాలను భంధీ చేసి
నా వారెవరు? పరాయి
వారెవరు? తెలియని భౌతిక
జీవితాన్ని గడ్పుతున్నాం
స్వార్థం సంకుచితత్వం
అహం ఓర్వలేనితనం
పగలు ప్రతీకారం ద్వేషాన్ని
మన పిల్లలకు వారసత్వంగా
అందిస్తూ బంధాలు
అనుబంధాలకు దూరంగా
కుట్రలకు మోసాలకు దగ్గరగా
పోషణ పెంపకం సామాజిక
రుగ్మతయ్యేజి
సామాజిక హింస పెరిగి
పోయే
వావి వరుసలు తెలువక
ఉక్రోశాలు ఉరకలెత్తే
మానవత్వం అంతరించి
దానవత్వం దాపురించె
ధాతృత్వం లోపించి
ధన దాహం పెరిగి పోయె
ప్రేమ త్యాగం కరుణ
సహనం సహకారం
సౌభ్రాతృత్వం జాడేలేదు
బంధాల మధ్య
దూరం పెరిగెను
భంధువులంటె భారం
పెరిగెను
నీ ఇంటికి వస్తే ఏమిస్తావు
మా ఇంటికి వస్తె ఏమి
తేస్తావు అనేది
సమాజరీతయ్యే
కుటుంబ విలువలు
కుంటు పడెను
మానవ విలువలు
అంతరించెను
మనీ రోగం అవతరించెను
ఆప్యాయత అనురాగాలు
అంతరించెను
కుటుంబ భావన
కుంటు పడగ
తోడు నీడకు అడ్రస్ లేక
బంధువులు రాభంధులై
వృష్టి కుటుంబాలు
అవతరించి
పెద్దరికానికి గొడ్డలి
పెట్టింది
ఓరుపు సహనం
సంఘీభావం
నశించి మానవులు
ఊసరవెల్లి లా
రంగులు మార్చి
యాంత్రిక జీవన
గమనంలోభంధీయై
భారంతో బతుకుతు
విలాస జీవన
విషకౌగిలిలో చిక్కు కొని
దిక్కు తోచని విగత
జీవియై బతుకు తున్నారు
అనురాగాలు ఆత్మీయత
అంతా మిథ్య ఆయే
బంధాలు అనుబంధాలు
దూరపు కొండలాయే
భారతీయ సంస్కృతి
సాంప్రదాయాలు కుటుంబ
విలువలు పాటిద్దాం
వసుదైక కుటుంభకం
స్థాపనకు ఉద్యమిద్దాం.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్ 9440245771

# బీటలు వారుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ



ప్రతి సంవత్సరం మే 15న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం జరుపుకుంటారు. సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న నేటి పరిస్థితుల్లో, కుటుంబ విలువలను పునరుద్ధాటించడం, వాటి ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం. గతంలో ఉమ్మడి కుటుంబాలు సమాజంలో సర్వసాధారణంగా కనిపించేవి. అయితే, ఆధునిక జీవనశైలి, ప్రపంచీకరణ, ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా ఈ వ్యవస్థ క్రమంగా క్షీణిస్తోంది. ఈ పరిణామం సమాజంలో అనేక ప్రతికూల పరిణామాలకు దారితీస్తోంది. ఒంటరితనం, వ్యసనాలకు లొంగిపోవడం, మహిళలపై పనిభారం పెరగడం, ఆరోగ్య సమస్యలు వంటివి ఇందులో కొన్ని. ఈ సమస్యలను గుర్తించిన ఐక్యరాజ్య సమితి 1993లో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ప్రారంభించింది. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, సమాజంలో కుటుంబాల పాత్రను గుర్తించడం, వాటి సామాజిక, ఆర్థిక, జనాభా సమస్యలపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవం యొక్క లక్ష్యాలు. కుటుంబాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, కుటుంబ సంబంధాలను జరుపుకోవడానికి, ప్రేమ, బంధం, మద్దతును పెంపొందించడానికి ఈ రోజు ఒక వేదికగా ఉపయోగపడుతుంది. సాంకేతిక అభివృద్ధి జరుగుతున్నప్పటికీ, కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న నేపథ్యంలో ఉమ్మడి కుటుంబాల అవసరాన్ని వివరించడం ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం.

కుటుంబం అనేది ఒక ఆడామగ జంట మరియు వారి సంతానం కలిసి నివసించే యూనిట్. ఒకవేళ బంధువులు, తాతామామ్మలు, ఇతర తరాల వ్యక్తులు కలిసి నివసిస్తే, అది ఉమ్మడి కుటుంబంగా పరిగణించబడుతుంది. భారతీయ సంస్కృతిలో కుటుంబానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ఇక్కడ కుటుంబ సభ్యుల మధ్య బలమైన అనురాగ బంధం ఏర్పడుతుంది. కష్టసుఖాలను పంచుకోవడం, ఒకరికొకరు తోడుగా ఉండటం, బాధ్యతలను విభజించుకోవడం వంటివి సంప్రదాయంగా కొనసాగుతున్నాయి. అయితే, ఆధునిక జీవనశైలి మార్పుల కారణంగా చిన్న కుటుంబాల సంఖ్య పెరిగింది. ఆర్థిక అవసరాలు, ఉద్యోగ ఒత్తిళ్లు, సామాజిక మార్పులు ఈ పరిణామానికి దోహదపడ్డాయి. ఫలితంగా, కుటుంబ సభ్యుల ఆలనాపాలనా చూసే సమయం తగ్గిపోయింది, ఇది సమాజంలో పెద్ద సమస్యగా మారింది.

చచచ అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం 2025: లక్ష్యాలు

2025లో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం యొక్క థీమ్ "స్థిరమైన అభివృద్ధి కోసం కుటుంబ-ఆధారిత విధానాలు" (Family-Oriented Policies for Sustainable Development). ఈ కింద ఐక్యరాజ్యసమితి కొన్ని నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించింది:

1. **కుటుంబ విధానాల ప్రాముఖ్యతను గుర్తించడం:** రాబోయే రెండవ ప్రపంచ సామాజిక అభివృద్ధి సదస్సులో కుటుంబ విధానాలపై దృష్టి సారించడం.
2. **స్థిరమైన అభివృద్ధికి కుటుంబాల సహకారం:** స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో కుటుంబాల పాత్రను హైలైట్ చేయడం.
3. **మెరుగైన విధానాల రూపకల్పన:** కుటుంబాలకు మద్దతు ఇచ్చే విధానాలు మరియు కార్యక్రమాల అవసరాన్ని నొక్కిచెప్పడం.

భారతీయ సంస్కృతిలో కుటుంబ వ్యవస్థకు కేంద్ర స్థానం ఉంది. ఇక్కడ పెద్దల పట్ల గౌరవం, శ్రద్ధ అనేవి ప్రధాన లక్షణాలు. అయితే, ఆధునిక కాలంలో వృద్ధులను వృద్ధాశ్రమాలకు పంపే ధోరణి పెరుగుతోంది, ఇది విషాదకరం. చిన్న కుటుంబాల్లో నివాస వసతుల కొరత, పిల్లలు విదేశాలకు వలసపోవడం వంటి కారణాలు ఇందుకు దోహదపడుతున్నాయి. ఇది సమాజానికి దీర్ఘకాలంలో హానికరం. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ యొక్క ప్రధాన ప్రయోజనం బలమైన బంధాలు. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, తాతామామ్మలు, ఇతర బంధువుల మధ్య ఏర్పడే అనురాగం పిల్లలలో భద్రతా భావనను కలిగిస్తుంది. విస్తరించిన కుటుంబాల్లో పెరిగే పిల్లలు శ్రద్ధ, ప్రేమ, అవగాహన వంటి లక్షణాలను సహజంగా నేర్చుకుంటారు. ఇవి వారి భావోద్వేగ ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతాయి. అయితే, ఉమ్మడి కుటుంబాల్లో సంఘర్షణలు, అభిప్రాయ బేధాలు లేకపోలేదు.

కుటుంబ వ్యవస్థ బలహీనపడటం వల్ల సమాజంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్న కుటుంబాల్లో ఒంటరితనం పెరుగుతోంది, పిల్లలు మానసికంగా ఒంటరిగా భావిస్తున్నారు. ఒక అధ్యయనం ప్రకారం, విడిపోయిన కుటుంబాల పిల్లల్లో 45% మంది వ్యసనాలకు లొంగిపోతున్నారు. 75% యువత తల్లిదండ్రులతో కలిసి ఉండాలని కోరుకుంటున్నప్పటికీ, అలా ఉంటున్నవారి సంఖ్య 40% కంటే తక్కువ. మహిళలు ఉద్యోగాల్లో చేరడం వల్ల కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ ఒత్తిళ్లు వారిపై భారంగా మారుతున్నాయి. ఇంటి పనుల్లో భర్త సహకారం లేకపోతే, మహిళలపై ఒత్తిడి మరింత పెరుగుతుంది. వృద్ధుల విషయంలో కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. బిజీ జీవనశైలి కారణంగా వారిని పట్టించుకునే సమయం లేకపోవడం వల్ల వృద్ధాశ్రమాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది వారి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పిల్లలు కూడా తల్లిదండ్రుల ప్రేమ, శ్రద్ధ కోసం తపిస్తున్నారు. 63% పిల్లలు తల్లితో, 43% మంది తండ్రితో చనువుగా ఉండాలని కోరుకుంటున్నారని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ సామాజిక సామరస్యానికి, జాతీయ ఐక్యతకు బీజం వేస్తుంది. ఇది పిల్లలలో భద్రతా భావనను, పెద్దలలో బాధ్యతాయుత వైఖరిని పెంపొందిస్తుంది. కుటుంబ సభ్యులు ఒకరి అవసరాలను ఒకరు చూసుకోవడం వల్ల ఆర్థిక భద్రత, సామాజిక స్థిరత్వం సాధ్యమవుతుంది. సంప్రదాయాలు, ఆచారాలు, జీవనశైలి కుటుంబ వ్యవస్థ నుంచే ఉద్భవిస్తాయి. ఈ వ్యవస్థ బలోపేతం కాకపోతే, సమాజంలో అస్థిరత, అసంతృప్తి పెరుగుతాయి. అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం కుటుం బ విలువలను, బంధాలను జరుపుకునే రోజు. ఆధునిక జీవనశైలి సవాళ్లను అధిగమించి, ఉమ్మడి కుటుంబ వ్యవస్థను పునరుద్ధరించడం ద్వారా సమాజంలో సామరస్యం, ఐక్యత సాధ్యమవుతాయి. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, శ్రద్ధ, సహకారం పెంపొందించడం ద్వారా వ్యక్తిగత, సామాజిక, జాతీయ స్థాయిలో స్థిరమైన అభివృద్ధి సాధించవచ్చు. వసుధైవ కుటుంబకం ఆలోచనతో, ప్రపంచాన్ని ప్రేమ, మానవత్వం, సామరస్యంతో నిండిన స్వర్గధామంగా మార్చుకుందాం.

డాక్టర్ సుంకరి రాజారామ్,
సహాయ ఆచార్యులు
7799910222

# హైదరాబాద్ దేనికి పోటీ?

మనదేశంలో కొన్ని దశాబ్దాలుగా పట్టనీకరణ వేగంగా విస్తరిస్తోంది. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్ వంటి మెట్రోపాలిటన్ నగరాలు కోట్ల జనాభాకు, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రాలుగా మారాయి. ప్రభుత్వాలు ఈ నగరాలను మరింత అభివృద్ధి చేయటంపై దృష్టి పెట్టాయి. దేశంలో పారిశ్రామికీకరణలో మహారాష్ట్ర ఇతర రాష్ట్రాలకంటే ముందున్నది. అక్కడ దాదాపు 40 శాతం జనాభా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. తెలంగాణలో కూడా పట్టణ జనాభా గణనీయంగా పెరుగుతోంది. మన రాష్ట్రానికి గుండెకాయ హైదరాబాద్ నగరమే. తాజా లెక్కల ప్రకారం హైదరాబాద్ జనాభా కోటికి పైనే. అంటే తెలంగాణ మొత్తం జనాభాలో మూడింట ఒక వంత జనాభా రాజధాని నగరంలోనే ఉన్నారు. ఇక, నిత్యం వివిధ రకాల పనుల కోసం వచ్చిపోయేవారిని లెక్కలోకి తీసుకుంటే కోటిన్నర అవుతారు. దేశంలో బెంగళూరు తర్వాత హైదరాబాద్ నగరమే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) పరిశ్రమకు కేంద్రంగా ఉన్నది. ఫార్మా రంగంలో హైదరాబాద్ నగరమే నంబర్ వన్. బల్క్ డ్రగ్స్ పరిశ్రమ కూడా ఇక్కడే ప్రధానంగా కేంద్రీకృతమై ఉంది. రియల్ ఎస్టేట్ రంగం కూడా ఇతర మెట్రో నగరాలకంటే వేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచే రాజధాని అభివృద్ధిపై రాష్ట్రాలు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాయి. కానీ, ఇప్పటికీ నగరంలో మౌలిక వసతుల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. నాలుగు చినుకులు పడితే నగరం మొత్తం అస్తవ్యస్థం అవుతోంది. పరిస్థితి ఇలా ఉంటే హైదరాబాద్‌ను డల్లాస్‌లా మారుస్తాం, ఇస్తాంబుల్‌గా తీర్చిదిద్దుతాం అని గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలకు పోయింది. హైదరాబాద్‌కు న్యూయార్క్‌తోనే పోటీ, టోక్యో స్థాయిలో అభివృద్ధి చేస్తాం అని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రకటనలు చేస్తోంది. అసలు హైదరాబాద్‌కు కావాల్సింది ఏంటి? అనే ప్రాథమిక సూత్రాన్ని మాత్రం పాలకులు మర్చిపోతున్నారు.

హైదరాబాద్ నగరం చాలావరకు ఇప్పటికీ మౌలిక వసతుల కొరతో కొట్టుమిట్టాడుతున్నది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి డ్రైనేజీ వ్యవస్థనే వాడుతున్నారు. వేసవికాలంలో అడపాదడపా వర్షాలు పడితేనే ఎక్కడికక్కడ నీళ్లు నిలిచి గంటలకొద్ది ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక వర్షాకాలంలో అయితే కొన్ని లోతట్టు కాలనీలు రోజుల తరబడి మురుగు నీటిలోనే మునిగి ఉంటున్నాయి. గత ప్రభుత్వం నాలాల ఆక్రమణలను తొలగిస్తామని చాలా సందర్భాల్లో ప్రకటించింది. కానీ, ఎక్కడా ఆ పనిచేసిన దాఖలాలు కనిపించలేదు. లంచాలకు అలవాటుపడిన అధికారులు చెరువులు, కుంటలు ఆక్రమించిన వేసిన వెంచర్లకు కూడా అనుమతులు ఇవ్వటంతో ఇప్పుడు వాటిని కొని ఇళ్లు కట్టుకున్న ప్రజలు నానా అవస్థలు



పడుతున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా మొదట హైదరాబాద్ మధ్యలో హడావిడి చేసినప్పటికీ.. ఇప్పుడు శివారు ప్రాంతాలకే పరిమితమైనట్లు కనిపిస్తోంది. నగరంలో గతుకులు లేని రోడ్లను వెదికి పట్టుకోవటం కష్టంతో కూడుకున్న పనే.. ఒక ప్రభుత్వ విభాగం రోడ్లు వేస్తూ పోతే.. మరో విభాగం తవ్వుతూ పోతుంది. శాఖల మధ్య సమన్వయ లేమికి ఇది అసలు సిసలైన ఉదాహరణ. పాలకులు ఉదాహరణగా చెబుతున్న న్యూయార్క్, టోక్యో, డల్లాస్, ఇస్తాంబుల్ నగరాల్లో రోడ్లు వేయాలన్నా, డ్రైనేజీలు తీయాలన్నా ఒక పద్ధతి ప్రకారం, శాస్త్రీయ విధానాలో చేస్తారు. మన నగరంలో డ్రైనేజీ మ్యాన్‌హెూల్ రోడ్డుకు జానెడు ఎత్తులో ఉంటుంది. అది కూడా వాహనదారుడు దగ్గరకు వచ్చేవరకు గుర్తించలేని విధంగా ఉంటుంది. ఇలా మ్యాన్‌హెూల్ బిళ్లలు తగిలి కిందపడి వాహనదారులు గాయాలపాలైన ఘటనలు కోకొల్లలు. పైన ఉదహరించిన నగరాల్లో ఇలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించదు. పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు ఎంతో బాధ్యతగా, క్రియేటివిటీతో పనిచేస్తారు. మ్యాన్‌హెూల్ శుభ్రం చేసే ఉద్యోగి కూడా ఎప్పటికప్పుడు తన పనిలో కొత్తదనం చూపిస్తాడు. మన నగరంలో మ్యాన్‌హెూల్‌లో సిల్ట్ తీసి రోడ్లపై వేస్తే.. రోజుల తరబడి అది అలాగే ఉంటుంది. ఎంత భారీ వర్షాలు కురిసినా న్యూయార్క్, టోక్యో లాంటి నగరాలు జలమయమైనట్లు వార్తలు ఎక్కడా కనిపించవు. అందుకు కారణం వాళ్లు నగరాల్లో చేపట్టే మౌలిక వసతుల పనుల్లో ఉండే కచ్చితమైన శాస్త్రీయతే. ఇలాంటి ప్రాథమిక అంశాలను కూడా సరిదిద్దకుండా హైదరాబాద్‌ను న్యూయార్క్‌గా మారుస్తాం అంటే ఎలా నమ్మేది?

ఒక ప్రాంతం, నగరం, రాష్ట్రం పద్ధతిప్రకారం అభివృద్ధి చెందాలంటే పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అధికార శ్రేణిలో స్వీయ క్రమశిక్షణ, జవాబుదారీ తనం తప్పనిసరిగా ఉండాలి. పాలకులు బాధ్యత మరిచి ప్రవర్తిస్తే.. అధికారులు అందినకాడికి దండుకోవటానికి అలవాటు పడతారు. ఇప్పటికీ హైదరాబాద్ టౌన్ ప్లనింగ్‌లో ఉద్యోగం కోసం లక్షలకు లక్షలు లంచాలు ఇచ్చేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉంటారని టాక్. ఎందుకంటే.. ఆ తర్వాత ఎంతైనా అవినీతి సొమ్మును పోగేసుకోవచ్చనే నమ్మకం. నగరంలో ఒక రోడ్డు వేసే పనో, డ్రైనేజీ పనో.. ఇంకా ఏదైనా పని చేపట్టినప్పుడు అది శాస్త్రీయంగా ఉండేలా చూడటం అధికారుల విధి. అలా లేనప్పుడు తన ఉద్యోగం ఊడుతుందని, శిక్ష తప్పదనే భయం ఉద్యోగుల్లో ఉండాలి. ఇక్కడ మరో వాదన కూడా ఉంది. అధికారులు చట్టబద్ధంగా పనిచేయటానికి సిద్ధంగా ఉన్నా.. కార్పొరేటర్ దగ్గర నుంచి మంత్రుల స్థాయి వరకు కాంట్రాక్టర్లకు కొమ్ముకాసి అధికారులపై ఒత్తిడి తెస్తారనే విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితులన్నీ సరిచేయకుండా నగరంలో ఏదో అద్భుతం చేస్తామంటే ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడమే అవుతుంది.

హైదరాబాద్ మధ్య నుంచి వెళ్తున్న మూసీ నదిని శుభ్రం చేసి, పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు దాదాపు రూ.లక్ష కోట్లు ఖర్చు చేయటానికైనా సిద్ధమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. కానీ, ముందుగా నగరాన్ని శుద్ధి చేయకుండా మూసీని శుద్ధి చేయటం శుద్ధ దండగే. నగరంలో మౌలిక సదుపాయాలను క్రమబద్ధంగా ఏర్పాటుచేయకుండా మూసీలోని బురదను ఎత్తిపోస్తే.. నగరంలోని బురదంతా వెళ్లి మళ్లీ మూసీ నిండదా? హైదరాబాద్ అంటే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మణికొండ లాంటి మనీ మనుషులు ఉండే ప్రాంతాలు మాత్రమే కాదు. అసలైన హైదరాబాద్ నగరంలోని మురికివాడల్లో ఉంది. ఆ మురికి వాడలను శుభ్రం చేయకుండా ప్రభుత్వం ఎన్ని వేలకోట్లు ఖర్చు చేసినా అధికారులు, పాలకులు, కాంట్రాక్టర్ల జేబులు నింపటానికే పనికి వస్తాయి. డల్లాస్‌లు, ఇస్తాంబుల్‌లు, న్యూయార్క్‌లు అక్కరలేదు. హైదరాబాద్‌ను భాగ్యనగరంగా తీర్చి దిద్దితే చాలు.



- వేణు బెక్కం,
సీనియర్ జర్నలిస్ట్

# "స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న బలూచిస్తాన్"

పాకిస్థాన్‌లోని విస్తీర్ణపరంగా అతి పెద్ద ప్రావిన్స్ అయిన బలూచిస్తాన్... పాకిస్తాన్ నుండి విడిపోతున్నట్లు బాలూచ్ నేతలు ప్రకటించారు. అంతేకాక బాలూచిస్తాన్ ని ప్రత్యేక దేశంగా గుర్తించాలని భారత దేశ ప్రభుత్వాన్ని, ఐక్యరాజ్యసమితిని కోరారు. ఈ మేరకు బలూచిస్తాన్ నాయకుడు 'మీర్ యార్' బలుచ్ ఎక్స్ లో పలు పోస్టులు చేశారు. "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ ఏర్పాటును తన పోస్టులో ప్రకటించారు. అలాగే, న్యూఢిల్లీలో బలూచిస్తాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వారు భారత ప్రభుత్వాన్ని కోరారు. తమను ఒక దేశంగా గుర్తించి కరెన్సీ, పాస్ పోర్ట్ జారీ వంటి ప్రాథమిక అవసరాలకు నిధులను సమకూర్చాలని ఐక్యరాజ్య సమితిని వారు అభ్యర్థించారు. అలాగే తమను, పాకిస్తానీలను ఒకటిగా చూడవద్దని భారతీయ మీడియాను వారు కోరారు. మీర్ యార్ బలూచ్ చేసిన పోస్టుల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు బలూచిస్తాన్ జెండాలు, స్వతంత్ర బలూచీస్తాన్ మ్యాపులు చూపిస్తున్న ఫోటోలు, వీడియోలు కూడా ఉన్నాయి.

**బలూచిస్తాన్ భౌగోళిక,చారిత్రక నేపథ్యం:**

బలూచిస్తాన్ దక్షిణ ఆసియాలో చారిత్రకంగా, భౌగోళికంగా, రాజకీయంగా ఎంతో కీలకమైన భూభాగం. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఆధీనంలో ఉన్న ఈ ప్రాంతం, ఆ దేశంలో అత్యంత పెద్ద రాష్ట్రమైనా, రాజకీయ శక్తిలో మాత్రం అత్యంత వెనుకబడి ఉంది. ఈ ప్రాంత చరిత్రను, సామాజిక-ఆర్థిక పరిస్థితిని, భౌగోళిక విశిష్టతను, ప్రస్తుత ఉద్యమాల రాజకీయ పటాలను విశ్లేషించకపోతే ఈ ప్రాంత సమస్యలకు ముడిపడిన అసలైన సమస్యలు తెలిసే అవకాశం లేదు.

**భౌగోళిక నేపథ్యం:**

బలూచిస్తాన్ పాకిస్తాన్ మొత్తం భూభాగంలో సుమారు 44 శాతం ప్రాంతాన్ని ఆక్రమించుకొని ఉంటుంది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ దేశాల సరిహద్దులకు ఆనుకొని ఉండటంతో, ఇది జియోపాలిటికల్ దృష్టితో చాలా కీలకమైన ప్రాంతం. గ్వాదర్ పోర్ట్ వంటి ప్రాజెక్టులు చైనా-పాకిస్తాన్ ఆర్థిక కారిడార్‌లో భాగంగా నిర్మింపబడుతున్నా, దాని వల్ల ఈ ప్రాంత ప్రజలకు అసలు ప్రయోజనం కలగడం లేదు.

**చారిత్రక నేపథ్యం:**




బలూచిస్తాన్ ప్రాంతం గతంలో ఖుదాబాద్ ఖాన్ పాలనలో స్వతంత్రంగా ఉండేది. 1947లో భారత ఉపఖండ విభజన అనంతరం పాకిస్తాన్ బలవంతంగా బలూచిస్తాన్‌ను తనలో కలిపేసుకుంది. అప్పటి నుంచే పాకిస్తాన్ పై స్థానికుల వ్యతిరేకత మొదలైంది. 1948, 1958, 1962, 1973 మరియు 2004 సంవత్సరాలలో ఎన్నో సార్లు ఈ ప్రాంతంలో విప్లవాల తిరుగుబాట్లు జరిగాయి. ఇది గతంలో 'దమన్ 'పాలనలో ఉండేది. అక్కడ ప్రజలు తమ ఆత్మగౌరవం కోసం అనేక పోరాటాలతో నిలకడగా కొనసాగి ఇప్పుడు స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేసుకున్నారు.ఇంకా ఐక్యరాజ్యసమితి,ఇతర దేశాలు గుర్తించాల్సి ఉంటుంది.

**సామాజిక-ఆర్థిక పరిస్థితి:**

బలూచిస్తాన్‌లో జనాభా తక్కువే అయినా, సహజ వనరులు అధికంగా ఉన్నాయి. ప్రధానంగా గ్యాస్, ఖనిజాలు. విస్తృతంగా ఉన్నాయి. అయినా ఈ వనరులపై స్థానికులకు ఏలాంటి హక్కులు లేవు. పాకిస్తాన్ పాలనలో ఈ ప్రాంత వనరులను అన్య ప్రాంతాలకు తరలిస్తున్నా, బలూచ్ ప్రజలకు మాత్రం విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి మౌలిక అవసరాలు తీరడం లేదు. ఇది విపరీతమైన అసమానతలకు దారి తీసింది. పేదరికం, నిరుద్యోగం, అక్రమ అరెస్టులు, గోప్యతా సమస్యలు, నిర్బంధాలు సామాన్య జీవితాన్ని భయంతో నింపుతున్నాయి.

**సాంస్కృతిక నేపథ్యం:**

బలూచీ భాష, కళలు, నృత్యాలు, జీవన విధానం ప్రత్యేకమైనవే. కానీ పాకిస్తాన్‌లో ఈ సాంస్కృతిక విశిష్టతలను గుర్తించని విధంగా జాతీయత పేరుతో బలవంతపు ఉర్దూ ఆధిపత్యాన్ని వారిపై మోపుతున్నారు. ఇది బలూచ్ సమాజాన్ని మరింత బహిష్కృతంగా మార్చింది. విద్యలో బలూచీ భాషకు ప్రాధాన్యత ఇవ్వకపోవడమే కాక, వారి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో వికృతంగా చూపించటం వల్ల సాంస్కృతిక అప కీర్తి ఏర్పడింది.

**ప్రస్తుత రాజకీయ పరిస్థితి:**

ఇటీవల కాలంలో బలూచ్ రాజకీయ కార్యకర్తలు, మేధావులు, విద్యార్థులు భౌతికంగా కనిపించకుండా పోవడంపై అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. 'ఎన్ఫోర్స్ డిసఅపియరెన్సెస్' బలూచిస్తాన్‌ను భయాందోళన ప్రాంతంగా మార్చాయి. బలూచ్ లిబరేషన్ ఆర్మీ వంటి సంస్థలు స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్నప్పటికీ, పాకిస్తాన్ ప్రభుత్వం ఉగ్రవాదం పేరుతో వాటిని తీవ్రంగా అణిచివేస్తోంది.

మరోవైపు చైనా-పాకిస్తాన్ ఆర్థిక భాగస్వామ్యంలో భాగంగా గ్వాదర్ పోర్ట్ అభివృద్ధికి బలూచిస్తాన్‌ను కేంద్రంగా మార్చారు. అయితే ఈ ప్రాజెక్టుల వల్ల స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. మౌలిక వనరుల వినియోగం ఇతరులకు దక్కడం వల్ల వారిలో పాకిస్థాన్ పాలనా పట్ల విముఖత పెరిగింది.

బలూచిస్తాన్ సమస్య ఒక ప్రాంతీయ సమస్య మాత్రమే కాదు. అది మానవ హక్కులకు సంబంధించిన ది. ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య విలువల సమస్యగా ఉంది. ఆర్థిక వనరుల దోపిడీ, సాంస్కృతిక అణచివేత, రాజకీయ నిరంకుశతలపై ప్రపంచం స్పందించాల్సిన అవసరం ఉంది అని చాలా కాలంగా అక్కడ ప్రజలు పోరాటం చేస్తున్నారు . బలూచ్ ప్రజలకు తమ భవితవ్యాన్ని నిర్ణయించుకొనే హక్కు, జీవించడానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజానిదీ కూడా. ఈ ఎడతెగని పోరాటల ఫలితంగా నిన్న బలూచిస్తాన్ ను స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# జీహెచ్ఎంసీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**హయత్‌నగర్, మే 15 (జనం సాక్షి) :** మే 20న దేశ వ్యాప్త సార్వతిక సమ్మెలో పాల్గొనా లని హయత్ నగర్ లోని గాంధీ బొమ్మ దగ్గర జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, జిహెచ్ఎంసి మున్సిపల్ కార్మికులతో కలిసి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక హక్కులను హరిచే నాలుగు లేబర్ కోడ్ ను వెంటనే రద్దు చేయాలి, కార్మికుల కు కనీస వేతనం రూపాయలు 26,000/- నిర్ణయించాలి, పెరుగుతున్న ధరలకు అనుకూలంగా విడిఎని నిర్ణయించాలి, జిహెచ్ఎంసి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాన్ని పర్మినెంట్ చేసే లోపు రూపాయలు 26,000 /-లను చెల్లించాలి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి, జిహెచ్ఎంసి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందిని హైకోర్టు తీర్పు ప్రకారం పర్మినెంట్ చెయ్యాలి, జిహెచ్ఎంసి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య సేవల్లో ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించుకోవాలి, రాంకీ సంస్థల ప్రైవేట్ ఇంజనీరింగ్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలి, జిహెచ్ఎంసి పారిశుద్ధ సేవలను సమర్థవంతంగా నిర్వహించడానికి జిహెచ్ఎంసి ఇంజనీర్లు, అధికారులు గత ఒప్పందాల ప్రకారం జిహెచ్ఎంసి కార్మికులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని, కార్మికులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని వారు అన్నారు. జిహెచ్ఎంసి కార్మికులకు సబ్బులు, చెప్పులు, కొబ్బరి నూనె,



గ్లౌజులు, జాడు కట్టలు తదితర పనిముట్లు సకాలంలో అందించాలని అన్నారు. మరణించిన, లాంగ్ ఆబ్సెంట్, అనారోగ్యం కారణం వల్ల డ్యూటీ రాకుండా ఉంటున్న వారి స్థానంలో వెంటనే వారి కుటుంబ సభ్యుల్ని గుర్తించి ఉద్యోగం లోకి తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చెయ్యాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కార్మికులు చుక్కమ్మ, పద్మ, నితీషా, అచ్చమ్మ యాదమ్మ, సావిత్రి, కలమ్మ, అండాలు, అనిత, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**హయత్‌నగర్, మే 15 (జనం సాక్షి) :** ఏఐటీయూసీ హయత్‌నగర్ మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు ఆధ్వర్యంలో మే 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ కృష్ణ, మెడికల్ కాలేజ్ అదనపు సూపరింటెండెంట్ లకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి హాజరై, సమ్మె గోడ పత్రికను ఏరియా హాస్పిటల్ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు భాగ్యమ్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మే 20న వామపక్ష ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు అన్ని రంగాల కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. సంబంధిత అధికారులు సమ్మెను అడ్డుకోకుండా సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. పోరాటాల ద్వారా సాధించుకున్న 43 కార్మిక చట్టాల లో 28 చట్టాలను విలీనం చేసి, నాలుగు లేబర్ కోడ్ ల రూపంలో తీసుకువచ్చిన విధానం కార్మికుల హక్కుల కు విరుద్ధమని వారు విమర్శించారు. అనేక దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించిన 8 గంటల పని దిన చట్టాన్ని కూల్చివేసే విధంగా 12 గంటల పని దినాన్ని అమలు చేయడం సిగ్గుచేటని వారు అన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి, మునుపటి 43 చట్టాలను యథావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. అసంఘటిత, కాంట్రాక్ట్ రంగా




లలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని, మెడికల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న పేషంట్ కేర్, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ గార్డ్స్, 2 ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను శాశ్వతంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ నిధులను ఇప్పటి వరకు వారి ఖాతాల్లో జమ చెయ్యని కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చెయ్యాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రమావత్ సక్రు నాయక్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, మంగ, రవి కిరణ్, ప్రశాంతి, సునీత, ప్రభావతి, లింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కులమతాలకతీతంగా దర్గా ఉర్సు ఉత్సవాలు

- **భక్తుల కోరికలు తీర్చే ఖమర్ హుస్సేన్ దర్గా**
- **ప్రారంభమైన ఉర్సు ఉత్సవాలు**

సంగారెడ్డి, మే 15 (జనం సాక్షి) : కులమతాలకతీతంగా దర్గా ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ (అంతడ్పల్లి) గ్రామంలో గల ఖమర్ హుస్సేన్ అలీషా దర్గా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ దర్గాకు ఉత్సవాలకు ముస్లింలే కాకుండా అన్ని మతాల వారికి ఆరాధ్య దైవంగా నిలుస్తోంది. ఫలితంగా ప్రతి ఒక్కరూ ఈ దర్గా ముందు నుంచి వెళుతూ దర్గాకు మొక్కి వెళ్లడం ఆనవాయితీగా మారింది. మండలంలోని బుదేరా గ్రామ పంచాయితీ మదిర గ్రామంగా ఉండి ప్రస్తుతం కొత్త పంచాయితీగా ఏర్పడిన ఇబ్రహీంపూర్ ఖమర్ హుస్సేన్ అలీషా దర్గా ప్రాచుర్యం పొందినది. ముస్లింలే కాకుండా ఇతర మతాల వారు కూడా ఈ దర్గాకు అధిక సంఖ్యలో హాజరవుతారు.

**విద్యుత్ కాంతులతో ముస్తాబైన దర్గా**



మూడు రోజులపాటు నిర్వహించనున్న దర్గా ఉర్సు ఉత్సవాలకు ప్రాంగణం విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. మునిపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలోని ఖమర్ హుస్సేన్ అలీషా దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి అబ్దుల్ వహేద్ ఖాద్రి పేర్కొన్నారు. 15న ఇబ్రహీంపూర్ నుండి దర్గా వరకు ఇంటి గంధం తీయుట, రాత్రి సమాఖవ్వాలి, 16న సంగారెడ్డి, బిల్కల్ గ్రామాల నుండి దర్గా వరకు గంధం తీయుట, 17న సమా ఖవ్వాలి, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు దర్గా వద్ద అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

**కోర్కెలు నెరవేరుతాయి..**



అన్ని మతాల వారు ఆరాధించే ఖమర్ హుస్సేన్ అలీషా దర్గాలో మొక్కిన వెంటనే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ దర్గాకు వచ్చే వారు ముస్లింలకన్నా ఇతర మతాల వారే ఎక్కువగా ఉంటారు. ప్రతీసంవత్సరం నిర్వహించే దర్గా ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో వస్తుంటారు. కర్ణాటక, మహారాష్ట్ర కళాకారులు ఆలపించిన ఖవ్వాలి ఆకట్టుకుంటుంది.

**అబ్దుల్ వహీద్ ఖాద్రి**

# కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



**కొడంగల్, మే 15 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణ రావు గురువారం జిల్లా పర్యటనలో భాగంగా కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొడంగల్ ప్రాంతంలో వైద్య కళాశాల ఏర్పాట్లు చేస్తున్నందున ప్రస్తుతం కొనసాగుతున్న 50 పడకల ఆసుపత్రిని 220 పడకల ఆసుపత్రిగా సామర్థ్యాన్ని పెంచుతూ నిర్మించబడుతున్న పనులను ఆయన పరిశీలించారు.ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధింత ఇంజనీరింగ్ విభాగ అధికారులకు సూచించారు.ఆసుపత్రికి రోజువారీగా వస్తున్న వివరాలను, ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ప్రసవాల సంఖ్య పై ప్రధాన కార్యదర్శి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి విద్యార్థినీల, సిబ్బంది వివరాలపై ఆయన ఆరా తీశారు.అనంతరం హరే కృష్ణ సంస్థ ద్వారా పాఠశాలకు అల్పాహార సరఫరా చేస్తున్న కిచెన్ షెడ్ ను ప్రధాన కార్యదర్శి పరిశీలించారు. ప్రధాన కార్యదర్శి పర్యటనలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ పద్మ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరీ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్ర ప్రియ, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్,తహసిల్దార్ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నరాయిని చెరువును మంచినీళ్ల కుంటగా అభివృద్ధి చేస్తాం

- **ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి**



**అల్వాల్, మే 15 (జనంసాక్షి) :** అల్వాల్ డివిజన్‌లోని చిన్నరాయిని కుంట చెరువును శుద్ధజలాలతో నింపే మంచినీళ్ల కుంటగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం చెరువులో ఇరిగేషన్, జిహెచ్ఎంసి, రెవిన్యూ, జలమండలి అధికారులతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్ పాల్గొన్నారు. చెరువు చుట్టూ పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే, మురుగునీరు చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గుర్రపుడెక్క రాళ్లను తొలగించి వర్షాకాలానికి ముందు చెరువును శుభ్రపరచాలని సూచించారు. చెరువు పరిసర భూస్వాములతో చర్చించి టిడిఆర్ పొందేందుకు కృషి చేస్తానన్నారు. భారతీ నగర్ గుండా వచ్చే వరద ప్రవాహానికి అదనపు వాటర్ వెంటు నిర్మించాలని, మురుగునీరు చెరువులోకి చేరకుండా డైవర్షన్ చేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ కుంటను శుద్ధజల వనరుగా తీర్చిదిద్దేందుకు విభాగాల మధ్య సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే బడ్జెట్‌లో నిధుల మంజూరు కోసం చర్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల డీఈలు, ఏఈలు, రెవిన్యూ అధికారులు, స్థానిక కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారం

- **ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి**

**తాండూరు, మే 15 (జనంసాక్షి) :** పదవతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారం అందజేయడం గర్వకారణమని ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం తాండూరు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం మరియు హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో చైతన్య జూనియర్ కళాశాల సౌజన్యంతో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభ పురస్కార్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యా కుసుమాలకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో విద్యతోనే




విన్నత విలువలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు మరింత కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు,హిందూ ధార్మిక పరిషత్ సభ్యులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పల్లె జానపద పురస్కారం అందుకున్న సింగర్ ఆదేర్ల యాదమ్మ




**ఇబ్రహీంపట్నం, మే 15 (జనం సాక్షి) :** తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రజా కళావేదిక డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్, కల్చర్ అఫైర్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన మన పల్లె జానపదం జాతర కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల తులేకలాన్ గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ ఆదెర్ల యాదమ్మ భర్త యాదయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెకు జానపద పురస్కారం లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హరి సర్వోత్తమ నాయుడు డాక్టర్ మురళీధర్, ప్రముఖ కవి ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నారాయణస్వామి, సినీ గీతా రచయిత కవి సురేంద్ర పాల్గొని షీల్డ్ ప్రశంస పత్రంఇచ్చి సన్మానం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన 300 మంది జానపద కళాకారులకు పాటకు పట్టాభిషేకం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజాకళావేదిక అధ్యక్షుడు అరవ జయపాల్ మాట్లాడుతూ జానపదాలు జనజీవన రంజకాలు జగతికి జీవనాడులు అని తెలిపారు. యాదమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారం, కళాకారుల సహకారం అందిస్తే నాకు తెలిసిన ఈ జానపద కళను సమాజానికి తెలియపరిచే విధంగా నా చిన్నతనం నుండి సుమారు 200 పాటల వరకు నేర్చుకున్నాను. కొన్ని పాటలు స్వయంగా తానే రచించి పాడానని, నా పాటలు ద్వారా నేటి సమాజంలో మధ్యతరగతి, పేదవారి అభ్యున్నతికి, వినోదానికి తూర్పడే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం తులేకలాన్ గ్రామానికి చెందిన యాదమ్మకూ పురస్కారం లభించడం పట్ల తులేకలాన్ గ్రామ ప్రజలు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల పునాదులపై ఏర్పడింది

- **ఎమ్మెల్యే కేపీ వివేకానంద**

**కుత్బుల్లాపూర్, మే 15 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాల పునాదులపై ఏర్పడిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేపీ వివేకానంద మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలను కోర్టులు తప్పుపడుతున్న తీరు మారడం లేదని ఆయన విమర్శించారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదన్నారు. ప్రజలనే కాదు కోర్టులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తుందన్నారు. సీఎం ఒత్తిడిలో ఉత్తంకుమార్ రెడ్డిని సీఎం అనడంతో ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అనాలోచిత నిర్ణయాల తో



ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. ఇప్పటికే గత ప్రభుత్వంపై 10 పైగా ఎంక్వయిరీలు వేసిన ఒక్కటి కూడా రుజువు చేయలేకపోవడాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

# గోరక్షణే లక్ష్యంగా పోలీసుల ముమ్మర తనిఖీలు



**న్యాల్‌కల్, మే 15 (జనం సాక్షి) :** గోరక్షణే ప్రధాన లక్ష్యంగా, అక్రమంగా పశుసంపదను అడ్డుకట్ట వేసేందుకు గురువారం పోలీసుల బృందం ముమ్మర తనిఖీలు చేశారు. జిల్లా పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశం మేరకు ప్రత్యేకంగా జహీరాబాద్ - బీదర్ రోడ్డు, గంగువార్ ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద గురువారం 20 వాహనాలను తనిఖీ చేశారు. డీసీఎం, కంటైనర్, బులెరా, తదితర వాహనాల్లో కర్ణాటకలోని బీదర్, నారాయణఖేడ్ ప్రాంతం నుండి గంగ్వార్ మీదుగా జహీరాబాద్, హైదరాబాద్‌కు వెళుతున్న వాహనాలను తనిఖీ చేసి పలు పత్రాలను పరిశీలించారు. రానున్న బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకొని తనిఖీలు చేపట్టారు.

ఈ మేరకు స్థానిక ఎస్సై చెల్లా రాజశేఖర్ చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. జహీరాబాద్ గ్రామీణ వలయాధికారి జక్కుల హనుమంతు పర్యవేక్షణలో ఝరాసంఘం పోలీస్ స్టేషన్‌కు చెందిన కే.గంగయ్య ఏఎస్ఐ, పీ.వీరేశం, సాయితేజ పీ.ఆర్ఎస్ఐలు ఉదయం 6 గంటల నుండి తనిఖీలు చేశారు.

# అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలి

- **ప్రజల అంచనాలకు అనుగుణంగా సమర్థవంతంగా పని చేయాలి**
- **భూ భారతి పైలెట్ మండలాలే రాష్ట్రానికి దిక్సూచి**
- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు**

**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 15 (జనం సాక్షి) :** ప్రజల అంచనాలకు అనుగుణంగా అధికారులు సమర్థవంతంగా పనిచేసి..అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు సూచించారు. ఓ వైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ మరోవైపు అవసరమైన పనులను కొనసాగించి బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగడం ద్వారా ఏ ప్రాంతమైన, జిల్లా, రాష్ట్రమైన అభివృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నారాయణ పేట జిల్లా పర్యటనకు తొలిసారిగా వచ్చిన సీ.ఎస్.ఇక్కడి కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో



కలిసి జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. సమీక్షలో సీ ఎస్ మాట్లాడుతూ రాష్ట్రం కొత్తగా ఏర్పడిన సమయంలో నెలకు 6 వేల కోట్ల ఖర్చు అయ్యేదని, ఇప్పుడా ఖర్చు 23 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. జిల్లాలు పెరిగాయని, ప్రజల అంచనాలు కూడా పెరిగాయని,అన్నింటిని బ్యాలెన్స్ చేయాలన్నారు. నారాయణపేట జిల్లా చివర్లో వచ్చిందని, సీఎం జిల్లా కావడం కలిసి వస్తుందని, చేసింది బాగుందని, చేయాల్సింది చాలా ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా అభివృద్ధి కంటికి కనబడాలి అన్నారు. 3.50 కోట్ల జనాభా ఉన్న రాష్ట్రంలో 3.50 లక్షల మంది అంటే జనాభాలో ఒక శాతమే ప్రభుత్వ అధికారులం ఉన్నామని, ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. జిల్లాలో పదో తరగతి ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని డీఇఓ గోవిందరాజులు తెలపగా సీ ఎస్ స్పందిస్తూ ఇంకా మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ మంచి కార్యక్రమం అని కానీ విన్నది పిల్లలకు అర్థం అవుతుందో లేదో తెలుసుకోవాలన్నారు. అవసరమైతే పిల్లల ఇంటికి వెళ్ళి వారి విద్యా నైపుణ్యాన్ని పరిశీలించాలన్నారు.చదవడానికి నేర్చుకోవాలని, నేర్చుకోవడానికి చదవాలని ఆయన వ్యాఖ్యానించారు.ఢిల్లీ, రాజస్తాన్ పాఠశాలలో విద్యా బోధనను పరిశీలిస్తే మనం ఏంచేయాలో తెలుస్తుందన్నారు.పిల్లలు ఏ స్థాయిలో ఉంటే ఆ స్థాయి లో పాఠాలు చెప్పాలని ఆయన తెలిపారు.కడ అభివృద్ధి పనులపై శాఖల వారీగా చర్చించి వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.ఇంకా సమీక్షలో సన్న బియ్యం పథకం, రాజు యువ వికాసం, ప్రజారోగ్యం, మిషన్ భగీరథ, టిజీఈడబ్ల్యూ ఐడిసి, పోలీసు శాఖల ప్రగతి పనుల పురోగతికి సీఎస్ సలహాలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు ఆయా శాఖల నివేదికలతో కూడిన వివరాలను సీఎస్‌కు పవర్ పాయింట్ ప్రజెంటెన్ ద్వారా అధికారులు వివరించారు.

# రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- సుశిక్షుతులైన వైద్యులుగా తయారు కావాలి
- మహిళలు వ్యాపారంలో రాణిస్తే మరింత చేయూత
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 15 (జనం సాక్షి) :** రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్ర మైనదని, వైద్య విద్యను అభ్యసించే అవకాశం రావడం గర్వకారణమని అన్నారు.మహిళలు వ్యాపారాల్లో రాణిస్తే ప్రభుత్వం మరింత చేయూత నిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా గురువారం ఆయన నారాయణపేట జిల్లా పర్యటనకు వచ్చారు.ముందుగా నారాయణపేట మండలం అప్పక్ పల్లి గ్రామ సమీపంలో గల ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించగా.. కళాశాల వద్ద సీ.ఎస్ రామకృష్ణారావుకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. తర్వాత పోలీసులు ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం మెడికల్ కళాశాలలో మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులతో సీఎస్ ఇంట్రాక్ట్ అవుతూ కళాశాలలో చదువు కోవడం ఎలా అనిపిస్తుందని విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాతో తనకు అవినాభావ సంబంధం ఉందని, పాలమూరు జిల్లాలో 1996 లో పని చేశానని తెలిపారు. జిల్లాలో రెండు పెద్ద నదులు కృష్ణా, తుంగభద్ర ఉన్నాయని, జిల్లాకు వెనుక బడిన జిల్లాగా పేరు ఉండేదని చెప్పారు. పాలమూరు జిల్లాలో వెనుక బడిన ప్రాంతమైన నారాయణపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత ఈ జిల్లా సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా ముందున్నారన్నారు.చివరగా ఏర్పడిన జిల్లా కాబట్టి సమస్యలు ఉంటాయని కానీ వాటిని అధిగమించి ముందుకు వెళ్లాలన్నారు. ఇంత చక్కటి మెడికల్ కళాశాలలో అన్ని వసతి సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులు మంచిగా చదువుకుని తల్లిదండ్రుల కలను నెరవేర్చాలని సూచించారు. కళాశాల నుంచి సుశిక్షుతులైన వైద్యులుగా తయారై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్ మెడికల్ కళాశాల డెమోగ్రఫీని ప్రజెంట్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, టిజీ ఎం ఎస్ ఐడిసిసీ ఈ. దేవేందర్, ఈఈ రవీందర్, డీ. ఈ. కృష్ణమూర్తి, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

### పెట్రోల్ పంపును పరిశీలించిన సీఎస్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు మెడికల్ కళాశాల సందర్శన అనంతరం సింగారం మలుపు దారి వద్ద జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్ ను పరిశీలించారు. పంప్ లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది తో మాట్లాడారు. ఎక్కడ శిక్షణ తీసుకున్నారని, పంపులో రోజుకు ఎన్ని గంటలు పనిచేస్తారని అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ పంప్ లో ఫైర్ సేఫ్టీ ఉందా అని అడిగారు. పంప్ నిర్వహణకు అవసరమైన నిబంధనలు అన్ని పాటించాలని సూచించారు. రోజుకు ఎన్ని లీటర్ల పెట్రోల్ డీజిల్ విక్రయం జరుగుతుందని ప్రశ్నించారు. పెట్రోల్ ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారనీ, ఎన్ని రోజులకు పెట్రోల్ వాహనం వస్తుందని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చంద్ర కళను అడగగా రోజుకు 5 వేల లీటర్ల విక్రయం జరుగుతుందని, హైదరాబాద్ నుంచి మూడు రోజులకు ఒకసారి పెట్రోల్ వాహనం వస్తుందని ఆమె సీ ఎస్ కు తెలిపారు. పంపు ద్వారా నెలకు ఎంత ఆదాయం వస్తుందో డిఆర్డిఓ మొగులప్ప సీ ఎస్ కు వివరించారు.

# ఇందిరమ్మ గృహ నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ రాజ్



**చిలప్చేడ్, 15 మే (జనంసాక్షి) :** మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్లు గతంలో మంజూరు చేసి వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు గాను ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోందని త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సహదేవ్, ఎంపీడీవో ఆనంద్, ఏపీవో శ్యామ్ కుమార్, తిరుపతి,సంబంధిత రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్థవంతమైన విద్య బోధనతోనే ఉత్తమ ఫలితాలు

- డీఈవో ఏ.రమేష్ కుమార్



**బిజినపల్లి, మే 15 (జనం సాక్షి) :** విద్యార్థులకు అర్థవంతమైన విద్యబోధన చేపడితేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని డీఈవో ఏ.రమేష్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు వృత్యాంతర శిక్షణ తరగతులను గురువారం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మిరాజుల్లాఖాన్తో కలిసి అకస్మీక తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు పెంపొందించేందుకు చేపట్టిన వృత్యాంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తరగతి గదిలో మారుతున్న పాఠ్యాంశాల ఆధారంగా బోదన నైపుణ్యాలను మెరుగుపర్చుకొని బోధన చేపట్టడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నవ నకం పెరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చుతారని అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యత శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కుర్మయ్య. ఎంఈవో రఘునాథ్ శర్మ, సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, డీఆర్పీలు, సీఆర్పీలు మల్లేష్, శేఖర్, సాం బశివుడు, బాలయ్య, మురళి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను వ్యతిరేకించాలి



**గద్వాల్ రూరల్, మే 15 (జనంసాక్షి) :** భారతదేశ కార్మిక వర్గానికి ఉరి తాళ్ళుగా మారిన లేబర్ కోడ్లను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ వెంకటస్వామి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన బుక్లెట్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 100 లేదా అంతకన్నా ఎక్కువ మంది కార్మికులు ఉన్న సంస్థల యాజమాన్యాలు రిట్రెంచ్మెంట్ లే ఆఫ్స్ మూసివేతలు చేయాలంటే తప్పనిసరి ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సింది అని కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పారిశ్రామిక సంబంధాల కోడ్ – 2020 ద్వారా 100 మంది కార్మికుల పరిమితిని 300 మందికి పెంచిందని ఈ కోడ్ అమలులోకి వస్తే 74% పరిశ్రమలలో కార్మికులకు ఉద్యోగ భద్రత భరోసా ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ కార్మికులు బీచుపల్లి రంగన్న రవి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు



**వీపనగండ్ల, మే 16 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలో గురువారం తూముకుంట సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ జి వెంకటేశ్వర్లు తాసిల్దార్ వరలక్ష్మి కాంగ్రెస్ నాయకులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వడ్లను త్వరగా కొనాలని ఇక్కడ కొనుగోలు చేసినటువంటి వడ్లను పెబ్బేరు రైస్ మిల్ కు తరలించాలని సొసైటీ సీఈఓ రాముకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వరలక్ష్మి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్ పోతుల వెంక రెడ్డి, భరత్ రెడ్డి, మణికొండ గోపి, వైయస్ వెంకటయ్య, యూత్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాము రాజశేఖర్, కావలి మహేష్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# రీజినల్ రింగ్ రోడ్ విస్తరణ పనుల వేగవంతం చేయాలి

- పరిహారం చెల్లింపులు ప్రామాణికంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, మే 15 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) విస్తరణ పనుల వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో భూసేకరణకు సంబంధించిన అంశాలపై గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు భూములు అందించిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి అని కలెక్టర్ స్పష్టంగా పేర్కొన్నారు. నష్టపరిహారం చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, ప్రతి రైతుకు న్యాయం జరగాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భూసేకరణకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉండాలి. ప్రాజెక్టు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన అవసరం అన్నారు. సర్వే ప్రక్రియ నుంచి పరిహార చెల్లింపుల వరకు ప్రతీ దశలో అధికారుల బాధ్యత అన్నారు.రైతుల నుండి స్వచ్ఛందంగా భూములు సేకరించేలా అవగాహన కల్పించాలన్నారు.పరిహారం చెల్లింపులు ప్రామాణికంగా ఉండాలన్నారు. భూములను అందించిన రైతులకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. రైతుల భూమికి తగినంత నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాస్తవిక మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం నిర్ణయించాలన్నారు. అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు సమావేశంలో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణకు సంబంధించి రైతుల్లో అభిప్రాయ బేధాలు, సర్వేలో సాంకేతిక సమస్యలు, స్థానిక స్థాయిలో అవగాహన లోపం వంటి అంశాలు ఉన్నాయని తెలియజేశారు. ఈ రహదారి పూర్తయితే హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలతో వేగవంతమైన అనుసంధానం ఏర్పడుతుందని. వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి మేలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలంటే అధికారులు నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెజినల్ అధికారి శివశంకర్, యాదాద్రి భువనగిరి జిల్లా అధికారులు, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అధికారులు నిబద్ధతతో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, మే 15 (జనం సాక్షి) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటూ అధికారులు పూర్తి నిబద్ధతతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.గురువారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్ నందు రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు,వివిధ శాఖల అధికారులతో కలసి పాల్గొని రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. బీచుపల్లి నుంచి పుల్లూర్ జంక్షన్ వరకు ప్రమాద ప్రాంతాలను బ్లాక్ స్పాట్ గుర్తించి, వాటిపై సోమవారం నాటికి పోలీసు, జాతీయ రహదారుల అధికారులతో సంయుక్త పరిశీలన జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎర్రవల్లి నుండి గద్వాల వరకు ప్రమాద సూచిక బోర్డులు, హెచ్చరికల గుర్తులు, కల్వర్టుల మరమ్మతులు చేయాలని ఆర్ అండ్ బి శాఖను ఆదేశించారు. గద్వాల నుంచి రాయచూర్ మార్గంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉండటంతో ప్రమాదాలకు అవకాశమున్నదని, వాటిని ప్రమాణాలతో అనుగుణంగా సవరించాలని, వాహనదారులకు భద్రతతో పాటు సౌలభ్యం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎస్పీ మొగలయ్య, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, పంచాయతీరాజ్ పి.ఆర్ దామోదర్ రావు, జిల్లా రవాణా అధికారి వెంకట్ రమణ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సిద్దప్ప, జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ హిమాన్షు గుప్త, ఎక్సైజ్, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి డి.ఈ లు, ఎ.ఈలు, తదితరులు, పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన వడ్లను కొనుగోలు చేయాలి

- తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్



**గద్వాల నడిగడ్డ, మే 15 (జనం సాక్షి) :** వడ్లు కొనుగోలు యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని తెలంగాణ రైతన్న సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్ డిమాండ్ చేశారు. గురువారము జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ లావు వడ్లు తరుగు పేరు మీద కొనుగోలు చేసిన మిల్లు యాజమాన్యులు దించుకోవడం లేదనీ, ఇప్పటికే వర్షాలు మొదలైన తరుణంలో సేద్యనము చేసుకునే రైతులు చాలా ఇబ్బందులు గురి అవుతున్నారనీ, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తరుగు పేరుతో రైతులకు ఇబ్బంది కలిగించకుండా మిల్లు యజమానులు దీనికి దృష్టిలో ఉంచుకొని యుద్ధప్రాతిపదికన రైతులకు న్యాయం చేయాలని, గద్వాల మండల పరిధిలోని లత్తిపురం,అనంతపురం గ్రామాలు రైతులను గత నెల రోజులైనా గన్ని బ్యాగులుంటే లారీలు, లారీలు ఉంటే గన్ని బ్యాగులు రాలేదని కాలయాపన చేస్తున్నారని, నత్త నడకన కొనుగోలు జరుగుతున్నదనీ, ఇప్పటికైనా మీరు స్పందించి వర్షాలకు తడిసిన ధాన్యం, లావు వడ్లు, సన్నవడ్లు అని పేరు పెట్టకుండా మొత్తం అన్ని కొనుగోలు చేయాలని గ్రామ రైతులు, రైతంగ సమితి గా మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్ తో పాటు, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యారెడ్డి,రషీద్,పెద్ద తిమ్మన్న,భాష,రాజశేఖర్,రాముడు,గోవిందు తదితర రైతులు పాల్గొన్నారు.

# పేట కొడంగల్ ఎత్తిపోతల అనుమతులపై స్పష్టత ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



**మక్తల్, మే 15 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరతో చేపట్టిన పేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నీటి వనరుల శాఖ తరపున అన్ని రకాల అనుమతులు లేవని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 14 ద్వారా చేపట్టిన ఈ పథకం కి ముందుగా నీటిపారుదల శాఖ, మైనింగ్ ఫారెస్ట్ శాఖల అనుమతులను పొందాల్సి ఉండగా అలాంటి అనుమతులు లేకుండా ఈ ప్రాజెక్టును ఆధార బాధరగా చేపట్టడం సరైనది కాదని అన్నారు. పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా మక్తల్ నియోజకవర్గం లోని నర్వ, ఆత్మకూరు, అమరచింత మండలాలకు చెందిన రైతులు ఎంతోనష్టపోవడం జరుగుతుందని తెలిపారు. 1,3 టీఎంసీ సామర్థ్యం గల భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా 90 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి పేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఎలా నీళ్లను తరలించుకపోతారో ప్రభుత్వం ప్రాంత రైతాంగానికి సమాధానం చెప్పాలని అన్నారు. ఈ ప్రాంత రైతన్నలకు నష్టం జరుగుతుంటే బిఆర్ఎస్ పార్టీ సహించదని వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఎలాంటి అనుమతి లేని ఈ ప్రాజెక్టు భూసేకరణ విషయంలో పోలీసులతో బలవంతంగా సర్వే పనులను పూర్తి చేయించడం ఎంతవరకు సరైన విషయము అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులు పి శ్రీనివాసరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి లు తమ సొంత కాంట్రాక్టర్ల ద్వారా సొమ్ము చేసుకోవడం కోసము ఎలాంటి పనులు చేయకుండానే అడ్వాన్సుగా 100 కోట్ల బిల్లులను పెట్టడం చూస్తుంటే ఈ ప్రాజెక్టుల్లో ఎంత అవినీతి అక్రమాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ఊట్కూరు పెద్ద చెరువు నీలను నింపే విషయంలో ఆ రైతంగానికి ఇప్పటివరకు ఎలాంటి అవగాహన లేదని ఇప్పటికే చెరువు ఉరిపక్కల ఉండడం వలన వర్షాకాలంలో గ్రామంలోని ఇండ్లలో తేమవచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అందుకు గాను ఆ గ్రామస్తులకు ఉన్నటువంటి అనుమానాలను నివృత్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ప్రాంత రైతాంగాన్ని మాయమాటలు చెప్పి ఏదో విధంగా ప్రాజెక్టు పనులను చేపట్టాలని అనుకోవడం సరైనది కాదని ఈ ప్రాంతా రైతందానికి నష్టం జరుగుతుంటే మౌనంగా ఉండడానికి బిఆర్ఎస్ పార్టీ వారి వెంబడి ఎప్పటికీ ఉంటుందని రైతుల కోసం ఏ పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు. నిజంగా ముఖ్యమంత్రికి కొడంగల్ ప్రాంతానికి సంబంధించిన రైతాంగానికి సాగునీరు అందించాలని చిత్తశుద్ధి ఉంటే వేరే మార్గాలు ఎన్నో ఉన్నాయని వాటిని వదిలి చిన్న రిజర్వాయర్ అయిన బూత్పూరు రిజర్వాయర్ ద్వారా తీసుకుపోవాలనుకోవడం ఈ ప్రాంత రైతన్న కడుపు మీద కట్టడం అని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు కింద భూమి కోల్పోయిన రైతంగానికి మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. లేని పక్షంలో తమ పార్టీ తరఫున రైతులకు పక్షాన నిలబడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు పి నరసింహ గౌడ్, కే రాజేష్ గౌడ్, నర్వ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, ఊట్కూరు మాజీ జడ్పిటిసిలు అరవిందు కుమార్, అశోక్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దలు కే శ్రీనివాస్ గుప్తా, పట్టణ అధ్యక్షులు జుట్ల చిన్న హనుమంతు, మాజీ కౌన్సిలర్లు మొగిలప్ప, జగ్గలి రాములు, అన్వర్ హుస్సేన్, గార్లపల్లి నరసింహారెడ్డి, శివారెడ్డి, జూట్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సికిల్సెల్ అనీమియాపై అవగాహన



**వెల్దండ, మే 15 (జనంసాక్షి) :** సికిల్ సెల్ అనిమియాపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా సికిల్ సెల్ మోడల్ అధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా సికిల్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఎంఎల్హెచ్పిలకు, ఏఎన్ఎంలకు, ఆశా కార్యకర్తలకు పర్యవేక్షణ సిబ్బందికి సికిల్ సిల్ అనీమియాపై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ సికిల్ సెల్ అనిమియా జన్యుపరమైన లోపం వలన తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుంది. సాధారణంగా ఎర్ర రక్త కణాల జీవితకాలం 120 రోజులు ఉంటుంది, కానీ సికిల్ సెల్ వ్యాధితో బాధపడే వారికి ఎర్ర రక్త కణాల జీవితకాలం 10–20 రోజులు మాత్రమే ఉంటుంది. కావున వీరు తరచుగా రక్తహీనత తో బాధపడుతుంటారు. సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు ప్రాథమిక పరీక్షలు పిఓసిఈ విధంగా నిర్వహించాలి అని క్షేత్ర సాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సింధు ఏ పి ఓ నిరంజన్, కల్వకుర్తి డివిజన్ ఉప మలేరియా అధికారి పర్వతాలు ఎంఎల్హెచ్పిలు, డాక్టర్ నవీన్, యాదయ్య,సాయి పవన్, సూపర్వైజర్లు మురళి, కవిత ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్, గోవర్ధన్, తిరుపతమ్మ, పద్మ, ఎల్లమ్మ, జానకి చంద్రకళ ,పద్మావతి, జహంగీర్ బి, ఆశా కార్యకర్తలు సుజాత స్వప్న యాదమ్మ వసంత చంద్రకళ మండల వైద్య సిబ్బంది మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# రానున్నవి మనకు మంచి రోజులే..

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**పాలకుర్తి. మే 15( జనంసాక్షి)**

నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి మంచి రోజులు రానున్నాయని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం సోమేశ్వర ఫంక్షన్ లో నిర్వహించిన ఆ పార్టీ మండల స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలందరినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నాడని విమర్శించాడు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో అన్ని స్థానాలను బిఆర్ఎస్ పార్టీ గెలుచుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక మాయమాటలు చెప్పి ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక మాయమాటలు చెప్పి పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నాడని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నియోజవర్గంలో టిఆర్ఎస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన అందరికీ గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నవీన్. మాజీ జెడ్పిటిసి పుస్కూరి శ్రీనివాసరావు. మాజీ ఎంపీపీ నాగిరెడ్డి. ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ అశోక్ రెడ్డి. మాచర్ల ఎల్లయ్య. కారుపోతుల వేణు. బాలు నాయక్, యాకూబ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# రూ.50 వేల విలువచేసే గంజాయి పట్టివేత

**ఖానాపూర్, మే 15 (జనంసాక్షి) :**

రూ.50 వేల విలువ చేసే 1.20 గ్రాముల గంజాయిని రహస్య సమాచారం మేరకు ఎస్సై రాహుల్ గైక్వాడ్ పట్టుకున్నట్లు సీఐ సిహెచ్.అజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14 సాయంత్రం బస్టాండ్ పరిసరాలలో ఒక వ్యక్తి గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో హుటాహుటిన బస్టాండ్ చేరుకొని గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయేందుకు యత్నించినట్లు తెలిపారు.

పోలీసులు వెంబడించి పట్టుకొని విచారణ చేయగా అతని పేరు ఎస్.కె సలీంగా తేలిందన్నారు. నిందితుడు పూర్వ నేరస్తుడిగా అతనిపై 14 కేసులు ఉన్నట్లుగా ధ్రువీకరించినట్లు వివరించారు. అలాగే గంజాయి మెట్పల్లి నుండి కొనుగోలు చేసి తీసుకువచ్చి ఖానాపూర్ పట్టణంలో విక్రయించేందుకు ప్రయత్నించానని నేరస్తుడు ఒప్పుకున్నట్లు ప్రకటనలో సీఐ పేర్కొన్నారు.

# బీసీ గురుకుల డిగ్రీ కోర్సుల ప్రవేశ దరఖాస్తు గడువు 20 వరకు పెంపు

**ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి**

**ఎంజెపి కార్యదర్శి, బడుగు సైదులు, ఐఎఫ్ఎస్**

**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి)**

: బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికి సీటు కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 20వ తేదీ వరకు పెంచామని ఎంజేపి కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ గారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసి విద్యార్థుల, తల్లిదండ్రుల వినతి మేరకు గడువు తేదీ పొడిగించామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

MJPTBCW రెసిడెన్షి యల్ డిగ్రీ కళాశాలలలో (ఇంగ్లీష్ మీడియం) మొదటి సంవత్సర డిగ్రీ కోర్సులకు (B.Sc (Physical & Life Sciences), B.Com, B.A, BBA, BFT, Animation & VFX etc.) ఆన్లైన్ ద్వారా mjptbcwreis .telangana. gov.in లేదా tgrdccet. cgg.gov.in/T GRD-CWEB లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



ఇప్పటికే ఎంజెపి జూనియర్ కళాశాల లో చదివిన ఇంటర్మీడి యట్ విద్యార్థులు దరఖాస్తు చేయనవసరం లేదు.

వారు సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం. 040-23328266 లో (కార్యాలయ సమయంలో) సంప్రదించాలని కార్యదర్శి సూచించారు.

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు

## మహమ్మద్ అలీ షబ్బీర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 15 (జనం సాక్షి) :**



నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతున్నదని రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, ఒబిసి, మైనారిటీ సంక్షేమ శాఖల సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. గురువారం కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లకు మార్కవట్,ఇచ్చి భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారం లోకి రాకముందు ప్రస్తుత ముఖ్యమంత్రి అప్పటి పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి కామారెడ్డి నుండి రాజంపేట వరకు 2023 మార్చి 18న పాదయాత్ర చేసిన సమయంలో నిరుపేదలైన ఇల్లు కూలిపోయిన చిట్యాల రాజమణి, బిక్కునూరి లక్ష్మి లకు ఇళు కట్టిస్తామని ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడిన పిమ్మట 2025 జనవరి 28న స్పెషల్ కేసు కింద ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, తెలిపారు. కేవలం ఇద్దరికీ మాట ఇచ్చి ముగ్గురికి బిక్కునూరి రేఖ శ్రీకాంత్ లకు కూడా ఇల్లు కట్టిస్తామని తెలిపారు. శాసన మండలి ఎన్నికల కోడ్ రావడం వలన ఆలస్యమైందని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు అయిన తర్వాత తాను స్వయంగా లేదా వర్చువల్ ద్వారా గృహప్రవేశం నకు హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిపారు. నియోజక వర్గంలో ఇప్పటివరకు 3028 ఇండ్లు నిరుపేదలకు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లక్ష్మీ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీఓ వీణ, తహసీల్దార్ జనార్ధన్, ఎంపీడీఓ ఎలిజబెత్ రాణి, ఇతర శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

## రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**వరంగల్ ప్రతినిధి, మే15 (జనం సాక్షి)**

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం వరంగల్ లోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ హైస్కూల్లో జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడవరోజు మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్యసారదాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు వారి స్థాయికి అనుగుణంగా వారిలో ఆసక్తిని పెంపొందించే విధంగా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కుల మతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించుటకు ప్రతి నియోజక వర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ లను ఏర్పాటు చేస్తున్నట్లు అందులో భాగంగా ఉర్స్ కరిమాబాద్ లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా

ఉపాధ్యాయులకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజులపాటు శిక్షణ

కార్యక్రమాలను సద్వినియో గం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్ తేజ అసిస్టెంట్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు సెంటర్ ఇన్చార్జ్ వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# రామప్పలో హెరిటేజ్ వాక్ సక్సెస్

## దీన్ని చూడలేక బిఆర్ఎస్ నేతలు కళ్ళలో నిప్పులు మంత్రి సీతక్క

**ములుగు ప్రతినిధి, మే 15(జనంసాక్షి) :**



యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం వద్ద హెరిటేజ్ వాక్ సక్సెస్ కావడంతో బిఆర్ఎస్ నేతలు కళ్ళలో నిప్పులు పోసుకుంటున్నారని, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇండియాకు ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకులు ఎలాంటి సంప్రదాయాలు పాటించారు అందరికీ తెలుసు అని, గిరిజన సంప్రదాయంలో గుల్లలోకి కాళు కడుగుకొని వెళ్లడం సంప్రదాయమని అదే రామప్పలో పాటించారని, అందులో ఒక అమ్మాయి ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్లకు నీళ్లు పోసిందని దానిని పట్టుకుని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బదనాం చేస్తున్నారని ఆమె తెలిపారు. టిఆర్ఎస్ నాయకులు నిస్సిగ్గుగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కవితమ్మ కాళ్ల దగ్గర కలెక్టర్ ను కూర్చోబెట్టినప్పుడు కేసీఆర్ కలెక్టర్లతో కాళ్లు మొక్కించుకున్నప్పుడు మీకు గుర్తు రాలేదా, దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని ప్రక్కన పెట్టారని అన్నారు. ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకు లేదని తెలంగాణ పేరుని పార్టీ పేరులో నుంచి తీసేశారు కదా, సబితా ఇంద్రారెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని సీతక్క పేర్కొన్నారు.

# పుష్కరాల్లో పలువురు భక్తులకు వడదెబ్బ



## అత్యవసర చికిత్స కేంద్రాలకు తరలింపు

**కాళేశ్వరం ,మే 15,( జనం సాక్షి)**

: సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం త్రివేణి సంగమం పుణ్య స్నానాలు, దర్శనాలకు వచ్చిన భక్తులు ఎండ తీవ్రతకు తట్టుకోలేక వడ దెబ్బకు గురయ్యారు. వాహనాలు స్నానపు ఘాట్లకు దూరంగా నిలిపివేయడంతో నడవలేక పలువురు భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. వీరిలో ఒక పారిశుధ్య కార్మికుడు విధులు నిర్వహిస్తున్న క్రమంలో సొమ్మసిల్లి పడిపోవడం జరిగింది. మిగతా నలుగురు భక్తులు కరీంనగర్, వరంగల్ ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన వారనీ తెలిసింది. వారందరిని ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించి చికిత్సను

అందించడం జరుగుతుం దని, ప్రస్తుతంవారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పుష్కర స్నానాలకు వచ్చిన భక్తులం దరూ చలవ పందిళ్లకు పరిమితం కావడంతో చలవ పందిళ్లు భక్తుల రద్దీతో కిటకిటలాడయి.

# విద్యా సంస్థలు సృజనాత్మకతను ప్రోత్సహించాలి

**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ రిటైర్డ్ ప్రొఫెసర్ రెడ్డన్న**

**పరిశోధనల నుంచి మార్కెట్ వరకు మార్గదర్శనం**

**హైదరాబాద్, మే 15 (జనం సాక్షి) :**

విద్యా సంస్థలు సృజనాత్మకతను ప్రోత్సహించాలని ఫెడరేషన్ ఆఫ్ ఆసియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్, ఏఎస్పీఐఆర్ఈ వ్యవస్థాపక డైరెక్టర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ రిటైర్డ్ ప్రొఫెసర్ రెడ్డన్న తెలిపారు. పరిశోధనల నుంచి మార్కెట్ వరకు భారత విద్యా వ్యవస్థలో ఔషధ ఆవిష్కరణకు మార్గ దర్శనం చేశారు. వికారాబాద్ లో ఉన్న శ్రీ సాయి డెంటల్ కళాశాల ప్రొఫెషనల్ విద్య ఆరంభంలోనే దంత విద్యార్థుల్లో పరిశోధన అభిరుచి పెంచే దిశగా ముందడుగు వేసింది. అందులో భాగంగా ఇటీవల ఎస్ఎస్డీఎస్ రీసెర్చ్ కమిటీ నిర్వహించిన 'పరిశోధన, ఆవిష్కరణల సంస్కృతిని ప్రోత్సహించాలి' అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. 'విద్యా సంస్థలలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత పర్యావరణ వ్యవస్థ: హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఒక కేస్ స్టడీ' అనే అంశంపై మాట్లాడారు.




భారతదేశం మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో శక్తివంతమైన సామర్థ్యం కలిగి ఉన్నా.. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ మార్కెట్లో మన వాటా కేవలం 0.64 శాతం (10 ట్రిలియన్ డాలర్లు, ప్రపంచ మార్కెట్లో 638 బిలియన్ డాలర్లు) మాత్రమేన న్నారు. తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం.. భారత ఔషధ పరిశ్రమ ఎక్కువగా జనరిక్ ఔషధాలు, బయోసిమిలర్లపై దృష్టి సారించడమేనన్నారు. ఇవి ఎక్కువ పరిమాణంలో ఉత్పత్తి అవుతాయి, కానీ విలువ తక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల పరిశ్రమలో ఆవిష్కరణ ఆధారిత ఔషధ అభివృద్ధి వైపు వ్యూహాత్మక మార్పు జరగాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ నాగర్జున రెడ్డి మాట్లాడుతూ ముందస్తు ముందస్తు రోగ నిర్ధారణ కోసం ముందస్తు గాయాలలో బయాప్సీ కీలక ప్రాముఖ్యతను వివరించారు.

డాక్టర్ జగదీష్ గండ్ల మాట్లాడుతూ నేటి యుగంలో వ్యక్తిగత బ్రాండింగ్, సాఫ్ట్ స్కిల్స్ అనే అంశంపై మాట్లాడారు.

# అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలి

**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 15 (జనం సాక్షి):**



ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు అయ్యే విధంగా అధికారులు పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ శాఖల పనితీరు, చేపట్టాల్సిన వివిధ అంశాలపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు మాట్లాడుతూ ...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి వారికి అందేలా అధికారులు పనిచేయాలన్నారు. ఒక్క శాతం ఉన్న ఉద్యోగులుగా మనం 99 శాతం ఉన్న ప్రజలకు సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. రైతులు సన్న రకం బియ్యాన్ని పండించే విధంగా ప్రోత్సహించాలని తెలుపుతూ, సన్న బియ్యం పండించే వారికి అదనంగా 500 రూపాయలు బోనస్ ఇవ్వడంతో పాటు అన్ని కుటుంబాలకు పోషక ఆహారాన్ని అందించే లక్ష్యంగా చౌక ధర దుకాణంల ద్వారా సన్న బియ్యాన్ని ప్రజలకు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. రాజీవ యువ వికాస్ పథకం ద్వారా యువతకు ఉపాధి కలిగేలా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. రైతు భరోసా, రుణమాఫీ పథకం వివరాలను ప్రధాన కార్యదర్శి సంబంధిత శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అదే విధంగా విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేవిధంగా అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా పారిశుధ్య వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వ కార్యదర్శి అధికారులకు సూచించారు.ప్రభుత్వం రెవిన్యూ సమస్యలు పరిష్కరించే దిశగా భూ భారతి చట్టం ద్వారా వెసులుబాటు కల్పించిందని, ప్రజల సమస్యల పరిష్కార దిశగా అధికారులు అంకితభావంతో పని చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్డీఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**సన్న బియ్యం పండించే విధంగా రైతులను ప్రోత్సహించాలి**

**రాజు యువజన వికాస్ పథకాన్ని వేగవంతం చేయాలి**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**



# జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**నరసింహులపేట, మే.15 (జనం సాక్షి):**

గురువారం నరసింహులపేట మండలం వంతడుపుల గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, రెవెన్యు అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారీతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో, కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందో లేదో పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని, రైతులందరికీ సముచితమైన ధర లభించేలా చూడాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

# కాళేశ్వరం ప్యాకేజ్ 22 కెనాల్ పనులకు నిధులు మంజూరు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 15 (జనం సాక్షి)**

కాళేశ్వరం ప్యాకేజీ 22 కెనాల్ పనులకు ప్రభుత్వం 23.15 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఇర్రిగేషన్ సీఈఓ శ్రీనివాస్, ఎల్లారెడ్డి ఈ ఈ మల్లేష్ లు కలిసి భూసేకరణ పనులపై కలెక్టర్ తో చర్చించారు. కెనాల్ పనులకు 316 ఎకరాలకు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకా 97 ఎకరాలు అవార్డ్ స్టేజీ లో ఉన్నందున రైతులకు చెల్లింపులు చేయుటకు కలెక్టర్ ను ఇంజనీరింగ్ అధికారులు కోరారు. సబ్ డివిజన్ రికార్డు స్టేజిలో 203 ఎకరాలు ఉన్నందున అట్టి దానిని అవార్డు స్టేజీ కి తీసుకువెళ్ళడానికి ఆర్డీఓ కు సూచిస్తూ భూ సేకరణ పనులు త్వరగా చేసే విధంగా కలెక్టర్ ఆదేశించారు.

జనంసాక్షి www.janamsakshi.org
శుక్రవారం 16 మే 2025

# ఆగస్టు 15 లోపు గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి తెస్తాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**కల్లూరు, మే 15 (జనం సాక్షి) :** ఖమ్మం టూ దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం నాటికి అందుబాటులోకి రానున్న గ్రీన్ ఫీల్డ్ హైవేపై రాకపోకలు ప్రారంభిస్తామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గం లోని ఏంసూరు మండలం లింగపాలెం హైవే రోడ్డు ఎగ్జిట్ నుండి సత్తుపల్లి, కల్లూరు మండలం లింగాల గ్రామం హైవే రోడ్డు ఎగ్జిట్ వరకు రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, పలువురు అధికారులు పార్టీ శ్రేణులతో కలిసి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లింగాల హైవే ఎగ్జిట్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా గ్రీన్ ఫీల్డ్ హైవేపై మూడు ప్రాంతాల్లో ఎగ్జిట్ లు సాధించిన ఘనత ఒక సత్తుపల్లి నియోజకవర్గం నెంబర్ వన్ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి దక్కిందన్నారు.రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు ధాన్యం వరిగడ్డి, ఇతర ఉత్పత్తులను రవాణా చేసుకునేందుకు కొన్ని ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు కావాలని రైతులు ప్రజలు కోరడం జరిగిందని ఈ విషయాన్ని కేంద్రమంత్రి గడ్కారి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. సాధ్యమైనంత వరకు సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. జులై 2వ



తారీకు నాటికి హైవే రోడ్ పనులు పూర్తి చెయ్యలి అని ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. నేషనల్ హైవే రోడ్డు అందుబాటులోకి వస్తే ఖమ్మం నుంచి సత్తుపల్లి కి 33 నిమిషాల్లో ప్రయాణించవచ్చని అన్నారు. హైవే రోడ్డు మధ్య ప్రాంతంలో సాగర్ కెనాల్ ఉండటం వల్ల డిజైన్ మార్చి ఇరువైపులా రెండు పిల్లర్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఒకవైపు పిల్లర్ జూలై ఒకటికి పూర్తవుతుందని మరోవైపు జూలై 15 నాటికి పూర్తి చేయనున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారని చెప్పారు. హైవే రహదారిపై ఏర్పాటుచేసిన ఎగ్జిట్ ప్రదేశాలను, నిర్మాణ పనులపరిశీలనలో భాగంగా ఎక్కడెక్కడ పెండింగ్ పనులు ఉన్నాయని అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. జులై 15 నాటికే హైవేపై రాకపోకలు కొనసాగించవచ్చని అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఖమ్మంలో జెండా ఊపి కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో హైవేపై 3 ప్రాంతాల్లో ఎగ్జిట్ లు ఇచ్చినందుకు ధన్యవాదములు తెలిపారు.సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్నరాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులు బట్టి విక్రమార్క తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.. అనంతరం లింగాల గ్రామ రైతు సోదరులు ఎమ్మెల్యే మట్టా రాగమయి డాక్టర్ మట్టా దయానంద్ దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు . ఈ కార్యక్రమం లో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థచైర్మన్ రాయల నాగేశ్వరరావు , రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు, ఐక్కినేని కృష్ణ, ఏనుగు సత్యం బాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, భాగం ప్రభాకర్ అలకుంట నరసింహారావు బొల్లం రామారావు,, సత్తుపల్లి కల్లూరు ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్, భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, ఆర్టీవో రాజేంద్ర గౌడ్,పలు శాఖల అధికారులు, సత్తుపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు రైతు సోదరులు, మహిళలు పాల్గొన్నారు.

# పార్కింగ్ చేసే కార్లలో పిల్లలు ఎక్కకుండా చూడాలి

- ఆదమరిస్తే అంతే...చిన్నారులు జరభద్రం
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహా



**సూర్యాపేట ప్రతినిధి, మే 15 (జనంసాక్షి) :** వేసవి కాలంలో పార్క్ చేసిన వాహనాల్లోకి అనుకోకుండా వెళ్ళిన పిల్లలు తీవ్రమైన వేడిమి వల్ల ఊపిరాడక మృతి చెందుతున్న సంఘటనలు చాలా చోట్ల ఇటీవల నమోదయ్యాయని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. ఈ నేపథ్యంలో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండటానికి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి ఘటనలు జరగకుండా విలువైన చిన్నారుల ప్రాణాలను రక్షించగలమని అన్నారు. వాహనాన్ని లాక్ చేయకముందు వాహనంలో ఎవరైనా ఉన్నారా అని పూర్తిగా తనిఖీ చేసుకోవాలన్నారు. ముందు, వెనుక సీట్లను గమనించి పరిశీలించుకోవాలని సూచించారు.పార్క్ చేసే వాహనంలో, వాహనం చుట్టుపక్కల పిల్లలను ఒంటరిగా వదిలివెళ్ళకూడదని పేర్కొన్నారు.వాహన తాళాలను పిల్లలకు అందుబాటులో ఉంచకూడదని అన్నారు.అనుకోకుండా వాహనంలోకి వెళ్లి చిక్కుకుపోయే ప్రమాదంను గమనించాలని అన్నారు.వాహనాల్లో ఆడుకునే ప్రదేశాలు కాదని పిల్లలకు స్పష్టంగా అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు.వాహనాల్లో ఒంటరిగా ప్రవేశించరాదని వారికి అర్థమయ్యేలా వివరించి చెప్పాలని అన్నారు.రియర్ సీట్ రిమైండర్,చైల్డ్ డిటెక్షన్ అలర్ట్ వంటి భద్రతా పరికరాలను వాహనాల్లో అమర్చాలని సూచించారు.వాహనాల విండోలకు బ్లాక్ ఫిల్ములు లేదా అధిక టింటింగ్ ఉపయోగించరాదన్నారు.వాహనంలో ఎవరైనా ఉంటే గుర్తించలేని ప్రమాదం ఉందన్నారు.వాహనం వాడకంలో లేకపోయినప్పటికీ డోర్లు, విండోలను పూర్తిగా మూసి లాక్ చేయాలన్నారు.పిల్లలు కనిపించకుండా పోతే, వాహనాల్లో, సమీప వాహనాల్లో పరిశీలించాలని తెలిపారు.

# అమెరికాలో తైక్వాండో క్రీడలో రాణిస్తున్న మంథని వాసి

- ఒలంపిక్స్ లో పాల్గొనడమే నా లక్ష్యం
- తైక్వాండో క్రీడాకారిణి వరహాల ఆరిణి



**మంథని, మే 15 (జనంసాక్షి) :** అంతర్జాతీయ క్రీడల్లో మంచి పేరున్న తైక్వాండో క్రీడలో అమెరికాలోని నార్త్ కరోలియాలో స్థిరపడిన మంథని వాసి వరహాల ఆరిణి మంచి గుర్తింపు సాధించడం విశేషం. ఈ క్రీడ దక్షిణ కొరియాలో ఎంతో ప్రాముఖ్యత సాధించి నేడు ప్రపంచ క్రీడల్లో ఎందరో క్రీడాకారులను ఆకర్షిస్తున్న క్రీడగా ఇది ఒలింపిక్స్ లో కూడా ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా వరహాల ఆరిణి మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి తైక్వాండో నేర్చుకుంటున్నానని, తైక్వాండో శరీరానికి చాలా మంచిదని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కరాటే ఎంత ముఖ్యమైనదో క్రికెట్, ఇతర దేశాలలో మార్షల్ ఆర్ట్స్ అంతే ముఖ్యమైన క్రీడ అని ఆమె పేర్కొన్నారు. తైక్వాండో చేస్తే మన శరీరం ఆరోగ్యంగా ఉంటుందని తైక్వాండో అన్నది ఒక ఒలింపిక్ స్పోర్ట్ ఈవెంట్ గా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. చాలా సేపు కూర్చుంటే, కాళ్ళకు మంచిది కాదని అందుకే తైక్వాండో చేస్తే మన వివిధ శరీర భాగాలకు మంచిదని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. తైక్వాండో దక్షిణ కొరియాలో పుట్టిన క్రీడ అని నేను ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు కలిగిందని ఆమె వెల్లడించారు. తైక్వాండో లో మాకు కిక్స్, పంచెస్, పుమ్సె లతో పాటు మాకు రోజు వ్యాయామాలు చేయిస్తున్నారని ఆమె తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి తైక్వాండో నేర్చుకుంటున్నానని తైక్వాండో శరీరానికి, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఆమె తెలిపారు. తైక్వాండో చేస్తే మన శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. తైక్వాండో లో కిక్స్, పంచెస్, పుమ్సె లతో పాటు మాకు రోజు వ్యాయామాలలో పూర్తిస్థాయి శిక్షణ పొందుతున్నాన్నారు. ఇంకా ఈ క్రీడలో ఎన్నో నైపుణ్యాలను పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన తర్వాత ఒలింపిక్స్ లో పాల్గొనే ఆకాంక్ష ను ఆమె వ్యక్తం చేశారు. ఆరిణి క్రీడల్లో మంచి పేరు పెట్టడం తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- నేడు రుద్రంగిలో పర్యటించనున్న మంత్రుల బృందం



**రుద్రంగి, మే 15 (జనం సాక్షి) :** రెవెన్యూ, హౌసింగ్ ఐ అండ్ పీఆర్ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు.మంత్రుల పర్యటన నేపథ్యంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే లతో కలిసి చేయాల్సిన ఏర్పాట్ల పై విప్ ఆది శ్రీనివాస్ గురువారం రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతి చట్టం ముందస్తుగా 4 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నిర్వహించామని, ప్రస్తుతం ప్రతి జిల్లాలో ఒక మండలం రాజన్న సిరిసిల్ల జిల్లాలో రుద్రంగిలో భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.అసైన్మెంట్ కమిటీల ద్వారా ప్రభుత్వ భూములలో సాగు చేసుకుంటూ పట్టాలు రాని అర్హులు ఎవరైనా ఉంటే వారికి తప్పనిసరిగా అందజేస్తామని ప్రకటించారు. రుద్రంగి మండల కేంద్రానికి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వస్తారని తెలిపారు.రుద్రంగి మండలంలో మంజూరైన 243 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం కూడా హౌసింగ్ శాఖ మంత్రి చేతులమీదుగా జరుగుతుందని తెలిపారు. రుద్రంగిలో ఇంటి కోసం పేదలు చేసుకున్న దరఖాస్తులు ఇంకా ఏమైనా పెండింగ్ లో ఉంటే వెంటనే మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారులను విప్ ఆదేశించారు. మంత్రి పర్యటనకు రైతులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు ఇచ్చారు.అనంతరం ఇందిరమ్మ ఇండ్ల ముగ్గు పోసి ప్రారంభించే కార్యక్రమ ఇంటి స్థలాలు, హెలిపాడ్, బహిరంగ సభా వేదిక, రెవెన్యూ సదస్సులు జరిగే సభ వేదిక, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూభారతి సహాయ కేంద్రం వంటివి పరిశీలించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.రాధాబాయి, రుద్రంగి తహసిల్దార్ శ్రీలత,ఎంపీడీవో నటరాజ్,ఈఈ ఆర్ %c% బీ వెంకట రమణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ శంకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిట్టి గుండెకు గట్టి అండ

- ఆపదలో ఆదుకున్న చిన్న పిల్లల వైద్యులు
- పెద్ద మనస్సుతో సాయం అందించిన చలసాని ఝాన్సీ





**ఖమ్మం, మే 15 (జనంసాక్షి) :** ఖమ్మం ముస్తఫా నగర్లో హెూం గార్డుగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ రఫీక్ ఇద్దరు సంతానం. ఒక కుమార్తె , కుమారుడు ఉన్నారు. కుమారుడు మహ్మద్ అయాన్ కు చిన్ననాటి నుంచి గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. వయస్సు పెరిగిన తర్వాత గుండెకు శస్త్రచికిత్స చేయాల్సి వస్తుందని డాక్టర్లు తెలిపారు. అయాన్ ప్రస్తుతం మూడేళ్ల వయస్సుకు వచ్చాడు. అతనికి శస్త్రచికిత్స అత్యవసరమని హైదరాబాద్ కు చెందిన ప్రముఖ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. అందుకు గాను రూ.4 లక్షల వరకు వైద్య ఖర్చు అవుతుందని తెలిపారు. హెూం గార్డుగా విధులు నిర్వర్తించే రఫీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో దాతల సాయం కోరాడు. ప్రముఖ న్యూస్ ఛానల్ లో పని చేస్తున్న ఖదీర్ ని ఆశ్రయించాడు. ఖదీర్ కు ఆప్తమిత్రులైన చిన్న పిల్లల వైద్యులు డా. కూరపాటి ప్రదీప్ కుమార్ , డా. కేవి కృష్ణారావు ను సంప్రదించాడు. డా. కేవి కృష్ణ రావు హైదరాబాద్ లోని వైద్యులతో మాట్లాడి ఫీజు , ట్రీట్మెంట్ విషయంలో చొరవ తీసుకున్నారు. డా. కూరపాటి ప్రదీప్ కుమార్ కు కుటుంబ సంబంధాలు కలిగిన చలసాని ఝాన్సీ కుమార్తె -అల్లుడు వంశీ - సుప్రజల ద్వారా చిరంజీవి అయాన్ కు జరిగిన గుండె శస్త్ర చికిత్సకు లక్ష రూపాయల సాయం అందించి, అయాన్ ను దీవించారు. మనిషి మనిషికి ఉపయోగ పడాలని ఝాన్సీ అభిప్రాయ పడ్డారు. పక్షులు , జంతువులు తమ జాతికి సహాయం చేసుకుంటున్నట్లుగా , మానవ జాతి పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవాలని కోరారు. వైద్యులు , జర్నలిస్టు సమక్షంలో లక్ష రూపాయల నగదును మహ్మద్ అయాన్ తండ్రి మహ్మద్ రఫీకి అందించారు. ఈ కార్యక్రమంలో డా. కూరపాటి ప్రదీప్ కుమార్, డా. కేవి కృష్ణారావు , జర్నలిస్ట్ ఖదీర్ , చలసాని ఝాన్సీ , మంగా తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఫైనాన్స్, చిట్స్ దందా వ్యాపారుల ఇండ్లలో సోదాలు

- 62 ఖాళీ బ్యాంక్ చెక్స్, 82 ప్రాంసరీ నోట్లు స్వాధీనం
- ఆరుగురిపై కేసు నమోదు
- టౌన్ ఏసీపీ రమణ మూర్తి

**ఖమ్మం టౌన్, మే 15 (జనంసాక్షి) :** నిబంధనలకు విరుద్ధంగా చిటీలు, ఫైనాన్స్/ గిరిగిరి వ్యాపారం నిర్వహిస్తున్న పలువురి ఇండ్లలో ఖమ్మం టౌన్ డివిజన్ పోలీసులు సోదాలు నిర్వహించినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని పాకబంద బజార్, టీస్టీవోస్ కాలనీ,వేణుగోపాలనగర్, పంపింగ్ వెల్ రోడ్డు,గాంధీనగర్, ఆల్లీపూరం, కొత్తగూడెం, మంచుకొండ ప్రాంతాలలో నిబంధనలు విరుద్ధంగా నిర్వహిస్తున్న అనాధికార చిట్స్, అధిక వడ్డీలతో ప్రజలను పీడిస్తున్న ఫైనాన్స్/ గిరిగిరి వ్యాపారుల ఇండ్లలో ఏకకాలంలో 8 చోట్ల దాడులు నిర్వహించి తనిఖీలు చేసినట్లు తెలిపారు. లక్షల విలువ చేసే 62 ఖాళీ బ్యాంక్ చెక్స్, 82 ప్రాంసరీ నోట్లు, 12 చిట్టి బుక్స్ లభ్యమయ్యాయినట్లు తెలిపారు. చిట్ నిర్వాహకులు తమ కష్టపడ్డ నుండి సేకరించిన డబ్బును చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం, దౌర్జన్యాలు, దాడులు చేయడం వంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న చిట్స్, ఫైనాన్స్ వ్యాపారుల ఇండ్లలో తనిఖీ చేసి ఆరుగురిలో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించి వారిపై ఖమ్మం వన్ టౌన్, టూ టౌన్, ఖానపూరం హవేలీ, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు



**వెల్దండ, మే 15 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు గురువారం ప్రశాంతంగా ముగిశాయని ఇంచార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకి వివిధ బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకి మొత్తం 2370 మంది అప్లై చేసుకోగా ఇంటర్వ్యూ మాత్రం 1674 మంది హాజరైనట్లు ఇన్చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు గిరి , వికాస్ పాల్గొనడం జరిగింది.

# చంద్రుగొండ మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన



- ఉపాధి కూలీలతో మాటామంతి

**చంద్రుగొండ, మే 15 (జనం సాక్షి) :** చంద్రుగొండ మండలంలో గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకస్మికంగా పర్యటించారు. మంగయ్య బంజర్ పోకల గూడెం రావికంపాడు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులను పరిశీలించి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారితోపాటు పలుగు పారా పట్టి పనులలో పాల్గొన్నారు. మంగయ్య బంజర గ్రామపంచాయతీలో ఫారం ఫండ్ పనులను పరిశీలించారు. పోకల గూడెం గ్రామపంచాయతీ పరిధిలో అగ్రికల్చర్ రోడ్డు ఏర్పాటు పనులను పరిశీలించి కూలీలతో ముచ్చటించారు. ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలించి దాని ఉపయోగాలు తెలియజేశారు. రావికంపాడులో పశువుల షెడ్డు మునగ తోటలు పరిశీలించి రైతులకు తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమాలు డిఆర్డిఏ పిడి విద్యా చందన ఈసీ రాజు ఎండీవో అశోక్ ఏవో నవీన్ ఎంపిఓ ఖాన్ ఏపీఎం శ్రీను కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, బోగిన బోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# న్యాచురల్ ఫార్మింగ్ వైపు రైతులను ప్రోత్సహించాలి

- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం టౌన్, మే 15 (జనంసాక్షి) :** జిల్లాలో న్యాచురల్ ఫార్మింగ్ వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో న్యాచురల్ ఫార్మింగ్ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. న్యాచురల్ ఫార్మింగ్ కింద చేపట్టిన కార్యక్రమాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. న్యాచురల్ ఫార్మింగ్ పై వ్యవసాయ క్లస్టర్ వారీగా చేపట్టిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం న్యాచురల్ గా చేసే వ్యవసాయం ద్వారా వచ్చే పంటలో పోషక విలువలు అధికంగా ఉండేవని, నేడు ఎరువులు అధికంగా వాడటం వల్ల రైతుకు పెట్టుబడి పెరగడంతో పాటు వచ్చే పంట దిగుబడిలో నాణ్యత ఉండటం లేదని, న్యాచురల్ ఫార్మింగ్ పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. మన పూర్వీకులు తిన్న ఆహారంలో ఉన్న పోషక విలువలలో నేడు మనకు కనీసం 20 శాతం మించి ఉండటం లేదని అన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ పై విస్తృత ప్రచారం కల్పించి, దీనికి ఆసక్తి కనబరిచిన రైతుల పొలాల దగ్గర ఫీల్డ్ సాయిల్ టెస్టింగ్ చేసే




యంత్రాలు తెప్పించుకొని సాయిల్ ప్రొఫైల్ తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. పొలాలలో ఉన్న లోపాలను పరిశీలించి న్యాచురల్ గా అధిగమించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలని గుర్తించి రైతులకు తెలియజేయాలని కలెక్టర్ అన్నారు. రైతులు న్యాచురల్ పద్ధతులను పాటిస్తున్నారా లేదా వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలించాలని అన్నారు. రైతులతో ఎప్పటికప్పుడు సంప్రదించేందుకు గ్రామాలలో ఇద్దరు రైతు మిత్రలను వారం రోజులలో ఎంపిక చేసుకోవాలని అన్నారు. ఒక క్లస్టర్ లో ఒక క్రాప్, రైతులను వ్యవసాయ విస్తరణ అధికారి ఎంపిక చేసుకొని అక్కడ న్యాచురల్ ఫార్మింగ్ జరిగేలా చూడాలని, 6 నెలల తర్వాత పండిన పంటకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దగ్గర ప్రత్యేక ఆర్గానిక్ మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ ద్వారా పండించిన పంటలు అమ్ముకునేందుకు కూడా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. ఆర్గానిక్ ఫార్మర్ రామిరెడ్డి మాట్లాడుతూ, 25 సంవత్సరాల నుంచి వర్మి కంపోస్ట్ తయారు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆర్గానిక్ మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతులు న్యాచురల్ ఫార్మింగ్ వైపు పెద్ద ఎత్తున ముందుకు వచ్చే ఆస్కారం ఉంటుందని అన్నారు. రైతులకు న్యాచురల్ ఫార్మింగ్ చేసేందుకు వీలుగా ఇన్ పుట్ యూనిట్లను అందించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, నీటిపారుదల శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఏ.ఈ.ఓలు, రైతులు పాల్గొన్నారు.




# నష్టాలకు బ్రేక్..

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

గురువారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1,127.91 పాయింట్లు లేదా 1.39 శాతం లాభంతో 82,458.48 వద్ద నిలిచింది. నిఫ్టీ 395.20 పాయింట్లు లేదా 1.60 శాతం లాభంతో 25,062.10 వద్ద ఉంది.మోటార్ అండ్ జనరల్ ఫైనాన్స్, రుద్రాభిషేక్ ఎంటర్‌ప్రైజెస్, నెల్కాస్ట్, హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్, ఇంటెన్స్ టెక్నాలజీస్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. వెండ్ట్ (ఇండియా), సోలారా యాక్టివ్ ఫార్మా సైన్సెస్, డ్యామ్ క్యాపిటల్ అడ్వైజర్స్, ముత్తూట్ క్యాపిటల్ సర్వీసెస్, హికాల్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలోకి చేరాయి.మార్కెట్ గురించి సాక్షి వెబ్‌సైట్‌లో నిపుణులు వెల్లడించే అభిప్రాయాలు వారి పరిశీలన, అంచనాలను బట్టి ఉంటాయి. ఇన్వెస్టర్లకు ఇది కేవలం విషయ అవగాహన మాత్ర మే తప్ప.. వారు పెట్టే పెట్టుబడులకు సాక్షి మీడియా గ్రూపు ఎలాంటి హామీ ఇవ్వదు).



# క్రెడిట్ కార్డ్ రివార్డ్స్ ప్రయోజనాలు పొందండిలా..



క్రెడిట్ కార్డ్‌లు శక్తివంతమైన ఆర్థిక సాధనాలు. క్రెడిట్ కార్డులను తెలివిగా ఉపయోగించినప్పుడు గణనీయమైన రివార్డ్స్/సేవింగ్స్‌ను పొందవచ్చు. క్రెడిట్ కార్డులకు సంబంధించిన అత్యంత ఆకర్షణీయమైన లక్షణాలలో రివార్డ్స్ ప్రోగ్రాం ఒకటి. ఇది కార్డుదారులు వారి కొనుగోళ్లపై క్యాష్‌బ్యాక్, పాయింట్లు లేదా డిస్కౌంట్‌లను సంపాదించడానికి అనుమతిస్తుంది. మీ ఖర్చు అలవాట్లను బట్టి సరైన కార్డు ఎంచుకుని రివార్డ్స్‌ను పెంచుకోవడం ద్వారా, పాయింట్లను తెలివిగా రిడీం చేసుకోవచ్చు. క్రెడిట్ కార్డులు క్యాష్‌బ్యాక్, ప్రయాణ ప్రోత్సాహకాలు వంటి ప్రయోజనాలను అందిస్తాయి. భారత్‌లోని కొన్ని క్రెడిట్ కార్డులు ప్రయాణ ప్రోత్సాహకాలు, క్యాష్‌బ్యాక్, ప్రత్యేకమైన డీల్స్ వంటి ప్రయోజనాలతో పాటు 15% వరకు రివార్డ్స్‌ను అందిస్తున్నాయి. క్యాష్‌బ్యాక్, ట్రావెల్ పాయింట్ల నుంచి ప్రత్యేకమైన ప్రోత్సాహకాల వరకు..క్రెడిట్ కార్డులు మీకు డబ్బు ఆదా చేయడంలో, మీ జీవనశైలిని మెరుగుపరచడంలో సహాయపడతాయి. మీ క్రెడిట్ కార్డ్ రివార్డ్‌లను మరింత మెరుగు పరచడానికి, ప్రయోజనాలను పెంచుకోవడానికి ఇక్కడ దశలవారీ గైడ్ ఉంది.

అలవాట్లు

సరైన కార్డ్‌ను ఎంచుకోవడం రివార్డింగ్ క్రెడిట్ కార్డ్ వ్యూహానికి పునాది. క్రెడిట్ కార్డ్‌ను ఎంచుకునే ముందు, మీ ఖర్చు అలవాట్లను విశ్లేషించుకోవాలి. మీరు తరచూ ప్రయాణాలు చేస్తారా, రెస్టరంట్స్‌కు వెళతారా లేదా ఆన్‌లైన్ షాపింగ్ చేయడానికి ఆసక్తి చూపుతారా అనేది గమనించుకోవాలి. వేర్వేరు కార్డులు నిర్దిష్ట కేటగిరీలకు అనుగుణంగా ఉంటాయి. సరైన కార్డును ఎంచుకోవడం వల్ల గణనీయమైన రివార్డు పాయింట్లను పొందొచ్చు. మీరు ఎక్కడ, ఎలా ఖర్చు చేస్తారనే దాన్ని బట్టి దానికి అనుగుణంగా మంచి రివార్డ్ పాయింట్స్ అందించే క్రెడిట్ కార్డును ఎంచుకోవచ్చు. మీ ఖర్చులను విశ్లేషించుకున్న తర్వాత, మెరుగైన రివార్డులను అందించే కార్డ్‌ను ఎంచుకోండి. కొన్ని కార్డులు నిర్దిష్ట వ్యాపారులు, కేటగిరీలకు 10%ఇ% లేదా అంతకంటే ఎక్కువ రివార్డులను అందిస్తాయి. కానీ,కొన్ని మినహాయింపులు లేదా రివార్డ్ క్యాప్‌లను కలిగి ఉండవచ్చు.

# 2035 నాటికి రోడ్లపై డ్రైవర్‌లెస్ కార్లే

## టెస్లా ఏఐ సాఫ్ట్‌వేర్ బాస్




విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా ఏఐ సాఫ్ట్‌వేర్ వైస్ ప్రెసిడెంట్‌గా భారత సంతతికి చెందిన అశోక్ ఎల్లుస్వామి పనిచేస్తున్న విషయం తెలిసిందే.కంపెనీలో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన టెస్లా పనితీరు, ఎలాన్ మస్క్‌తో కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. తాజాగా ఓ యూట్యూబర్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆయన మస్క్‌తో కలిసి పనిచేయడం చాలా సరదాగా ఉంటుందని వ్యాఖ్యానించారు."ప్రస్తుతం కారు నడపాలంటే డ్రైవర్లపై ఆధారపడుతున్నాం. భవిష్యత్తులో టెక్నాలజీనే వాటన్నింటినీ చూసుకుంటుంది. 2035 నాటికి అన్నీ సెల్ఫ్ డ్రైవింగ్ కార్లే తయారవుతాయి. రానున్న దశాబ్దం నాటికి రోడ్లపై అన్నీ ఈతరహా కార్లే చక్కర్లు కొడతాయి. భవిష్యత్తులో ఒకవేళ మీకు కారు నడపడం ఇష్టంగా ఉంటే పాత రకం కారును కొనుగోలు చేయాల్సి ఉంటుంది. డ్రైవర్ లెస్ కార్లదే భవిష్య త్తు" అని అశోక్ ఎల్లుస్వామి తెలిపారు. అమెరికాలోని కొన్ని నగరాల్లో టెస్లా డ్రైవర్-లెస్ కార్లను ప్రారంభించాలని చూస్తున్నామన్నారు. అన్ని కార్లూ ఒకే ఏఐ సాంకేతికతతో పనిచేస్తాయని పేర్కొన్నారు.మస్క్‌తో కలసి పనిచేసిన అనుభవం గురించి ఎల్లుస్వామి మాట్లాడుతూ.. రిస్క్ తీసుకోవడానికి టెస్లా అధినేత ఎప్పుడూ వెనకడుగు వేయరన్నారు.

# ట్రంప్‌తో భేటీ అయిన ముకేశ్ అంబానీ



దోహా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆసియా అపర కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ భేటీ అయ్యారు. అరబ్ దేశాల పర్యటనలో ఉన్న ట్రంప్ ఖతార్ చేరుకున్నారు. అగ్రరాజ్యాధినేత కోసం ఎమిర్ ఆఫ్ ఖతార్ దోహాలో ప్రభుత్వ విందు ఏర్పాటుచేశారు. ఈ విందుకు ముకేశ్ అంబానీ కూడా హాజరయ్యారు. ఈసందర్భంగా ట్రంప్‌తో ఆయన సమావేశమయ్యారు. విందుకు హాజరైన అంబానీని ట్రంప్, ఖతార్ ఎమిర్ సాదరంగా ఆహ్వానించారు. ఇక, రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం ట్రంప్‌ను అంబానీ కలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో 100 మందికి ఇచ్చిన ప్రత్యేక విందులో నీతా-ముకేశ్ అంబానీ పాల్గొన్న సంగతి తెలిసిందే. కాగా.. అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలతో రిలయన్స్ వ్యాపారాలకు కనెక్షన్ ఉంది. గతేడాది వెనెజువెలా నుంచి ముడి చమురు దిగుమతిని పునః ప్రారంభించడానికి అమెరికా నుంచి రిలయన్స్ మినహాయింపులు పొందింది. అయితే వెనెజువెలా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై 25% టారిఫ్‌ను ట్రంప్ విధించడంతో ఆ దిగుమతి ఆగిపోయింది. రష్యా నుంచి ముడిచమురును రిలయన్స్ దిగుమతి చేసుకొని, పెట్రోలు వంటి ఇంధనాలు తయారుచేసి వాటిని అమెరికాకు విక్రయిస్తోంది. గూగుల్, మెటా వంటి అమెరికా దిగ్గజాలకు రిలయన్స్ జియోలో వాటాలున్నాయి. ఖతార్‌తోనూ రిలయన్స్‌కు వ్యాపార సంబంధాలున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్-అంబానీ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విందుకు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా హాజరయ్యారు. అయితే, ఆయన 30 నిమిషాలు ఆలస్యంగా వచ్చినట్లు తెలుస్తోంది. ఇక, న్యూస్‌మ్యాక్స్ వ్యవస్థాపకుడు క్రిస్ రూడీ, బ్లాక్‌స్టోన్ సీఈఓ స్టీఫెన్ తదితర వ్యాపార ప్రముఖులు ఈ విందులో పాల్గొన్నారు.




# బీయూ4 ఆటో ప్రత్యేక షోరూమ్ ప్రారంభం

- హైదరాబాద్‌లో ఎక్స్‌క్లూజివ్ అవుట్‌లెట్
- అందుబాటు ధరలలో ఎలక్ట్రిక్ విద్యుత్ ద్విచక్ర వాహనాలు
- వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి వందకు పైగా స్టోర్లను ప్రారంభించే యోచన



**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** భారతీయ ఎలక్ట్రిక్ వెహికల్ మార్కెట్లో ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న బీయూ4 ఆటో ప్రత్యేక షోరూమ్ను సికింద్రాబాద్‌లోని కారానా ప్రాంతంలో ప్రత్యేక డీలర్‌షిప్, అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. దీనిని ఎంవీ ఆటోమొబైల్స్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. ఇది గుజరాత్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ సంస్థ. ఈ సందర్భంగా బీయూ4 ఆటో ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, చైర్మన్ ఉర్విష్ షా మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి వందకు పైగా స్టోర్లను ప్రారంభించే లక్ష్యంతో ఉన్నామన్నారు. నెలకు ఐదు వేల యూనిట్ల విక్రయ లక్ష్యమన్నారు. దేశంలో ద్విచక్ర వాహనాల మార్కెట్ నెలకు 80 లక్షల యూనిట్లు అన్నారు. అందులో కేవలం 1.3 లక్షల యూనిట్లే ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తుందని చెప్పారు. 2029-30 నాటికి 70 శాతం వరకు పెంచేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ అవుట్‌లెట్ దక్షిణాది విస్తరణలో కీలక మైలురాయి అన్నారు. ఈ ప్రాంతంలో వినియోగదారులకు ఉత్తమమైన ఆఫ్టర్-సేల్ సపోర్ట్ కలదన్నారు. దక్షిణాదిలో మా ఉనికిని మరింతగా విస్తరించనున్నామని చెప్పారు. ఢిల్లీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో మా అవుట్‌లెట్లను త్వరలో ప్రారంభించనున్నామన్నారు. దక్షిణాదిలో బెంగళూరు, కొచ్చి, మైసూరు, మండ్య వంటి నగరాల్లో స్టోర్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నా యన్నారు. మా వాహనాలు పర్యావరణహితంగా ఉంటాయన్నారు. పెట్రోల్ వాహనాలు వాడుతున్న ప్రయాణికులు భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో మా వాహనాల వైపు ఆకర్షితులు అవుతారన్నారు. త్వరలో యూరాన్ మోటర్ బైక్‌ను మార్కెట్‌లోకి తీసుకురానున్నామన్నారు. మా వాహనాలను ఎగుమతి చేయాలన్న ప్రణాళికలు కూడా ఉన్నాయన్నారు. ఈ వాహనాన్ని యాప్ ద్వారా మానిటర్ చేయవచ్చన్నారు. జియో-ఫెన్సింగ్ సౌకర్యం కూడా ఉందన్నారు. ప్రయాణ ఖర్చు కేవలం కిలోమీటరుకు 30 పైసలు మాత్రమేనన్నారు. అదే పెట్రోల్ స్కూటర్‌కు కిలోమీటరుకు సుమారు రూ.2.50 ఖర్చవుతుందన్నారు. సోలార్ పవర్ ఉంటే ఈ వాహనాల ఇంధన ఖర్చు పూర్తిగా ఉచితమేనన్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లు చెల్లుబాటు కేసు

## మే20కి వాయిదా వేసిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై మే 20న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు గురువారం వెల్లడించింది. ఈ కేసులో మధ్యంతర ఉపశమనం అవసరమా కాదా అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎ.జి.మసిహ్‌లతో కూడిన ధర్మాసనం పరిశీలించనుంది. అప్పటివరకు, కేంద్ర ప్రభుత్వం చట్టంలోని నిబంధనలు అమలు చేయదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇచ్చిన హామీ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది. ఈ పిటిషన్‌ల విచారణ నుండి భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తప్పుకున్న సంగతి తెలిసిందే. ఈ నెల 13న తాను పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ అంశంపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయాలనుకోవడం లేదని లేదా రిజర్వ్ చేయాలని కూడా అనుకోవడం లేదని మే 5న విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని సవలు చేస్తున్న పిటిషన్‌లపై తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బి.ఆర్.గవారు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపడుతుందని అన్నారు.

# మరింత దిగొచ్చిన పసిడి..

## ఆల్‌టైమ్ గరిష్ఠాల నుంచి 10% క్షీణించిన తగ్గిన బంగారం ధర..

న్యూఢిల్లీ(జనంసాక్షి):అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతో దేశీయంగా బంగారం ధర దిగొచ్చింది. భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ఇటీవల భారీగా దూసుకెళ్లిన పసిడి ధర..ఇప్పుడిప్పుడే దిగొస్తోంది. అంతర్జాతీయంగా పలు దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు చల్లారుతుండడం ఇందుక్కారణం. తాజాగా దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర మరో రూ.1800 తగ్గుముఖం పట్టి రూ.95,050 (పన్నులు కలుపుకొని) పలుకుతోంది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి రూ.94,600 వద్ద కొనసాగుతోంది. సాయంత్రం 5 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో దీని ధర రూ.95,350 వద్ద కొనసాగుతోంది.మరోవైపు వెండి ధర కూడా తగ్గుముఖం పట్టింది. దేశ రాజధానిలో కేజీ వెండి రూ.97 వేలు పలుకుతోంది. అంతకుముందు



ట్రేడింగ్ సెషన్‌లో రూ.98 వేలుగా ఉన్న వెండి ధర వెయ్యి రూపాయల మేర తగ్గుముఖం పట్టింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్‌గోల్డ్ ఔన్సు 16 డాలర్లు తగ్గుముఖం పట్టి 3160 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. వెండి ఔన్సు 32 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**ఆల్‌టైమ్ నుంచి 10 శాతం డౌన్**

బంగారం ఇప్పటి వరకు ఆల్‌టైమ్ గరిష్ఠాల నుంచి భారీగా క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఏప్రిల్‌లో ఔన్సు 3500 డాలర్ల వరకు వెళ్లింది. తాజాగా పసిడి దాదాపు 10 శాతం క్షీణించి 3150 డాలర్ల స్థాయికి దిగి వచ్చింది. దేశీయంగా లక్ష రూపాయలు మార్కు దాటిన పసిడి.. దాదాపు రూ.7-8 వేల మేర తగ్గుముఖం పట్టింది. భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ఇన్నాళ్లు సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి మదుపర్లు బంగారంలో మదుపు చేయడంతో ఈ లోహానికి డిమాండ్ ఏర్పడింది. టారిఫ్ వార్‌కు దిగిన అమెరికా-చైనా ఓ అవగాహనకు రావడం, భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం, పశ్చిమాసియా పర్యటనలో ఉన్న ట్రంప్.. సిరియాపై ఆంక్షలు సడలిస్తూ ప్రకటన చేయొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఉద్రిక్తతలు చల్లారిన వేళ రిస్క్‌తో కూడిన పెట్టుబడి సాధనాల వైపు మదుపర్లు మొగ్గుచూపడంతో బంగారం ధర దిగి వస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు.

# జేఎన్‌యూ బాటలో.. జామియా మిలియా ఇస్లామియా

**ఢిల్లీ:** పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతిచ్చిన తుర్కియేపై మన దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.ఈ క్రమంలోనే ఆ దేశంలోని ఇనొను యూనివర్సిటీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు దిల్లీలోని ప్రఖ్యాత జేఎన్‌యూ ఇది వరకే ప్రకటించగా.. తాజాగా జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ కూడా అదే బాటలో పయనించింది. తుర్కియేలోని వివిధ విద్యా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను నిలిపివేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు జేఎంఐ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ సైమా సయీద్ జాతీయ మీడియాకు వెల్లడించారు.తమ దేశంలో భూకంపం సంభవించినపుడు భారత్ చేసిన మేలును మర్చిపోయిన తుర్కియే.. పాకిస్థాన్‌కు మద్దతివ్వడంపై దేశవ్యాప్తంగా ఆగ్రహం పెల్లుబికిన నేపథ్యంలో మన ట్రావెల్ ఏజెన్సీలు వెంటనే ఆ దేశానికి ఆన్‌లైన్ బుకింగ్‌లను నిలిపివేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్న కొన్ని రకాల పండ్లు, ఇతర పరికరాలను కూడా నిలిపివేశాయి. ఈ తరుణంలో స్పందించిన జేఎన్‌యూ ఇరుదేశాల యూనివర్సిటీల మధ్య ఇటీవల మూడేళ్లకుగానూ కుదిరిన విద్యాపరమైన ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది.ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియే సైనిక విమానాలను, యుద్ధనౌకను పాకిస్థాన్‌కు పంపించింది. అంతేకాకుండా పెద్ద మొత్తంలో డ్రోన్‌లను కూడా సాయం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే పాకిస్థాన్ మనపైకి ప్రయోగించినట్లు కొన్ని ఆధారాలు కూడా లభ్యమయ్యాయి.

# మోడీని అనుసరించిన పాక్ ప్రధాని

## లాగే ఎయిర్ బేస్‌కు వెళ్లిన షహబాజ్ షరీఫ్




భారత ప్రధాని నరేంద్రమోదీ పాకిస్తాన్ సరిహద్దులోని అదంపూర్ ఎయిర్ బేస్ కు వెళ్లారు. అక్కడి నుంచి పాకిస్తాన్ కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూసి.. పాకిస్తాన్ ప్రధాని కూడా అలాగే వెళ్లాలనుకున్నాడు. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ తో కలిసి వెళ్లారు. ఆ వీడియోను పాకిస్తాన్ ప్రభుతవం రిలీజ్ చేశారు. కానీ ఆ వీడియోను చూసిన వారు పాకిస్తాన్ దుస్థితి ఇంత ఘోరంగా ఉందని చూసుకుని నవ్వుకుంటున్నారు. పాకిస్తాన్ ప్రధాని వెళ్లిన ప్రాంతం ఎయిర్ బేసో.. ఆర్మీబేసో తెలియదు. ఏదో అడవుల్లో దాక్కున్న వాళ్లను కలవడానికి వెళ్లినట్లుగా వెళ్లారు. ఆ బేస్ లో ఒక్క కట్టడం లేదు. గోనెపట్టాలు కట్టుకుని దాని కింద సైనికులు సేదదీరుతున్నారు.అక్కడికి వెళ్లడానికి పాక్ ప్రధాని గతుకుల రోడ్డులో కిందా మీదా పడుతూ వెళ్లారు. పోని అక్కడ ప్రధాని సైనికులతో మాట్లాడటానికి ఓ వేదిక ఉందా అంటే అదీ లేదు. గడ్డితో కప్పేసిన యుద్ధట్యాంకు మీద నిల్చుని మాట్లాడారు. అంతకు మించి ఆ సైనికుల దగ్గర కూడా ఎలాంటి ఆయుధాలు కనిపించలేదు. భారత ప్రధాని అదంపూర్ కు ఎయిర్ ఫోర్స్ విమానంలో వెళ్లారు. అత్యాధునిక ఆయుధాలను చూపించారు. పాకిస్తాన్ ధ్వంసం చేశామని చెప్పుకున్న వాటిని చూపించారు. కానీ పాక్ ప్రధాని తమ దగ్గర రైఫిల్స్ ఉన్నాయని కూడా చూపించుకోలేకపోయారు.పాక్ ప్రభుత్వం విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది. పాక్ పరిస్థితిఘోరంగా ఉందని ఇప్పుడు సాక్ష్యాలతో సహా అర్థమయిందని సెటైర్లు వేస్తున్నారు



# 'తీస్తా ప్రహార్'

## ఇండియన్ ఆర్మీ భారీ సైనిక విన్యాసాలు

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఇండియన్ ఆర్మీ సర్వసన్నద్ధమవుతోంది. ఓ వైపు దౌత్య మార్గాల్లో దాయాదికి ఉచ్చు బిగిస్తున్న భారత్..ఎలాంటి పరిస్థితులు ఎదురైనా దీటుగా బదులిచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే పశ్చిమబెంగాల్‌లోని తీస్తా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ' తీస్తా ప్రహార్' పేరుతో భారీ ఎత్తున సైనిక విన్యాసాలు చేపట్టింది. నదీ తీర ప్రాంతంలో యుద్ధం సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలి? శత్రువు వ్యూహాలను ఎలా తుత్తునియలు చేయాలన్న దానిపై కసరత్తు చేసింది. ఆయుధ సరఫరా, సైనికుల మధ్య సమన్వయం తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరీక్షించింది. ఈ మేరకు రక్షణ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.ఇటీవల భారత సైన్యంలోకి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ, ఆయుధాలు వచ్చి చేరాయి. ఈ క్రమంలో వాటిని వినియోగించడం, సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలపై ఈ విన్యాసాల్లో ప్రధానంగా దృష్టిసారించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా వ్యవహరించాలన్నదానిపై ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా వ్యవహరించాలన్నదానిపై సైన్యం కసరత్తు చేసింది. ప్రతికూల పరిస్థితుల్లో వేగంగా, సమర్థంగా లక్ష్యాలను ఛేదించడంపై రిహార్సల్స్ చేశారు. శత్రువుల నుంచి పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టి అప్పటికప్పుడు ఎలా వ్యవహరించాలన్న దానిపై సైనిక విన్యాసాలు నిర్వహించారు. ఈ మేరకు ఇండియన్ ఆర్మీ ఓ వీడియోను విడుదల చేసింది.



# 'అమ్మ' చెప్పినా వినలేదు..

## ఆర్మీ చేతిలో హతమయ్యాడు

ఎంతటి దుర్మార్గుడైనా అమ్మ దృష్టిలో మంచివాడే. కొడుకును సన్మార్గంలో నడిపించడానికి నిరంతరం ఆమె తాపత్రయపడుతూనే ఉంటుంది. కానీ, ఆమె మాటల్ని పెడచెవిన పెట్టిన ఓ ఉగ్రవాది సైన్యం చేతిలో హతమయ్యాడు.గురువారం ఉదయం జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా త్రాల్ ప్రాంతంలోని నాదిర్ గ్రామంలో జరిగిన ఎదురుకాల్పుల్లో జేషే మహ్మద్ ముఠాకు చెందిన ఆమిర్ నజీర్ వని హతమైన సంగతి తెలిసిందే. అక్కడికి కొద్దిసేపటికి ముందే.. అతడు తల్లి, సోదరితో వీడియో కాల్‌లో మాట్లాడాడు. ఆర్మీ ఎదుట లొంగిపోవాలని వారిద్దరూ ఎంత చెప్పినా.. వినలేదు సరికదా.. 'ఆర్మీని ముందుకు రానివ్వండి.. వారి సంగతి చూస్తా' అని పొగరుగా సమాధానమిచ్చాడు. వాళ్లు ఎంత ప్రాధేయపడినా పొమ్మన్నాడు. ఇదే ఘటనలో మృతి చెందిన మరో ఉగ్రవాది ఆసిఫ్ అహ్మద్ షేక్ సోదరితోనూ నజీర్ మాట్లాడాడు. తన సోదరుడి గురించి ఆమె ఆరా తీస్తే తన దగ్గరే ఉన్నాడని బదులిచ్చాడు. అక్కడికి కొద్దిసేపటి తర్వాతే ఎన్‌కౌంటర్ జరిగింది. ప్రస్తుతం ఆ వీడియో కాల్ ఫుటేజీ వైరల్ అవుతోంది.జమ్మూకశ్మీర్‌లోని నాదిర్ గ్రామంలోని ఓ ఇంట్లో ముగ్గురు ఉగ్రవాదులు దాక్కున్నట్లు కనిపెట్టిన సైన్యం వారిని చుట్టుముట్టింది. లొంగిపోవాలని హెచ్చరించింది. దీంతో ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఎదురుకాల్పులు జరిపిన భద్రతబలగాలు ఆ ముగ్గుర్నీ మట్టుబెట్టాయి. హతులను ఆసిఫ్ అహ్మద్ షేక్, ఆమిర్ నజీర్ వని, యావర్ అహ్మద్ భట్‌గా గుర్తించారు. పహల్గాం ఉగ్రదాడిలో వీరి హస్తం ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తుస్తున్నారు.కాగా.. జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ జరగడం 48 గంటల్లో ఇది రెండోసారి. మంగళవారం షోపియాన్ ప్రాంతంలోని జిన్‌పాథర్ కెల్లర్‌లో చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వీరిని లష్కరే తయ్యిబాకు చెందిన ముఠా సభ్యులుగా గుర్తించారు.

# సీఎం కార్యక్రమంలో అపశృతి



## దళిత ఎంపీ అంటే చిన్నచూపా? అంటూ ఎంపీ వర్గీయుల నిరసన

కాళేశ్వరం, మే 15 (జనంసాక్షి)

భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు స్థానిక ఎంపీని ఆహ్వానించకపోవడం పట్ల ఎంపీ గడ్డం వంశీకృష్ణ వర్గీయులు సీఎం కార్యక్రమంలో నిరసన వ్యక్తం చేశారు. సరస్వతి పుష్కర ఘాట్ లో వేదికపై సీఎం, మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సరస్వతి మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తుండగా ఒక్కసారిగా ఎంపీ వర్గీయులు వేదికకు ఎదురుగా మెట్లపై ఉన్న స్టేజ్ పైకి ఎక్కి దళిత ఎంపీ అంటే చిన్నచూపా?

దేవాదాయ శాఖ అధికారులకు ప్రజలు ఎన్నుకున్న దళిత ఎంపీ కనిపించడం లేదా? అంటూ ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. దీంతో పోలీసు అధికారులు ఒక్కసారిగా కంగు తిన్నారు. వెంటనే పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# ప్రభుత్వ పాఠశాల భవనానికి నిధులు కేటాయిస్తా

**రాష్ట్ర అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ**

**ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన**

వరంగల్ ప్రతినిధి, మే15 (జనంసాక్షి) :

వరంగల్ పట్టణంలోని కృష్ణ కాలనీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి జిల్లా కలెక్టర్ డా.సత్య శారదలతో కలసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సుమారు ఏడు దశాబ్దాల క్రితం బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ మహిళా కళాశాలగా మంచి గుర్తింపు ఉన్న కృష్ణ కాలేజీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ ముందుకు వచ్చి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద సుమారు 5 కోట్ల రూపాయలతో మూడు అంతస్తుల్లో 15 తరగతి గతులతో పాటు 60 టాయిలెట్లను నిర్మిస్తున్నందుకు వారిని మంత్రి అభినందించారు. దీనితో పాటు ప్రభుత్వ పాఠశాలను సుమారు కోటిన్నర రూపాయల వ్యయంతో సీఎస్ఆర్ క్రింద ప్రభుత్వ పాఠశాల నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల భవనానికి అవసరమగు మరమ్మత్తుల కొరకు తన నిధులు కేటాయిస్తానని, అందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను సూచించారు.



బల్దియా ఆధ్వర్యంలో శాశ్వతంగా డ్రైన్ నిర్మాణం చేపడతామని నగర మేయర్ ప్రకటించడం పట్ల మంత్రి అభినందించారు. భవిష్యత్తులో కృష్ణా కళాశాల వరద నీటి ముంపుకు గురికాకుండా శాశ్వత చర్యల్లో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో రైల్వే ట్రాక్ క్రింద నుండి డ్రైన్ నిర్మాణానికి డి పి ఆర్ సిద్ధం చేయాలని, రైల్వే అధికారులతో సంప్రది ంచి పరిష్కారం చేస్తామని మంత్రి తెలిపారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ... కృష్ణా కాలనీ కళాశాల పునర్ వైభవానికి కృషి చేస్తున్న మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపా రు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మంత్రి కొండ సురేఖ ప్రత్యేక చొరవ చూపి అరవిందో ఫార్మా వారితో పలుమార్లు సంప్రదించడం వల్ల ఈరోజు సిఎస్ఆర్ కింద ఐదు కోట్ల రూపాయల తో కళాశాల భవనం నిర్మిం చడం సాధ్యమైందని అన్నా రు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగ కుండా షిఫ్టులవారీగా తరగతుల నిర్వహణకు ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకోనున్నట్లు తెలిపారు. కళాశాల భవన నిర్మా ణాన్ని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అరబిందో ఫార్మా ప్రతినిధులను కలెక్టర్ కోరారు. అనంతరం పదవ తరగతిలో రాష్ట్రంలో ద్వితీయ ర్యాంక్ సాధించిన విద్యార్థిని మంత్రి, మేయర్, కలెక్టర్లు సన్మానించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ లు చింతాకుల అనిల్ కుమార్ కావేటి కవిత బస్వరాజు కుమార స్వామి సురేష్ జోషి, అరబిందో ఫార్మా డైరెక్టర్ సదానంద రెడ్డి, జిల్లావిద్యాధికారి జ్ఞానేశ్వర్, జిల్లా ఇంటర్మీ డియట్ అధికారి శ్రీధర్ సుమన్, కళాశాల ప్రిన్సిపల్ శరదృతి, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యంను త్వరితగతిన తూకం వేసి మిల్లులకు తరలించాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 15 (జనం సాక్షి) :



వరి ధాన్యం పంటను త్వరితగతిన తూకం వేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం సదాశివ నగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి పాక్స్ ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి ధాన్యం సేకరణ త్వరగా చేపట్టాలని అన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టాలని తెలిపారు. అకాల వర్షాల వలన ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు టార్పాలిన్ లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఆరబెట్టిన ధాన్యం ను త్వరగా తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ సదాశివ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ బ్యూరో, మే15 (జనంసాక్షి)

రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అటవీశాఖతో ఉన్న భూ వివాదాలపై రెవెన్యూ, అటవీశాఖల అధికారులు కలిసి సర్వే చేసి సమస్యలను పరిష్కరించా లన్నారు. ప్రతి మండలానికి



సంబంధించిన భూముల వివరాలతో సమగ్ర ప్రొఫైల్ తయారు చేయాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కుంటాల మండలంలో ప్రస్తుతం ఉన్న భూ సమస్యల పరిష్కార దశలను కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల పెంపు ప్రతిపాదనలు విరమించుకోవాలి

**భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్**

హైదరాబాద్ (జనంసాక్షి)

: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు పెద్ద మొత్తంలో ఫీజులు పెంచుకునేందుకు తెలంగాణ అడ్మిషన్, ఫీ రెగ్యులేషన్ కమిటీ (టిఎఎఫ్ఆర్సి)కి పంపిన ప్రతిపాదనలు ఆధారంగా ఫీజులు పెంచే ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) డిమాండ్ చేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు విద్యా వ్యాపారమే ప్రధాన లక్ష్యంగా నడుస్తున్నవి. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రతి ఏటా లక్షల్లో ఫీజులు పెంచుతూ పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులపై లక్షలాది రూపాయల ఫీజుల భారం మోపుతున్న పరిస్థితి ఉంది. ప్రతి ఏటా కళాశాల యాజమాన్యాలు తప్పుడు ఆడిట్ నివేదికలు మరియు ఆదాయ, వ్యయాలు సృష్టించి ప్రభుత్వాన్ని మరియు టిఎఎఫ్ఆర్సిని మోసం చేస్తున్నవి. తద్వారా ఇష్టానురీతిన పేరుమోపిన ఇంజనీరింగ్ కళాశాలలు అన్నీ కూడా ప్రతి ఏటా ఖర్చులు పెరిగాయన్న సాకుతో ఫీజులు పెంచుకొని వందల కోట్ల రూపాయల విద్యా వ్యాపారానికి పాల్పడుతున్నవి. అట్టి కళాశాలను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నాము. ఇటీవల కాలంలో ఉన్నత విద్యామండలి ఇంజనీరింగ్ కళాశాలలపై చేపట్టిన తనిఖీల రిపోర్టు బయట పెట్టాలి. ఆ రిపోర్ట్ ఆధారంగా ఫీజులను నిర్ణయించే అధికారం ప్రభుత్వమే తీసుకోవాలి. అది కూడా విద్యార్థులకు భారం కాకూడదు. ఫీజులు పెంచుకునే అవకాశం యాజమాన్యాలకు ఉండకూడదు. యాజమాన్యాలు కోరిన విధంగా ఫీజులు పెంచడం మూలంగా అటు ప్రభుత్వానికి, ఇటు విద్యార్థులకు తీవ్ర భారం ఇప్పటికే పెరిగిన ఫీజులు చెల్లించలేక, యాజమాన్యాల వేధింపులు తట్టుకోలేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక సందర్భాల్లో సర్టిఫికెట్లు ఇచ్చే సమయంలోను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు అనుకూలంగా లక్షల రూపాయల్లో ఫీజులు పెంచుకునే అవకాశం ఇవ్వడం వందల కోట్ల విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహించినట్లే అవుతుంది. కనుక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి. విద్యార్థులపై ఫీజుల భారం మోపకుండా చర్యలు చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) డిమాండ్ చేస్తుంది.

# చైన్ స్నాచింగ్ మహారాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ఆర్మూర్, మే 15 ( జనం సాక్షి):



**12 .2 తులాల బంగారం, రెండు బైకులు, ట్రాక్టర్ స్వాదీనం**

**వివరాలను వెల్లడించిన జిల్లా సిపి పి.సాయి చైతన్య.**

ఒంటరిగా, వాహనాలపై వెళ్తున్న మహిళలను టార్గెట్ చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడిన ఏడుగురి మహారాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య తెలిపారు. ఆర్మూర్ పట్టణంలో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర రెడ్డి, ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నిందితులైన శ్రీనివాస్ సాహెబ్ రావ్ పిటెవాడు, గోరె కేశవ్ సురేష్, పూర్ బాజీ బాలాజీ ఇర్లేవాడు, ఎలిశెట్టి శ్రీనివాస్, రాజు అప్పారావు, విజయ్, దడేవాండ్ బాబు మహారాష్ట్రకు చెందినవారు. బ్రతుకు దేరువు నిమిత్తం నిర్మల్ జిల్లాలోని మంజులాపూర్ గ్రామంలో వలస వచ్చి కూలి పని చేస్తూ జీవిస్తున్నారు. కుటుంబ పోషణకు డబ్బులు లేక దొంగతనాలకు అలవాటుపడ్డారు. ఆటోలో వెనకాల కూర్చున్న మహిళలను టార్గెట్ చేసుకుని మహిళల మెడలోని బంగారు చైనులను దొంగిలించారు. ఆర్మూర్, ముప్కాల్, సారంగాపూర్, బైంసా, మెట్పల్లి, జక్రన్ పల్లి ఎనిమిది 12.2 తులాల విలువగల బంగారు చైనులను, రెండు బైకులు, ఒక ట్రాక్టర్ ను పట్టుకున్నారు. వరుస దొంగతనాలతో నిఘా ఎక్కువై ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి మహారాష్ట్రకు పారిపోయారు. ఈ క్రమంలో గురువారం రెండు బైకులను చోరీ చేసేందుకు రెక్కీ నిర్వహించగా ఆర్మూర్ లోని పెర్కిట్ బైపాస్ వద్ద వాహనాల తనిఖీలో దొంగలు పట్టుబడ్డారు. విజయ్, దండేవాడు బాబు ఇద్దరు పరారీలో ఉన్నారు. ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, రజినీకాంత్, ఎస్ఐలు టీములుగా ఏర్పడి నేరస్థులను పట్టుకోవడంలో కృషి చేసినట్లు చెప్పారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బందిని, నిజామాబాద్ సి డి అర్ సెల్ సిబ్బందిని సిపి రివార్డులతో అభినందించారు.

# సీఎం రాక సందర్భంగా ముందస్తు అరెస్టులు

కాళేశ్వరం, మే 15 (జనంసాక్షి)

భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం లోని కాళేశ్వరం కు పుష్కరాల్లో బాగా సీఎం రావడం తో ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టు చేయడం జరిగింది. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జయశం కర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని గత కొన్ని సంవత్సరాలుగా అనేకమైన పోరాటాలు ఉద్యమాలు, కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుష్కరాల్లో భాగం గా సీఎం కాళేశ్వరం రావడంతో ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యారంగానికి అధిక శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసింది అని ఆయన అన్నారు. తక్షణమే రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను పోరాటాలను ఆపలేరని ఆయన అన్నారు

## సిరికొండ పీహెచ్‌సీలో విధులకు గైర్హాజరు

**విచారణకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం**

హైదరాబాద్, మే 15 (జనంసాక్షి)

: నిజామాబాద్ జిల్లా సిరికొండ పీహెచ్‌సీలో సిబ్బంది విధులకు గైర్హాజరు అవుతున్నట్టు వస్తున్న ఆరోపణలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారణకు ఆదేశించారు. సిరికొండ పీహెచ్‌సీలో సిబ్బంది గైర్హాజరు, ఇతర ఆరోపణలపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారితో విచారణ చేయించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిరికొండ పీహెచ్‌సీలో జరుగుతున్న వ్యవహారం గురించి డీఎంహెచ్‌వోకు కనీస సమాచారం లేకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఆఫీసులకే పరిమితమైతే, క్షేత్రస్థాయిలో జరిగే విషయాలు ఎలా తెలుస్తాయని డీహెచ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులంతా క్షేత్రస్థాయి పర్యటన చేయాలని ఆదేశించారు. విధులకు దుమ్మా కొడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఇలాంటి వారికి చెక్ పెట్టేందుకు, హాజరు విధానంలో మార్పులు తీసుకొస్తున్నామని మంత్రి గుర్తు చేశారు.

# బుల్కాపూర్ నాలాకు "హైడ్రా" గేట్లు

## గండిపేటకు తప్పిన మురుగు ముప్పు

హైదరాబాద్, మే 15 (జనంసాక్షి)



జంటనగరాలకు తాగు నీరు అందించే గండిపేట(ఉస్మాన్‌సాగర్)కు మురుగు ముప్పు తప్పింది. ఖానాపూర్, నాగులపల్లి నుంచి వచ్చిన మురుగు నీరు బుల్కాపూర్ నాలా ద్వారా గండిపేటలోకి వెళ్లకుండా హైడ్రా చర్యలు తీసుకుంది. రూ. 2 లక్షలు వెచ్చించి బుల్కాపూర్ నాలాకు కొత్త షట్టర్లను ఏర్పాటు చేసింది. వరద వచ్చేటప్పుడు గండిపేటకు చేరేలా కాలువకు ఉన్న షట్టర్లు (గేట్లు) శిథిలమైన విషయం విధితమే. మురుగు నీరు గండిపేటలో కలుస్తున్నదని మీడియాలో వచ్చిన కథనాలపై హైడ్రా స్పందించింది. అధికారుల బృందంతో కలసి హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెంటనే షట్టర్ల మరమ్మతులను చేపట్టాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. శిథిలమైన షట్టర్ల స్థానంలో కొత్తవి అమర్చడంతో మురుగు నీరు గండిపేట చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే బుల్కాపూర్ నాలాలో పూడికపోయిన చెత్తను కూడా కొంతమేర తొలగించి మురుగు నీరు ముందుకు సాగేలా ఏర్పాట్లు చేశారు. ఒకప్పుడు వరద కాలువగా ఉన్న బుల్కాపూర్ నాలాలో పైన ఉన్న నివాసాలు, వాణిజ్య సముదాయాలు , రిసార్టుల నుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. శంకరపల్లి లోని బుల్కాపూర్ చెరువు నుంచి ఖానాపూర్, కోకాపేట, నార్సింగ్, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, షేకేపేట్, టోలి చౌకి , పోచమ్మ బస్తీ, చింతలబస్తీ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వర్షపు నీరును తీసుకెళ్లే చరిత్ర ఈ నాలాది. బుల్కాపూర్ నాలాను పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తే చాలా ప్రయోజనాలుంటాయని.. హుస్సేన్ సాగర్‌కు వర్షపు నీటిని తీసుకువచ్చే ఏకైక నాలాగా దీనికి ప్రత్యేక స్థానం ఉందని స్థానికులు గుర్తు చేశారు. ఇప్పుడీ నాలా పునరుద్ధరణపై హైడ్రా దృష్టి పెట్టింది.

# బ్లాక్ స్పాట్లను గుర్తించి సూచిక బోర్డులు పెట్టాలి

మంచిర్యాల ప్రతినిధి, మే 15 (జనంసాక్షి) :



**రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత : కలెక్టర్ కుమార్ దీపక్**

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని కలెక్టర్ సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణలతో కలిసి పోలీసు, రవాణా, రోడ్లు-భవనాలు, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రహదారులపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్) లను గుర్తించి వాహనదా రులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలోని బోయపల్లి రోడ్ నుండి తాండూర్ వరకు, బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నుండి హనుమాన్ విగ్రహం వరకు, నస్పూర్‌లోని కృష్ణకాలనీ నుండి దొరగారివల్ల వరకు సర్వీస్ రోడ్లు నిర్మించాలని, లక్షెట్టిపేటలోని ఆంధ్రబోర్ నుండి ఉత్కూర్ చౌరస్తా వరకు, కోటపల్లి మండలంలో, జన్నారం మండలంలో చింతగూడ, పొనకల్, బస్టాండ్ ప్రాంతాలలో, ఇందారం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి ప్రమాదాల నివారణలో భాగంగా లైటింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని ఐ.బి. చౌరస్తా నుండి మేదరివాడ, టి.టి.డి. కళ్యాణమండపం, రైల్వేస్టేషన్, లక్ష్మిటాకీస్ చౌరస్తా లలో సిగ్నల్స్, రేడియమ్స్ ఏర్పాటు చేయాలని, వారానికి ఒకరోజు వాహనాల విస్తృత తనిఖీలు చేపట్టాలని, జిల్లాలోని ప్రతి వైన్స్, బార్-రెస్టారెంట్ల వద్ద పార్కింగ్ స్థలము ఉండేలా చర్యలు తీసుకోవాలని, మార్కెట్ ఏరియాలో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని తెలిపారు.



## విరాట్ కోహ్లి ఆటను రోజూ చూడాలని ఉంది: మైకేల్ అథర్టన్

ఇంగ్లండ్ టూర్ ముందు రోహిత్ శర్మ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన వారంలోనే విరాట్ కోహ్లి కూడా టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ సందర్భంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ అథర్టన్ కోహ్లి ఆటతీరును ప్రశంసించాడు. "కోహ్లి ఆటను చూస్తుంటే కళ్ళు తిప్పుకోలేం. అతడు ఆడిన 123 టెస్టులను రోజూ చూడాలని ఉంది. కోహ్లి టెస్టు క్రికెట్‌పై పూర్తి హృదయాన్ని పెట్టాడు. అతడి శక్తి, క్రికెట్ పట్ల ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు" అని అథర్టన్ అన్నాడు. అలాగే, కోహ్లి ఆడిన నాలుగో స్థానం గురించి మాట్లాడుతూ, "వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ కొత్త సైకిల్ మొదలవబోతోంది. భారత్ జట్టును పునర్నిర్మించే సమయం ఇది. కోహ్లి ఇప్పటివరకు 4వ స్థానంలో ఆడాడు. ఇప్పుడు ఆ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారో తెలియదు. అంతకుముందు ఆ స్థానంలో సచిన్ ఆడేవాడు" అని అథర్టన్ వ్యాఖ్యానించాడు.

## ఐసీసీ డబ్ల్యూటీసీ ప్రైజ్‌మనీని భారీగా పెంచింది

టెస్టు క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ఐసీసీ ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. 2023-25 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ప్రైజ్‌మనీని రూ.49.27 కోట్లు (5.76 మిలియన్ డాలర్లు)గా నిర్ణయించింది, గత రెండు ఎడిషన్‌లలో ఇది కేవలం 3.8 మిలియన్ డాలర్లు మాత్రమే. ఈ మొత్తాన్ని పాల్గొన్న తొమ్మిది జట్లకు పంపిణీ చేయనున్నారు. ఈ ఎడిషన్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జూన్ 11న లార్డ్స్‌లో తలపడనున్నాయి. విజేత జట్టుకు రూ. 30.78 కోట్లు, రన్నరప్‌కు రూ.18.46 కోట్లు దక్కనున్నాయి. పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచిన టీమ్ ఇండియాకు రూ.12.31 కోట్లు, నాలుగో స్థానంలో ఉన్న న్యూజిలాండ్‌కు రూ.10.26 కోట్లు, ఐదో స్థానంలో ఇంగ్లాండ్‌కు రూ.8.2 కోట్లు, ఆరో స్థానంలో శ్రీలంకకు రూ.7.18 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ. 6.15 కోట్లు, వెస్టిండీస్‌కు రూ.5.13 కోట్లు, పాకిస్థాన్‌కు రూ.4.10 కోట్లు అందనున్నాయి. ఐపీఎల్ 2025 సీజన్ జూన్ 3న ముగియనుంది. ఆ తర్వాత టీమ్ ఇండియా ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది, ఇది 2025-27 డబ్ల్యూటీసీకి ఆరంభం కానుంది. భారత జట్టు ప్రకటన త్వరలో ఉండే అవకాశం ఉంది.

## ప్లేఆఫ్స్‌పై ఆర్సీబీ గురి

ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. టోర్నమెంట్ వారం రోజుల వాయిదా సమయంలో స్వదేశాలకు వెళ్లిన విదేశీ ఆటగాళ్లు తిరిగి జట్టుతో చేరారు. ఫిలిప్ సాల్ట్, టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, లియామ్ లివింగ్‌స్టోన్, ఇంగ్లండ్ యువ ఆటగాడు బెథెల్ గురువారం బెంగళూరు చేరుకున్నారు. దీంతో ఆర్సీబీ రెట్టించిన ఉత్సాహంతో ప్లేఆఫ్స్‌పై దృష్టి సారించింది. మే 17న చిన్నస్వామి స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆర్సీబీ తలపడనుంది. ఈ సీజన్‌లో 8 విజయాలతో ప్లేఆఫ్స్‌కు చేరువలో ఉన్న ఆర్సీబీ, ఈ మ్యాచ్‌లో గెలిస్తే 18 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకుంటుంది. విరాట్ కోహ్లి, రజత్ పాటిదార్, సాల్ట్, టిమ్ డేవిడ్‌లు ఫామ్‌లో ఉండటంతో ఆర్సీబీ 17 ఏళ్ల తొలి ఐపీఎల్ టైటిల్ కలను సాకారం చేసుకునేందుకు సిద్ధంగా ఉంది.
అయితే, జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా టోర్నమెంట్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ బౌలింగ్ బాధ్యతలను మోయనున్నారు. ఆర్సీబీ ముందు మూడు కీలక లీగ్ మ్యాచ్‌లు ఉన్నాయి: మే 17న కోల్‌కతాతో, మే 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో, మే 27న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో. ఈ మ్యాచ్‌లలో విజయాలు సాధిస్తే ఆర్సీబీ టైటిల్ రేసులో ముందంజలో ఉంటుంది.




# ఐపీఎల్ జట్లకు ఊరట

## దక్షిణాఫ్రికా డబ్ల్యూటీసీ ఫైనల్ షెడ్యూల్ మార్పు

- ఐపీఎల్ పునఃప్రారంభంతో అభిమానుల్లో జోష్
- విదేశీ ఆటగాళ్ల రాకతో ఆర్సీబీకి ఉత్సాహం
- కోల్‌కతాతో కీలక పోరు, హేజిల్‌వుడ్ గైర్హాజరీ

భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ వారం రోజుల పాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. మ్యాచ్‌లు మే 17 నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ఐపీఎల్ ఫ్రాంచైజీలకు శుభవార్త అందించింది. మొదట, జూన్‌లో ఆస్ట్రేలియాతో జరిగే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ కారణంగా తమ ఆటగాళ్లు మే 26 వరకు మాత్రమే ఐపీఎల్‌కు అందుబాటులో ఉంటారని సీఎస్ఏ ప్రకటించింది. అయితే, తాజాగా ఈ నిర్ణయాన్ని మార్చుకుని, దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ఐపీఎల్ మొత్తం సీజన్‌కు అందుబాటులో ఉంటారని తెలిపింది.
డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం సన్నాహక సమయాన్ని తగ్గించుకున్న సీఎస్ఏ , జూన్ 3న జింబాబ్వేతో షెడ్యూల్ చేసిన వార్మప్ మ్యాచ్‌ను రద్దు చేసే అవకాశం ఉందని సమాచారం. "మా షెడ్యూల్‌లో స్వల్ప మార్పు జరిగింది. జూన్ 3 నుంచి డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం సన్నాహాలు ప్రారంభిస్తాం," అని సీఎస్ఏ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఎనోచ్ న్క్వె మీడియాతో తెలిపారు. దీంతో కగిసో రబాడ (గుజరాత్ టైటాన్స్), లుంగి ఎంగిడి (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు), ట్రిస్టన్ స్టబ్స్ (ఢిల్లీ క్యాపిటల్స్), ఐదెన్ మార్క్రమ్ (లఖ్‌నవూ సూపర్ జెయింట్స్), ర్యాన్ రికెల్టన్, కార్బిన్ బాష్ (ముంబయి ఇండియన్స్), మార్కో జాన్సెన్ (పంజాబ్ కింగ్స్), వియాన్ ముల్డర్ (సన్‌రైజర్స్ హైదరాబాద్) వంటి ఆటగాళ్లు ఐపీఎల్ సీజన్ పూర్తయ్యే వరకు తమ జట్లతో ఉంటారు.


*ప్లే ఆఫ్స్ బరిలో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు బౌలింగ్ కష్టాలు తప్పేలా లేవు. ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్ లీగ్ మ్యాచ్‌లకు దూరం అయ్యే అవకాశముంది. అయినా సరే ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఉన్నాడనే భరోసాతో ఉన్న ఢిల్లీకి పెద్ద షాక్. ఈ స్పీడ్‌స్టర్ భారత్‌కు రావడం మరింత ఆలస్యం కానుంది. అతడికి బంగ్లాదేశ్ క్రికెట్ దేశ బోర్డు ఇంకా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇంకా ఇవ్వలేదు.*

## జోష్ హేజిల్‌వుడ్ తిరిగి రానున్నాడు!

భారత్-పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ వారం రోజులు వాయిదా పడినప్పటికీ, కాల్పుల విరమణ ఒప్పందంతో పరిస్థితులు సద్దుమణగడంతో మే 17 నుంచి మ్యాచ్‌లు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)కి సంతోషకరమైన వార్త అందింది. ఐపీఎల్ వాయిదా సమయంలో స్వదేశానికి వెళ్లిన ఆస్ట్రేలియా స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ తిరిగి భారత్‌కు రానున్నట్లు సమాచారం. హేజిల్‌వుడ్ ఖచ్చితమైన రాక తేదీ తెలియనప్పటికీ, త్వరలోనే జట్టుతో చేరనున్నాడు. గత మ్యాచ్‌లో భుజం గాయం కారణంగా అతడు ఆడలేదు, అలాగే డబ్ల్యూటీసీ ఫైనల్ నేపథ్యంలో అతడు ఐపీఎల్‌కు దూరమవుతాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, తాజా సమాచారంతో ఆ అనుమానాలు తొలగిపోయాయి. ఈ సీజన్‌లో హేజిల్‌వుడ్ 10 మ్యాచ్‌లలో 18 వికెట్లు తీసి ఆర్సీబీని ప్లేఆఫ్స్‌కు చేరువ చేశాడు. అతడి రాక జట్టు బౌలింగ్ బలాన్ని మరింత పెంచనుంది. అదే విధంగా, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్, వికెట్ కీపర్ జోష్ ఇంగ్లిస్, పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లు మార్క్ జాన్సెన్, జేవియర్ బ్రెట్‌లెట్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మిచెల్ ఓవెన్ కూడా మే 24న జైపూర్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్ కోసం జట్టుతో చేరనున్నారు.

## నంబర్ 1 ఆల్‌రౌండర్‌గా జడేజా

# ఆల్‌టైమ్ రికార్డు!



భారత సీనియర్ క్రికెటర్ రవీంద్ర జడేజా టెస్టు క్రికెట్‌లో అసాధారణ రికార్డు సృష్టించాడు. అత్యధిక రోజు లు నంబర్ 1 టెస్టు ఆల్‌రౌండర్‌గా కొనసాగిన ఆటగాడిగా జడ్డూ చరిత్ర లో నిలిచాడు. మూడేళ్ల క్రితం అగ్రస్థానాన్ని అందుకున్న జడేజా, మే 14, 2025 నాటికి 1,151 రోజులు ఈ స్థానంలో కొనసాగాడు. 144 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో ఇంతకాలం నంబర్ 1గా నిలిచిన ఆల్‌రౌండర్ జడేజా ఒక్కడే. 2022 మే 9న ఐసీసీ టెస్టు ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో వెస్టిండీస్ ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్‌ను అధిగమించి జడేజా మొదటి స్థానం సాధించాడు.
ప్రస్తుతం అతడి ఖాతాలో 400 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి, బంగ్లాదేశ్ ఆటగాడు మెహిదీ హసన్ మిరాజ్ 327 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. టెస్టు ఫార్మాట్‌లో జడేజా టీమిండియాకు అమూల్యమైన ఆస్తిగా మారాడు. బ్యాట్‌తో, బంతితో అద్భుత ప్రదర్శనలతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇప్పటివరకు 80 టెస్టుల్లో 3,370 పరుగులు, నాలుగు శతకాలు, 22 అర్ధ శతకాలు సాధించాడు. బౌలింగ్‌లో 323 వికెట్లు పడగొట్టాడు, అందులో 13 సార్లు నాలుగు వికెట్లు, 14 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి.

### ఇంగ్లండ్ సిరీస్‌లో జడేజా కీలకం

గత దశాబ్దంలో అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి లేకుండా తొలిసారి భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్తోంది. ఐదు టెస్టుల సిరీస్‌లో జడేజా జట్టుకు కీలక ఆటగాడిగా ఉంటాడు. అక్కడి పిచ్‌లపై అనుభవంతో స్పిన్ బౌలింగ్ యూనిట్‌ను సమర్థవంతంగా నడిపించనున్నాడు. అంతేకాదు, యువ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపుతూ సీనియర్‌గా బాధ్యతాయుతంగా వ్యవహరించనున్నాడు.

## మేము స్నేహితులం కాదు.. కేవలం పోటీదారులమే!



ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో బిజీగా గడుపుతున్నాడు. ప్రస్తుతం దోహాలో డైమండ్ లీగ్‌లో పోటీపడుతున్న అతడు, త్వరలో పోలాండ్‌లో జావెలిన్ త్రోలో బరిలోకి దిగనున్నాడు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పాక్ అథ్లెట్ అర్షద్ నదీమ్‌తో మునుపటిలా సన్నిహితంగా ఉండబోనని నీరజ్ స్పష్టం చేశాడు. గురువారం మీడియాతో మాట్లాడుతూ, తాను, నదీమ్ ప్రాణ స్నేహితులం కాదని, కేవలం పోటీదారులమేనని అన్నాడు. "మీరు అనుకుంటున్నట్లు నేను, నదీమ్ సన్నిహితులం కాదు. ఇటీవల రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల వల్ల చాలా మార్పులు వచ్చాయి. ఇకపై నదీమ్‌తో స్నేహపూర్వకంగా ఉండను. ఇది నేను మరోసారి స్పష్టం చేస్తున్నా. అయినప్పటికీ, నాతో గౌరవంగా మాట్లాడేవారితో నేను అలాగే వ్యవహరిస్తాను. అథ్లెట్లుగా మేము ఒకరితో ఒకరు మాట్లాడుకుంటాం, అంతే. నాకు ప్రపంచవ్యాప్తంగా మంచి స్నేహితులు ఉన్నారు. వారంతా తమ దేశానికి పతకం సాధించాలనే లక్ష్యంతో పోటీపడతారు. నేనూ అంతే," అని నీరజ్ తెలిపాడు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల సమయంలో కొందరు నీరజ్, అతడి కుటుంబాన్ని విమర్శించారు. నీరజ్ చోప్రా క్లాసిక్ టోర్నమెంట్‌లో నదీమ్‌ను పాల్గొనమని ఆహ్వానించడమే దీనికి కారణం. దీంతో, ట్రోలర్లకు నీరజ్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. రెండు ఒలింపిక్ పతకాలతో దేశాన్ని గర్వపడేలా చేశానని, తన దేశభక్తిని ప్రశ్నించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు.

### పతకాల్లో పోటీ, హృదయాల్లో గౌరవం

పారిస్ ఒలింపిక్స్‌లో నీరజ్ రజతం సాధించగా, నదీమ్ 90 మీటర్ల దూరం జావెలిన్ విసిరి స్వర్ణం గెలిచాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణంతో అద్భుతంగా రాణించిన నీరజ్, ఈసారి రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఆ సమయంలో నీరజ్ తల్లి సరోజ్ దేవి, నదీమ్ కూడా తనకు కొడుకుతో సమానమేనని చెప్పారు. నదీమ్ తల్లి రజియా పర్వీన్ కూడా ఇద్దరు అథ్లెట్ల స్నేహాన్ని మెచ్చుకుంది. దాయాది దేశాల అథ్లెట్లు సోదరభావంతో వ్యవహరించడం క్రీడా స్ఫూర్తికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.

## టీమిండియా సిరీస్‌కు ఇంగ్లండ్ పేస్ ఆయుధం!



జూన్‌లో భారత జట్టుతో జరిగే టెస్టు సిరీస్ కోసం ఇంగ్లండ్ జట్టు సమగ్రంగా సిద్ధమవుతోంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి లేని టీమిండియాను ఎదుర్కొనేందుకు బెన్ స్టోక్స్ నాయకత్వంలోని జట్టు వ్యూహాత్మకంగా సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు న్యూజిలాండ్ మాజీ పేసర్ టిమ్ సౌథీని తమ కోచింగ్ సిబ్బందిలో చేర్చుకుంది. భారత్‌పై అత్యుత్తమ రికార్డు కలిగిన సౌథీని 'స్పెషలిస్ట్ స్కిల్స్ కన్సల్టెంట్'గా నియమించింది. మూడు ఫార్మాట్లలోనూ తన నైపుణ్యాన్ని అందించనున్న సౌథీ, ట్రెంట్‌బ్రిడ్జ్‌లో జింబాబ్వేతో జరిగే ఏకైక టెస్టుతో తన బాధ్యతలను ప్రారంభించనున్నాడు. టీమిండియాతో టెస్టు సిరీస్ వరకూ అతడు ఈ పాత్రలో కొనసాగుతాడని ఈసీబీ గురువారం ప్రకటించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సీజన్‌లో భాగంగా ఇంగ్లండ్, భారత్‌తో తలపడనుంది. ఈ కీలక సిరీస్‌ను ఈసీబీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. అందుకే అనుభవజ్ఞుడైన సౌథీకి ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. టెస్టు ఫార్మాట్‌లో ఇంగ్లండ్ పేసర్లను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అతడు తోడ్పడతాడని బోర్డు ఆశిస్తోంది. అదే సమయంలో, సౌథీ ది హండ్రెడ్ లీగ్‌లో బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ తరఫున ప్రధాన పేసర్‌గా ఆడనున్నాడు. గుర్తుండిపోయే విజయాల్లో కీలక పాత్ర న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ సౌథీ గత డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరయ్యాడు. టీమిండియాపై చిరస్మరణీయ సిరీస్ విజయంలో కీలకంగా వ్యవహరించిన అతడు, కివీస్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. మూడు ఫార్మాట్లలోనూ తన పేస్ బౌలింగ్‌తో ముందంజలో నిలిచిన సౌథీ, వన్డేల్లో 221, టెస్టుల్లో 391, టీ20ల్లో 164 వికెట్లు సాధించాడు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్
- కొత్తూరు ఐకెపి కొనుగోలు కేంద్రం తనిఖీ

**బొంరాస్ పేట,మే 15 (జనం సాక్షి):** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలిసి గురువారం కొత్తూరు గ్రామం లో పర్యటించారు.ఈ సందర్భంగా ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగో లు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన నిర్వాహకు లకు పలు సూచనలు చేశారు. రైతుల నుండి వచ్చే వరి ధాన్యాన్ని త్వరితగతిన వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాల న్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు.ఆయన వెంట డిఆర్డిఓ పిడి శ్రీనివాస్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నకిలీ వీసాలు తయారుచేసే ముఠా గుట్టురట్టు








- ఐదుగురు ముఠా సభ్యులో ఇద్దరి అరెస్టు, ముగ్గురు పరార్
- రిమాండ్‌కు తరలింపు
- టూరిస్ట్ వీసాతో వెళ్తుండగా అడ్డుకున్న ఎయిర్‌పోర్ట్ అధికారులు
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసిపి శ్రీకాంత్ గౌడ్

**శంషాబాద్, మే 15 (జనంసాక్షి) :** నకిలీ వీసాలు తయారు చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలను ఏసిపి శ్రీకాంత్ గౌడ్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 8 మంది మహిళలు కువైట్ వెళ్లడానికి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చారు.. అనుమానం వచ్చిన ఎయిర్‌పోర్ట్ అధికారులు వారి దగ్గర ఉన్న వీసాలను తనిఖీలు చేయగా..అవి నకిలీ అని తేలడంతో విచారణ చేపట్టారు. విచారణలో చిలుకూరు బాలాజీ శివ కుమార్ అనే పాస్‌పోర్ట్ ఏజెంట్లు నకిలీ వీసాలు తయారుచేసినట్టు తేలింది. దీంతో రంగంలోకి దిగిన ఔట్ పోస్ట్ పోలీసులు, ఎస్వోటీ పోలీసులు సంయుక్తంగా నిందితులను పట్టుకున్నారు.
వారిని విచారణ చేయగా హైదరాబాదులోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన చిలుకూరు బాలాజీ, అన్నమయ్య జిల్లాకు చెందిన ఎస్. శివకుమార్ కడప జిల్లాకు చెందిన గోపాల్ అయిదుగురు కలిసి ముఠా సభ్యులుగా ఏర్పడ్డారు. వీరు పశ్చిమగోదావరి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతా లోని నిరక్షరాస్యులైనవారిని టార్గెట్‌గా చేసుకొని, గల్ఫ్ దేశాలకు వెళ్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశ కల్పించి నమ్మించారు, ఇందులో భాగంగానే వారికి నకిలీ వీసాలను పాస్‌పోర్ట్‌లను తయారుచేసి అంటగట్టారు. పేద మహిళలను గల్ఫ్ దేశాల్లో పనికి తీసుకెళుతున్నామని చెప్పి టూరిస్ట్ వీసా కింద పంపిస్తున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి మస్కట్కు వెళ్లడానికి కావలసిన నకిలీ వీసాలను సృష్టించారు. ఇందుకోసం నకిలీ పత్రాలు స్టాంపులను తయారు చేశారు.
దర్యాప్తులో భాగంగా చిలుకూరు బాలాజీ, శివకుమార్ లను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద నుంచి టాంపర్ పాస్పోర్టులు, వీసాలు 14, మస్కట్ వెళ్లే టికెట్లు 16, స్టాంపులు 2 , స్టాంపు ప్యాడులు ఒకటి, ఏడు సెల్ ఫోన్లు లాప్టాప్ లు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులను త్వరలో పట్టుకుంటామని ఏసిపి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీడ్ కంపెనీలకు మంత్రి సీతక్క హెచ్చరిక





- రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం

**ములుగు ప్రతినిధి, మే 15(జనంసాక్షి) :** హైదరాబాదులోని అగ్రికల్చర్ డైరెక్టరేట్ కార్యాలయంలో విత్తన కంపెనీల ప్రతినిధులతో మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. వాజేడు, వెంకటాపూర్ మండలాలతో పాటు కన్నాయిగుడెంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ పక్షంలో కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టి, క్రిమినల్ చర్యలు చేపడుతామని హెచ్చరించారు. విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పలువురు వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా పలు సీడ్ కంపెనీల తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసి.. నకిలీ విత్తనాలతో నష్టపోయిన పంటలను, రైతుల వివరాలను సేకరించి అనుగుణంగా రైతులకు కంపెనీల ద్వారా నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ కు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసే సహించేది లేదని.. క్రిమినల్ కేసులు నమోదు చేసి జైల్లో వేస్తామని మంత్రి సీతక్క హెచ్చరించారు.

## రైతును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు

- 15 రోజులైనా కూడా తూకం వేయని డిసిఎంఎస్ అధికారులు
- రైతంటే అంత చిన్న చూపా?
- వర్షణానికి తడిసి మొలకలు వచ్చిన వడ్లు





**దోమ మే 15(జనం సాక్షి) :** దోమ మండల కేంద్రంలో డీసీఎంఎస్ అధికారుల నిర్లక్షం వలన రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. రాత్రనక పగలనక కష్టపడి పండించుకున్న పంటను కోసి అమ్మి ఉన్న అప్పు కొంతైనా తీర్చుదామని అనుకున్న రైతు ఎన్నో ఆశలతో చేతికొచ్చిన వరి పంటను డీసీఎంఎస్ కు అమ్ముదామని కిరాయి వాహనంలో తీసుకొని వెళితే 15 రోజులైనా కొనుగోలు చేయని డిసిఎంఎస్. రైతులు వెళ్లి అధికారులను అడిగితే లోడ్ చేసి ఎక్కడ పెట్టుకోవాలని పై అధికారులు ధాన్యం నింపడానికి వాహనాలను పంపీయడం లేదని సమాధానం చెపుతున్నారని రైతులు అంటున్నారు. వర్షానికి తడిసి సంచుల లో ఉన్న వడ్లకు మొలకలు వస్తున్నాయని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల కష్టాలు కష్టాలు తీరే విదంగా చూడాలని వాపోతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
16 మే 2025

# అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా?

- కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు
- సబితమ్మకు ఇప్పుడు తెలంగాణ గుర్తుకు వచ్చిందా?
- మండిపడ్డ మంత్రి సీతక్క



**ములుగు, మే15 (జనంసాక్షి) :** మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్నారని బిఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం బిఆర్ఎస్‌కు పరిపాటిగా మారిందని అంటూ ఫైర్ అయ్యారు. ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ సందర్భంగా నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్స్ వరంగల్ వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు- చేసిన ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. హెరిటేజ్ వాక్ సక్సస్ కావడంతో బిఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారని, కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని సె-టైర్లు వేశారు. ఇవంకా ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడు.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గుళ్లలోకి కాళ్ళు కడుక్కొని వెళ్ళడం గిరిజన సంప్రదాయం.. అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళకు నీళ్ళు పోసింది. దానిని పట్టు-కొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బద్నాం చేస్తున్నారని, నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం మీ దురహంకారం కదా.. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా..? అంటూ నిప్పులు చెరిగారు. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసని.. అబద్ధాలు కాకుండా వాస్తవాలు మాట్లాడితే బాగుంటుందని సూచించారు. అబద్ధాలకు అంబాసిడర్ గా సబితమ్మ మారకూడదన్నారు. అధికారం పోయాక.. ప్రజలు, ఆత్మగౌరవం మీకు గుర్తుకు వచ్చిందా..? అని ప్రశ్నించారు.

# పుష్కర స్నానాలు ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు, తొగుట పీఠాధిపతి





**కాళేశ్వరం, మే 15 (జనంసాక్షి) :** గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా సరస్వతి నది ఉద్భవించిన ప్రాంతంలో గురువారం ఉదయం 5.44 గంటలకు సరస్వతి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. గోదావరి పుష్కరాల సమయం లో (వీఐపీ ఘాట్) సరస్వతి ఘాట్ లో సరస్వతి నది పుష్కరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఆయన సతీమణీ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హై కోర్టు న్యాయ మూర్తి సూరపల్లి నంద, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతి పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. విఘ్నాధిపతి అయిన విఘ్నేశ్వరునికి తొలి పూజలు చేసిన తరువాత సరస్వతి నది పుష్కర మహోత్సవ వేడుకలకు అంకురార్పరణ చేశారు. అత్యంత అరుదైన సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుష్కర స్నానలను కూడా నిర్వహించారు. శ్రీ గురుమ దానానంద సరస్వతి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి పుష్కర స్నానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులు. అనంతరం శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి, శ్రీ శుభానంద దేవి, సరస్వతి మాత ఆలయాలను ప్రముఖులు సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ కొన్ని రోజులుగా అవిశ్రాంతంగా శ్రమించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పుష్కర స్నానాలు ఆచరించి చదువుల తల్లి సరస్వతి మాతా అశీస్సులు పొందాలని సూచించారు.

# బహుభార్యత్వం దుర్వినియోగాన్ని సహించం

- ఖురాన్ మేరకు భార్యలను సమానంగా చూసుకోవాలి
- అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు

**లక్నో, మే15 (జనంసాక్షి) :** అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ముస్లిం వ్యక్తి ఎంత మందినైనా పెళ్లి చేసుకోవచ్చని,కానీ దానికి సరైన కారణం ఉండాలన్నది. భార్యలందర్నీ ఆ వ్యక్తి సమానంగా చూసుకోవాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. భార్యలందర్నీ సమానంగా చూసుకోలేని పక్షంలో ముస్లిం వ్యక్తి మరో వివాహానికి అర్హుడు కాదని కోర్టు చెప్పింది.జస్టిస్ రుణ్ కుమార్ సింగ్ దేశ్వాల్ నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఈ తీర్పునిచ్చింది. బహుభార్యత్వాన్ని ఖురాన్ ఆమోదిస్తుందని, కానీ సరైన కారణం ఉండాలని కోర్టు చెప్పింది. ఖురాన్‌లో ఉన్న ఆ వెసలుబాటును స్వార్థ ప్రయోజనాల కోసం మగవాళ్లు వాడుకుంటున్నట్లు కోర్టు పేర్కొన్నది.షరతు ప్రకారం బహుభార్యత్వం ఆమోదంయోగ్యమని కోర్టు తెలిపింది. మొరాబాద్‌కు చెందిన జిల్లా కోర్టు ఓ పిటీషనర్‌కు సమన్లు జారీ చేసిన కేసులో.. అలహాబాద్ హైకోర్టు ఈ కీలక తీర్పును ఇచ్చింది. మొదటి పెళ్లి గురించి దాచి పెట్టాడని, రిలేషన్‌లో ఉన్న సమయంలో తనను లైంగికంగా వేధించాడని రెండో భార్య తన ఫిర్యాదులో పేర్కొన్నది. ముస్లిం చట్టాల ప్రకారం ఇస్లాంలో కొన్ని సందర్భాల్లో ఒకటి కన్నా ఎక్కువ పెండ్లిళ్లు చేసుకునే సౌలభ్యం ఉన్నట్లు హైకోర్టు తెలిపింది. కానీ దీనికి కొన్ని నిబంధనలు ఉంటాయన్నది. అయితే ఖురాన్ కల్పించిన ఆ పరిమితులను ఉల్లంఘిస్తూ దుర్వినియోగం చేస్తున్నట్లు కోర్టు పేర్కొన్నది. బహుభార్యత్వాన్ని ఖురాన్ ఆమోదించడానికి ఓ కారణం ఉందని, పూర్వం ఓ దశలో చాలా మంది మహిళలు వితంతువులు అయ్యేవారని, పిల్లలు అనాథలయ్యేవారని, అరబ్ దేశాల్లో ఇలాంటి సమస్య ఎక్కువగా ఉండేదని, మదీనాలో ముస్లిం వర్గానికి తీవ్ర నష్టం జరిగిందని, ఆ దశలో బహుభార్యత్వాన్ని ఖురాన్ అంగీకరించిందని, అనాథ పిల్లలను.. వారి తల్లులను రక్షించే ఉద్దేశంతో ఆ ప్రతిపాదన జరిగినట్లు- కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది.

# విజయవాడ బస్టాండ్‌లో రెచ్చిపోయిన గ్యాంగ్

- అధికారిపై పిడిగుద్దులు గుద్ది పరార్

**విజయవాడ, మే 15 (జనంసాక్షి) :** విజయవాడ బస్టాండ్‌లో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. శ్రీశైలం పవర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణారావుపై విచక్షణారహితంగా ఆ గ్యాంగ్ దాడికి పాల్పడ్డారు. గురువారం ఉదయం శ్రీశైలం నుంచి విజయవాడ విద్యుత్ సౌదాకు విధి నిర్వహణపై వచ్చిన కృష్ణారావుపై గంజాయి బ్యాచ్ పిడిగుద్దులతో దాడి చేసి అక్కడి నుండి పారిపోయారు. వీరి నుంచి తప్పించుకుని ప్రాణాలు దక్కించుకున్న కృష్ణారావు అక్కడి నుంచి బస్టాండ్‌లోకి పరుగులు తీశారు. అనంతరం కొండపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. కృష్ణారావు బస్ దిగి వస్తుండగా సిటీ బస్ టెర్మినల్ దగ్గర ఈ ఘటన జరిగింది. అయితే దాడి చేసిన వారు ఎవరో తనకు తెలియదని, నగదు, వస్తువులు ఏవీ అడగలేదని కేవలం దాడి చేసి పారిపోయారని చెప్పారు. బాధితుడు కృష్ణారావు మాట్లాడుతూ ... 'బస్టాండ్ నుంచి ఆటో కోసం వచ్చాను. వెనక నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చి నన్ను బాగా కొట్టారు. చంపేయబోయారు. వాళ్లు ఎవరో నాకు తెలీదు. ఎందుకు కొట్టారో కూడా తెలియదు. డబ్బులు ఏమీ అడగలేదు. సైలెంట్‌గా వచ్చి బాగా కొట్టి వెళ్లిపోయారు. వాళ్లు బాగా మత్తులో ఉన్నట్టున్నారు. మొహంపై దెబ్బలు తగిలాయి. గుండెలపై తన్నారు. వారిని నుంచి తప్పించుకుని పారిపోయారు. దాడి జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేరని వివరించారు.

# లభ్యం కాని మాజీమంత్రి కాకాణి ఆచూకీ

- రెండు నెలలుగా ముమ్మరంగా గాలింపు



**నెల్లూరు, మే15 (జనంసాక్షి) :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. క్వార్జ్ కేసులో రెండు నెలలుగా కాకాణి తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో హైదరాబాద్, బెంగళూర్‌లో నెల్లూరు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాకాణి బంధువుల ఇళ్లు, ఫాంహౌజ్‌లలో గాలిస్తున్నారు. మరోవైపు క్వార్జ్ కేసులో మరో 12 మందికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. క్వార్జ్ కేసులో మాజీ మంత్రి కాకాణి ఏ4గా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి గతంలో హైకోర్టును ఆశ్రయించి బెయిల్ పొందే ప్రయత్నాలు చేశారు. అయితే ఆ ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. దాంతో రెండు నెలలుగా మాజీ మంత్రి పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. హైదరాబాద్‌లో కొద్దిరోజులు, బెంగళూర్‌లో కొన్నాళ్లు ఉంటూ పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు తెలుస్తోంది. కనీసం ఇంట్లో వాళ్లకు కూడా వాట్సప్ కాల్ మాట్లాడనట్లు సమాచారం. నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో రెండు పోలీసు బృందాలు బెంగళూరులో పెద్ద ఎత్తున్న విస్తృతంగా జల్లెడపడుతున్నాయి. రి-టైర్డ్ ఐఆర్ఎస్ అధికారికి సంబంధించిన ఇళ్లల్లోనే కొంతకాలం వరకు తలదాచుకున్నట్లు సమాచారం. దీంతో పోలీసులు అక్కడ కూడా తనిఖీలు చేపట్టారు. బెంగళూరులోని కాకాణి స్నేహితులు, బంధువులకు సంబంధించిన ఇళ్లు, ఫాంహౌజ్‌లు, గెస్ట్‌హౌజ్‌లలో కూడా పోలీసులు జల్లెపడుతున్నారు. కాకాణి కోసం గాలింపు ముమ్మరం చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో కూడా రెండు పోలీసు బృందాలు కాకాణి కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ సాగిస్తున్నారు. ఈ క్రమంలో సుప్రజ అనే మహిళ అకౌంట్‌లోకి భారీ ఎత్తున కోట్లాది రూపాయలు ట్రాన్సాక్షన్స్ జరిగినట్లు గుర్తించారు. ఆమె ఇంటికి కూడా పోలీసులు వెళ్లి నోటీ-సులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె నోటీ-సులు తీసుకోకపోవడంతో ఇంటి గోడకు నోటీ-సులు అంటించారు. అలాగే ఈ కేసులో 12 మందిని పోలీసులు గుర్తించారు. అందులో కాకాణి అల్లుడు కూడా ఉన్నారు. వీరందరికీ నోటీసులు ఇచ్చేందుకు వెళ్లగా.. వారు లేకపోవడంతో ఇంటి గోడలకు నోటీసులు అంటించి వస్తున్నారు. రెండు మూడు సార్లు నోటీసులు ఇచ్చాక వారు స్పందించకపోతే వారందరినీ కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం క్వార్జ్ కేసు విచారణ చాలా వేగవంతంగా సాగుతోంది. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీసులు బృందాలు యాక్టివ్‌గా పనిచేస్తూ గతంలో కంటే కూడా గాలింపును ముమ్మరం చేశాయి. ఏ క్షణమైనా కాకాణి గోవర్ధన్‌ను అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# క్యాన్సర్‌తో మృతి చెందిన కుటుంబానికి ముఖ్యమంత్రి బాసట

- రూ.7లక్షల ఆర్థిక సాయం అందించిన సిఎం రేవంత్



**హైదరాబాద్, మే15 (జనంసాక్షి) :** అల్లారుముద్దుగా పెంచుకున్న పాప ఒక్కసారిగా అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రికి తీసుకెళితే బ్లడ్ క్యాన్సర్ అని పరీక్షల్లో తేలింది. పాపను రక్షించుకునేందుకు తల్లిదండ్రులు రూ.లక్షలు వెచ్చించారు. విషయం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో పాప చికిత్సకు రూ.8 లక్షలు మంజూరు చేశారు. వ్యాధి ముదరడంతో పాప ప్రాణాలు కోల్పోయింది. ఆమె చికిత్సకు గతంలో చేసిన వ్యయానికి సంబంధించి మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ నుంచి విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో అధికారులు ఆ మొత్తాన్ని విడుదల చేశారు. హైదరాబాద్ ఎల్బీ నగర్‌కు చెందిన రఘు, మంజుల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె వేదవల్లికి (5) 2022లో తీవ్ర జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు బ్లడ్ క్యాన్సర్ అని తేల్చారు. పాపను రక్షించుకునేందుకు రెండేళ్ల పాటు తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. చికిత్స వ్యయం నానాటికీ భారమవడంతో 2024లో ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో వేదవల్లి చికిత్సకు అవసరమైన రూ.8 లక్షలను మంజూరు చేశారు. చికిత్స అందించినప్పటికీ అప్పటికే వ్యాధి తీవ్రత పెరగడంతో గతేడాది చివరలో వేదవల్లి మరణించింది. ఆమె చికిత్సకు గతంలో ఆ కుటుంబం పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది. దీంతో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.7 లక్షలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు మంజూరు చేసిన రూ.7 లక్షల చెక్కును సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు వేదవల్లి తండ్రి రఘుకు గురువారం సచివాలయంలో అందజేశారు.

# ఏపీలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

- 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులు
- 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఎస్‌పిబి సమావేశంలో సిఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి, మే 15 (జనంసాక్షి) :** రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం పాలసీలతో పెట్టు-బడులకు దేశ, విదేశీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఆరు ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టు-బడులకు ఆమోదం తెలిపామని వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డు ద్వారా పర్యవేక్షణ జరగాలన్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 6వ ఎస్ఐపీబీ సమావేశం ముగిసింది. 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పెట్టుబడులకు సమావేశంలో ఆమోదం లభించింది. ఎనర్జీ, టూరిజం, ఐటీ-, ఎలక్ట్రానిక్స్ శాఖలకు సంబంధించి పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకువచ్చాయి.రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకొచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు సంబంధించి... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. ఆయా సంస్థల పెట్టు-బడులు, క్షేత్రస్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, గదుల కొరత ఉందన్న ముఖ్యమంత్రి.. పెద్దఎత్తున టల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుందని వ్యాఖ్యానించారు. 50 వేల రూమ్‌లు అందుబాటు-లోకి తేవాలి అనేది తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. హోటల్ రూమ్‌ల ధరలు అందుబాటు-లో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారని వెల్లడించారు. ఈ సమావేశానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేశ్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె. విజయానంద్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్.. ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో దురుసు ప్రవర్తన

- నటుడు బెల్లంకొండ శ్రీనివాస్‌పై కేసు



**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** తనపై నమోదైన కేసు విషయంలో నటుడు బెల్లంకొండ శ్రీనివాస్ గురువారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. అవసరం ఉన్నప్పుడు కోర్టు విచారణకు హాజరు కావాలని నటు-డికి పోలీసులు సూచించారు. శ్రీనివాస్ కారును సీజ్ చేసి, నోటీసులు ఇచ్చి పంపారు. జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీలో నివాసం ఉంటున్న బెల్లకొండ శ్రీనివాస్ ఇంటికి వెళ్తున్న సమయంలో రాంగ్ రూట్‌లో కారు నడిపినట్లు- పోలీసులు గుర్తించారు. తనని అడ్డుకున్న ట్రాఫిక్ పోలీసుతో ఆయన దురుసుగా ప్రవర్తించారు. దీంతో, ఆయనపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. టాలీవుడ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్‌కు జూబ్లీహిల్స్ పోలీసులు నోటీ-సులు ఇచ్చారు. ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని ఇప్పటికే కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు, వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా బెల్లంకొండ శ్రీనివాస్ వ్యవహరించినట్లు ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే శ్రీనివాస్ కారును పోలీసులు సీజ్ చేసినట్లు- తెలుస్తోంది. ఈనెల 13న రోడ్ నెంబర్ 45 మీదుగా జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీలోని చౌరస్తా వద్ద హీరో బెల్లంకొండ శ్రీనివాస్ రాంగ్‌రూట్‌లో తన నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అదే సమయంలో అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న నరేష్ అనే కానిస్టేబుల్ బెల్లంకొండ శ్రీనివాస్ వాహనాన్ని అడ్డుకున్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లొద్దంటూ ఆయనకు సూచించారు. అయితే, కానిస్టేబుల్ చెబుతున్నప్పటికీ కూడా బెల్లంకొండ శ్రీనివాస్ ఏమాత్రం వినకుండా రాంగ్ రూట్‌లోనే ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు బెల్లంకొండ శ్రీనివాస్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. కారును ఆపేందుకు ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రయత్నించగా.. ఆయన మీదుగానే కారును పోనిచ్చేందుకు హీరో యత్నించారు. ఇదే సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హీరోపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# సినిమాపై ఆంధ్రా ఆధిపత్యాన్ని సహించం

- తెలంగాణ సినిమా వేదిక డిమాండ్




**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** ప్రత్యేక రాష్ట్రంలో నేటికీ తెలంగాణ సినిమాపై ఆంధ్రా ఆధిపత్యం కొనసాగుతుందని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తెలంగాణ సినిమా వేదిక స్పష్టం చేసింది. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేదిక రాష్ట్ర కన్వీనర్ లారా, కో కన్వీనర్ మోహన్ బైరాగి, గౌరవ సలహాదారులు ప్రఫుల్ రాంరెడ్డిలు తెలంగాణ సినిమాకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. రాష్ట్రంలో తెలంగాణ ఫిలిం చాంబర్ పేరుకే ఉందని, చిన్న సినిమాలకు థియేటర్లు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఆంధ్ర సినీ పెద్దల చేతుల్లోనే థియేటర్లు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో థియేటర్ మాఫియా సాగుతున్నదని ఆరోపించారు. 1993 అక్టోబర్ 4న మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏర్పడిందని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా ఇంకా ఉమ్మడిగా ఎందుకు కొనసాగుతున్నది ప్రశ్నించారు. ఫిలిం చాంబర్‌లు ఆంధ్రా, తెలంగాణ వేర్వేరుగా ఉండాలని, కానీ ప్రస్తుత చాంబర్‌లో నేటికీ ఆంధ్రా పెత్తనం సాగుతున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గద్దర్ అవార్డును తెలంగాణ సినిమాలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆంధ్రా, తెలంగాణ సినిమా రంగాల విభజన జరగాలని, తెలంగాణ ఫిలిం చాంబర్‌లో వెంటనే మార్పులు చేయాలని కోరారు. ఇక్కడి సినిమా కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సీనియర్ కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ సినిమా రంగంలోని 24 క్రాఫ్టుల్లో ఈ ప్రాంతం వారే అధికంగా ఉండేలా చూడాలన్నారు. చిన్న సినిమాలకు నెలకు 14 రోజుల్లో అన్ని థియేటర్లలో అవకాశం ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఫిలిం చాంబర్‌కు నూతన భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ఆధారంగా నిర్మించే చిత్రాలకు 30 శాతం సబ్సిడీ ఇవ్వాలని, చిన్న సినిమాల నిర్మాణంలో 20 శాతం రాయితీ కల్పించాలన్నారు. తెలంగాణ సినిమా విభజన జరిగేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# రెండోరోజూ సిట్ ముందుకు ధనుంజయ్ రెడ్డి



**విజయవాడ, మే15 (జనంసాక్షి) :** ఏపీ లిక్కర్ స్కాం కేసులో ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి రెండో రోజు గురువారం సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. లిక్కర్ స్కాంకు సంబంధించి ఇరువురిని సిట్ అధికారులు ప్రశ్నించారు. విచారణలో ఇద్దరిని వివిధ రూపాలలో సిట్ ప్రశ్నించింది. అయితే బుధవారం సరైన సమాధానాలు చెప్పకపోవడంతో గురువారం మరోసారి విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీ-సులు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఉదయం 10 గంటలకు ధనుంజయ్, కృష్ణ మోహన్ రెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. కృష్ణ మోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డిలను వేరు వేరుగా విచారించారు. అయితే మద్యం కుంభకోణంలో తమ పాత్ర లేదని వారు చెబుతుండగా.. ప్రమేయం ఉన్నట్లు- ఆధారాలు ఉన్నాయని సిట్ అధికారుల మాటగా ఉంది..మద్యం కుంభకోణం కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. ముఖ్యంగా రెండు రోజుల క్రితం ఈ కేసులో ఏ33గా ఉన్న గోవిందప్ప బాలాజీని మైసూర్‌లో సిట్ అధికారులు అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించి విచారించారు. గోవిందప్పకు ఈనెల 20 వరకు రిమాండ్ విధించడంతో వెంటనే జైలుకు తరలించారు. అంతేకాకుండా గోవిందప్ప రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడించింది సిట్. గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ కుంభకోణంలో బాలాజీ గోవిందప్ప కీలక పాత్ర పోషించారని, జగన్ కుటుంబానికి సన్నిహితంగా ఉండే వ్యక్తి కాబట్టే ఈ స్కాంలో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు రిమాండ్ రిపోర్టులో తెలిపారు. మద్యం కంపెనీల నుంచి వచ్చిన ముడుపులతో బాలాజీ వ్యక్తిగతంగా లబ్ధి పొందారని.. భారీగా స్థిరాస్తులు సంపాదించినట్లు సిట్ వెల్లడించింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370